
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :32 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు బుధవారం 10 జూన్ 2026 పేజీలు :12 వేల రూ5 /-


# రేవంత్ మైండ్ గేమ్ లో కేసీఆర్...

**హైదరాబాద్, జూన్ 9:**కేసీఆర్ దమ్ముంటే అసెంబ్లీకి రావాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చ పెడదాం. ఒకవేళ ఆ చర్చలో నేను ఓడిపోతే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణలు చెబుతా" "వచ్చే ఎన్నికల్లో నా సంగతి చూస్తానంటున్న కేసీఆర్ కు పాలమూరు గడ్డపై సవాలు విసురుతున్నా. నిన్ను మళ్లీ మొలకెత్తనివ్వం. మీ పార్టీ జెండాలు ఎగురనివ్వం. గద్దెలు కూలుతాయి. పార్టీ గుర్తును మర్చిపోవాల్సిందే" "వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావటం ఖాయం. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్. కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు తథ్యం. వచ్చే ఎన్నికల్లో ఆయన డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించిన ఊళ్లలో కేసీఆర్ ఓట్లు



అడగాలి. నేను ఇందిరమ్మ ఇళ్లు కట్టిన ఊళ్లల్లో ఓట్లు అడుగుతా. ఇలా చేస్తే కేసీఆర్ కు డిపాజిట్లు కూడా రావు'. "పాలూమరు ప్రాజెక్టులపై పాదయాత్ర చేస్తామని బీఆర్ఎస్ నాయకులు బయలుదేరారు. పాలమూరు నుంచి కాశీ వరకు పొర్లుదండాలు పెట్టినా వాళ్ల పాపాలు తీరవు. ప్రజలు క్షమించరు" "ప్రజలు ఇచ్చిన ధైర్యంతో గల్లీలో ఉండే కేడీతోనైనా.. ఢిల్లీలో ఉండే మోడీతో అయినా కొట్లాడతా. కేసీఆర్ మేకవన్నె పులి అని గుర్తించక రెండుసార్లు ముఖ్యమంత్రి చేశాం. దొంగలకు సద్దులు మోసే వారితో జాగ్రత్తగా ఉండాలి. మన వారైనా అప్రమత్తత అవసరం. వనపర్తిలో ఒకరు.. పాలమూరులో ఒకరు మోపు అయ్యారు.తాజాగా మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ప్రజాపాలన – ప్రగతి ఉత్సవాల సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో కీలకమైనవి.,... - మిగతా3లో

## పార్లమెంటులో స్పెషల్ మెజారిటీ కోసం

# ఎన్‌డీయే ప్రయత్నాలు!

**ఇంటర్నెట్ డెస్క్:** పార్లమెంటులో కూడా టీఎంసీ ఎంపీలు తిరుగుబాటు బావుటా ఎగరవేయవచ్చన్న వార్తల నడుమ మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. త్వరలో లోక్‌సభలో కూడా ఎన్‌డీఏ మూడింట రెండు వంతుల స్పెషల్ మెజారిటీ సాధించే అవకాశం ఉందని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇటీవల అధికార పార్టీ ప్రవేశపెట్టిన బిల్లు వీగిపోయిన విషయం తెలిసిందే. ఏప్రిల్‌లో ఈ బిల్లుపై లోక్‌సభలో జరిగిన ఓటింగ్‌లో మొత్తం



528 మంది ఎంపీలు పాల్గొన్నారు. దీంతో, స్పెషల్ మెజారిటీ మార్కు 352గా మారింది. ఇందులో 298 మంది ఎంపీలు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా 230 మంది ఎంపీలు వ్యతిరేకించారు. అనుకూల ఓట్లు మేజిక్ ఫిగర్‌ను (352 ఓట్లు) దాటకపోవడంతో బిల్లు వీగిపోయింది. స్పెషల్ మెజారిటీ సాధించాలంటే ఓటింగ్‌లో పాల్గొనే సభ్యులలో మూడింట రెండు వంతుల (2/3) మంది బిల్లుకు మద్దతు ఇవ్వాలి. వీరి సంఖ్య సభ మొత్తం సభ్యుల సంఖ్యలో (543) సగానికి పైగా ఉండాలి. ఈ రెండూ కుదిరితేనే స్పెషల్ మెజారిటీగా పరిగణిస్తారు. పార్లమెంటు వేదికగా తృణమూల్‌లో చీలిక తప్పదన్న అంచనాలు వెలువడుతున్న నేపథ్యంలో అధికార ఎన్‌డీఏ కూటమి సంఖ్యాబలం స్పెషల్ మెజారిటీకి మరింత చేరువ అవుతుందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. తనకు 20 ఎంపీల మద్దతు ఉందని టీఎంసీ ఎంపీ కాకోలీ ఘోష్ దస్తీదార్ పేర్కొన్నారు. చట్టప్రకారం టీఎంసీలో చీలిక తెచ్చేందుకు ఆయనకు మరో ఎంపీ మద్దతు అవసరం. తరువాత వీరంతా లోక్‌సభలో ఒక బృందంగా ఎన్డీయేకు మద్దతు - మిగతా3లో

## తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

# X అకౌంట్ హ్యాక్..



**హైదరాబాద్, జూన్ 9 :** సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ భద్రత కోసం పనిచేసే తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీ) సోషల్ మీడియా ఎక్స్ అకౌంట్ హ్యాక్ అయింది. ఒకప్పుడు దేశంలోనే అత్యుత్తమ సైబర్ సెక్యూరిటీ సంస్థగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గుర్తింపు పొందింది. మే 22వ తేదీన జరిగిన ఈ హ్యాకింగ్ ఘటనను అధికారులు దాదాపు 20 రోజుల అవుతున్నా గుర్తించలేకపోయారు. అయితే ఈ వ్యవహారం బయటకు వచ్చిన తర్వాతే సంబంధిత అధికారులు అప్రమత్తమయ్యారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం, - మిగతా3లో

## బీఆర్ఎస్ నేతలు తెలంగాణను

# దోపిడీ చేశారు...

**: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**జనగామ, జూన్ 9:** ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రివర్గం 18 గంటలు పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఏదో ఒక అభాండం వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నాడు జిల్లాలోని చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన భట్టి.. 33/11ఎజ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సన్నబియ్యం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. పేదలకు చెందాల్సిన సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని ఆరోపించారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం ఆపడం లేదని



డిప్యూటీ సీఎం వెల్లడించారు. 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తుల దయాదక్షిణ్యాల కోసం రైతులు ఎదురు చూసేలా కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ - మిగతా3లో



## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు

# ఏటీఎంలుగా మారాయి

**ధాన్యం కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వంపై రాంచందర్ రావు విమర్శలు**

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని వ్యాఖ్య**

**కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు**

తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన - మిగతా3లో

## భారత్ అణ్వాయుధాల్ని బయటపెట్టిందా.. కేంద్ర పాలసీ

# మారిందా..?



ఇండియా దగ్గర అణ్వాయుధాలు ఉన్న సంగతి తెలిసిందే. అయితే, వీటిపై ఇంకా స్పష్టత లేదు. కానీ, ఇటీవలే మన అణు సామర్థ్యానికి సంబంధించి కొన్ని సంచలన విషయాలు వెల్లడయ్యాయి. సిప్రి (స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సంస్థ వివిధ దేశాల్లో ఉన్న అయుధాలు, అణ్వాయుధాల గురించి వివరాలు వెలికితీస్తుంది. ఈ సంస్థ నివేదిక ద్వారా భారతీయ అణుసామర్థ్యం గురించి ప్రపంచానికి కీలక విషయాలు తెలిశాయి. సాధారణంగా ఏ దేశమైనా తమ అణు సామర్థ్యం గురించి బయటకు చెప్పదు. ఇండియా కూడా కొన్నేళ్లుగా అదే చేస్తూ వస్తోంది. కానీ, ఈసారి మాత్రం ఇండియా కొన్ని విషయాల్ని బయటపెట్టింది. దశాబ్దాలుగా ఉన్న తన విధానాన్ని మార్చుకుంది. ఇండియా తయారు చేసిన 12 అణ్వాయుధాలను బహిరంగపర్చినట్లు సిప్రి నివేదిక తేల్చింది. ఈ నివేదిక ప్రకారం.. ఇండియా అణు వార్ హెడ్లను రహస్యంగా దాచకుండా, ప్రయోగానికి సిద్ధం చేసి ఉంచింది. అంటే అవసరమైతే - మిగతా3లో

## 75 లక్షల

# టన్నుల మార్కు

# రికార్డు స్థాయిలో వరి...

**హైదరాబాద్, జూన్ 9:**వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. 2025-26 యాసంగి (రబీ) సీజన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణంలో, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని ప్రణాళికశాఖ నివేదిక స్పష్టం చేసింది. సాధారణంగా నీటి కొరత కారణంగా దేశంలోని మెజారిటీ రాష్ట్రాల్లో వానాకాలం (ఖరీఫ్)తో పోలిస్తే యాసంగిలో వరి సాగు చాలా తక్కువగా ఉంటుంది. కానీ తెలంగాణలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా ఈ యాసంగిలో రికార్డు స్థాయిలో 59.90 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు నివేదిక వెల్లడించింది. దేశం మొత్తం మీద జరిగిన యాసంగి వరి సాగు విస్తీర్ణంలో సగానికి పైగా వాటా కేవలం తెలంగాణదే కావడం విశేషం. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడులో 30.76 లక్షల ఎకరాలు, ఆంధ్రప్రదేశ్‌లో 17.29 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగైంది. ఇక వానాకాలం, యాసంగి రెండు సీజన్లను కలిపి చూస్తే.. అత్యధిక సాగు విస్తీర్ణంలో ఉత్తరప్రదేశ్ దేశంలోనే తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది.వరి సాగులోనే కాకుండా ధాన్యం కొనుగోళ్లలోనూ



తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. శనివారం నాటికి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు 72.30 లక్షల టన్నులకు చేరాయి. కొనుగోళ్లు మరో వారం పాటు సాగనుండటంతో ఈ సంఖ్య సులభంగా 75 లక్షల టన్నుల మార్కును దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా... - మిగతా3లో

## ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మారలేదు



కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, జూన్09:** తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.

వార్తాతరంగాలు

బుధవారం 10 జూన్ 2026

# సంపాదకీయం

## డిజిటల్‌తో పాటు క్యాష్ ట్రాన్సక్షన్స్

పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. అయితే చాలామంది ఆర్థికవేత్తలు డిజిటల్ చెల్లింపుల వల్ల నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గిపోయాయని.. మామూలు టీ షాప్ నుంచి కార్పొరేట్ హోటల్ వరకు అన్నింట్లోనూ డిజిటల్ విధానంలో చెల్లింపులు జరుగుతున్నాయని చెబుతున్నారు. కానీ డిజిటల్ యుగంలో కూడా పాత పరిస్థితే ఉంది. చదువుతుంటే ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇదే విధంగా ఉంది.ఇప్పటి కాలంలో డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. అలాగని నగదు చెల్లింపులు తగ్గుముఖం పట్టలేదు. దేశంలో చలామణి అవుతున్న నగదు లెక్కలు ఇదే విషయాన్ని తేడా తెలియచేస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 10 సంవత్సరాల కాలంలో ఇది మూడు రెట్లు పెరిగింది. 2017 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా నగదు చలామణి 13 లక్షల కోట్లు ఉండేది.. 2026 ఆర్థిక సంవత్సరానికి అదేకంగా 41 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో ఏటీఎం నెట్వర్క్ మాత్రం దారుణంగా పడిపోయింది. 2023లో 2.19 లక్షలకు పైగా ఏటీఎం యంత్రాలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 2.09 లక్షలకు పడిపోయింది. నగదు ఉపసంహరణలు కూడా 32.6 లక్షల కోట్ల నుంచి 28.6 లక్షల కోట్లకు పడిపోయాయి.ఏటీఎంల సంఖ్య పడిపోవడంతో నగదును ఉపసంహరించుకోవడానికి చాలామంది ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకుల నుంచి ఏటీఎంలోకి వచ్చే నగదు పడిపోయిందని తెలుస్తోంది.. మార్చి, ఏప్రిల్ నెలల్లో.. మన దేశ వ్యాప్తంగా ఏటీఎంలో స్టోర్ చేసేందుకు 94 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. మార్చి నెలలో 61 వేల కోట్లు.. ఏప్రిల్ నెలలో 54 వేల కోట్లు మాత్రమే సమకూర్చారు. ఇక కేంద్రీకృత బ్యాంకు నివేదిక ప్రకారం గడిచిన నెల 22 నాటికి దేశంలో మొత్తం 42.54 లక్షల కోట్ల నగదు చలామణిలో ఉందని తెలుస్తోంది. ఇక ఏటీఎం లావాదేవీలు గత ఏడాదితో పోల్చి చూస్తే 10.4% తగ్గింది.ప్రజలు డిజిటల్ చెల్లింపుల వైపు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం విచిత్రంగా ఉంది. డిజిటల్ తో పాటు నగదు లావాదేవీలు కూడా ప్రజలు నిర్వహిస్తున్నారు. అందువల్ల క్యాష్ స్పెక్యులేషన్ కూడా విపరీతంగా ఉంది. అయితే వచ్చే రోజుల్లో ఇది తగ్గే అవకాశం ఉంటుందా.. పెరుగుతుందా.. అనే విషయాలను ఇప్పుడే చెప్పలేమని ఆర్థిక నిపుణులు అంటున్నారు.రతదేశంలో ప్రస్తుతం నగదు వ్యవహారాలకంటే డిజిటల్ చెల్లింపులే ఎక్కువగా మారాయి. కిరాణం షాపు నుంచి పెద్ద పెద్ద చెల్లింపులు ఆన్ లైన్ లోనే జరుగుతున్నాయి. అయితే డిజిటల్ చెల్లింపులు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గడం లేదని కొన్ని నివేదికలను బట్టి తెలుస్తోంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం.. గత పదేళ్లలో చలామణిలో ఉన్న నగదు విలువ దాదాపు మూడు రెట్లు పెరిగింది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థలో నగదుకు ఎంత ప్రాధాన్యం ఉందో తెలుస్తోంది. ఆర్ బీఐ లెక్కల ప్రకారం 2017 ఆర్థిక సంవత్సరంలో దేశంలో చలామణిలో ఉన్న నగదు విలువ సుమారు రూ. 13 లక్షల కోట్లు. అయితే 2026 ఆర్థిక సంవత్సరం నాటికి ఇది రూ. 41 లక్షల కోట్లకు చేరింది. యూపీఐ, మొబైల్ వాలెట్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపు పద్ధతులు విస్తృతంగా అందుబాటులోకి వచ్చినప్పటికీ నగదు అవసరం తగ్గకపోవడం విశేషం.ఒకవైపు నగదు చలామణి పెరుగుతుండగా.. మరోవైపు ఎటీఎం నెట్‌వర్క్ క్రమంగా తగ్గుతోంది. 2023లో దేశవ్యాప్తంగా 2.19 లక్షలకు పైగా ఎటీఎంలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య సుమారు 2.09 లక్షలకు పడిపోయింది. బ్యాంకులు నిర్వహణ ఖర్చులు తగ్గించడం, డిజిటల్ లావాదేవీలపై ఎక్కువ దృష్టి పెట్టడం వంటి కారణాలు దీనికి ప్రధానంగా చెప్పబడుతున్నాయి. ఇదే సమయంలో ఎటీఎంల ద్వారా నగదు ఉపసంహరణలు కూడా క్రమంగా తగ్గుతున్నాయి. 2023లో ఎటీఎంల నుంచి సుమారు ?32.6 లక్షల కోట్ల నగదు ఉపసంహరించగా, ప్రస్తుతం అది ?28.6 లక్షల కోట్లకు తగ్గింది. అంటే ప్రజలు నగదును పూర్తిగా వదిలేయకపోయినా, అవసరమైనప్పుడు మాత్రమే తీసుకుంటూ రోజువారీ లావాదేవీలకు డిజిటల్ పద్ధతులను ఎక్కువగా వినియోగిస్తున్నారని అర్థమవుతోంది.యూపీఐ విప్లవం భారత ఆర్థిక వ్యవస్థలో పెద్ద మార్పును తీసుకొచ్చింది. చిన్న టీ దుకాణం నుంచి పెద్ద వ్యాపార సంస్థల వరకు క్యూ ఆర్ కోడ్ చెల్లింపులు సాధారణమయ్యాయి. దీంతో చిన్న మొత్తాల కోసం లకు వెళ్లాల్సిన అవసరం తగ్గిపోయింది. ఫలితంగా ఎటీఎలల వినియోగం తగ్గినా, అత్యవసర పరిస్థితులు, గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపార లావాదేవీల కోసం నగదు డిమాండ్ మాత్రం కొనసాగుతోంది.

# 2029 కోసం జనబంధన్ అడుగులు

**న్యూఢిల్లీ,జూన్ 8:**దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ప్రతిపక్ష ఇండియా కూటమి రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు, 2029 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఉమ్మడిగా ఎలా ఎదుర్కోవాలనే దానిపై వ్యూహాలను సిద్ధం చేయడానికి ఈ భేటీని ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరగనున్న ఈ ఇండియా జనబంధన్ సమావేశానికి మొత్తం 23 ప్రతిపక్ష పార్టీలు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ స్పష్టం చేసింది.ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేలతో పాటు పలు లెఫ్ట్ పార్టీలు, చిన్న పార్టీల నేతలు పాల్గొననున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ (పశ్చిమ బెంగాల్), డీఎంకే (తమిళనాడు) పరాజయం పాలవడంతో కూటమిలో సమీకరణాలు మారాయి. ముఖ్యంగా బెంగాల్‌లో తమ నేతలపై జరుగుతున్న దాడుల అంశాన్ని టీఎంసీ ఇక్కడ




లేవనెత్తనుంది. అలాగే కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్–బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందంటూ వచ్చిన ఆరోపణలపై సీపీఐ(ఎం) పార్టీ కాంగ్రెస్ నాయకత్వాన్ని వివరణ కోరనుంది.కూటమిలో భిన్నత్వంలో ఏకత్వం ఉందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ పేర్కొన్నప్పటికీ, కొన్ని కీలక పార్టీలు ఈ భేటీకి దూరం కావడం గమనార్హం. ఈ ప్రతిపక్షాల ఐక్యతా రాగానికి గండి కొడుతూ అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ, తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకే ప్రభుత్వంలో చేరడంతో డీఎంకే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే నిన్ననే మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు కేజ్రీవాల్‌తో ప్రత్యేకంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపినట్టుగా సమాచారం. కొన్ని పార్టీలు వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోతున్నప్పటికీ, మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టం చేశాయి.ఈ ప్రతిపక్షాల భేటీపై అధికార బీజేపీ తీవ్రంగా మండిపడింది. కూటమిలోని అంతర్గత లేఖలను ప్రస్తావిస్తూ బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమికి ఎలాంటి మిషన్ (లక్ష్యం), విజన్ లేవని వారిలో ఉన్నదల్లా కేవలం కన్ఫ్యూజన్, డివిజన్, పరస్పర ఆరోపణలు, పదవుల కోసం ఆరాటం మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. ఏదేమైనప్పటికీ, దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి జాతీయ అంశాలపై ఉమ్మడి ముఖచిత్రాన్ని ప్రదర్శించేందుకు ప్రతిపక్షాలు ఈ వేదికను వాడుకోనున్నాయి.

# బ్రహ్మోస్ కు ఫుల్ డిమాండ్...

**న్యూఢిల్లీ, జూన్ 9:**ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైనిక శక్తి ప్రపంచానికి తెలిసింది. పాకిస్తాన్‌లోని నిర్దిష్ట లక్ష్యాలపై దాడి చేయడంతోపాటు పాకిస్తాన్ చేసిన ప్రతిదాడులను భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఎలాంటి ప్రాణ నష్టం జరుగకుండా భారత్ జరిపిన దాడులతో ప్రపంచం దృష్టి ఒక్కసారిగా భారత ఆయుధాలపై పడింది. ఆపరేషన్ సిందూర్‌లో మన బ్రహ్మోస్ మిస్సైల్ సమర్థవంతంగా పనిచేసింది. దీంతో అత్యాధునిక సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను కొనుగోలుకు చాలా దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. తాజాగా దక్షిణ తూర్పు ఆసియా దేశాలకు విక్రయించడంలో ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. సింగపూర్‌లో జరిగిన షాంగ్రి--లా డైలాగ్‌లో భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, వియత్నాంతో ఒప్పందం ఇప్పటికే సంతకం అయిందని, ఇండోనేషియాతో చర్చలు తుది దశలో ఉన్నాయని ప్రకటించారు. ఇది భారత రక్షణ ఎగుమతుల రంగంలో కొత్త అధ్యాయం.వియత్నాంతో 2012 నుంచి చర్చలు కొనసాగుతున్నాయి. 14 ఏళ్ల తర్వాత ఒప్పందం ఖరారైంది. అయితే ఒప్పంద విలువ, ఎన్ని క్షిపణులు అందించాలనే వివరాలు ఇంకా గోప్యంగా ఉన్నాయి. ఇండోనేషియాతో కూడా చర్చలు దగ్గరలో ముగిసే దశలో ఉన్నాయి. ఇంతకు ముందు 2022లో ఫిలిప్పీన్స్‌తో సంతకం చేసిన 375 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 3,100 కోట్లు) ఒప్పందం కింద మూడు బ్రహ్మోస్ వ్యవస్థలను అందించాల్సి ఉంది. ఇప్పటికే రెండు సెట్లు డెలివరీ అయ్యాయి. ఫిలిప్పీన్స్ వీటిని తన తీరప్రాంత రక్షణ కోసం మోహరించింది.వియత్నాం--చైనా మధ్య దక్షిణ చైనా సముద్రంలో సరిహద్దు వివాదం ఉంది. ఈ నేపథ్యంలో బ్రహ్మోస్ విక్రయం చైనా అసంతృప్తిని రేకెత్తించవచ్చని భారత్ గతంలో జాగ్రత్తగా వ్యవహరించింది. ఇప్పుడు ఒప్పందం ఖరారు కావడం దక్షిణ తూర్పు ఆసియాలో చైనా ప్రభావానికి వ్యతిరేకంగా భారత్ సక్రమమైన రణనీతిని అవలంబిస్తోందని సూచిస్తుంది.

**బ్రహ్మోస్ క్షిపణి విశేషాలు..**

భారత్--రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణికి భారతప్రదేశ్ బ్రహ్మపుత్ర నది, రష్యా మాస్క్వా నది పేర్లను కలిపి పెట్టారు. హైదరాబాద్‌లో తయారవుతుంది. దీని బరువు సుమారు 3 వేల కిలోలు. పొడవు సుమారు 10 మీటర్లు. దీని దాడి పరిధి 300 కిలో మీటర్లు. ఇటవల భారత సాంకేతికతతో 500 కిలోమీటర్లకు పెంచారు. గంటకు సుమారు 4 వేల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది. భూమికి చాలా దగ్గరగా పయనిస్తూ రాడార్‌లకు తప్పించుకుంటుంది. లక్ష్యాన్ని అత్యంత కచ్చితంగా ఛేదిస్తుంది.బ్రహ్మోస్ అణ్వాయుధాలను మోసుకెళ్లలేని కన్వెన్షనల్ క్షిపణి కాబట్టి అంతర్జాతీయ ఒప్పందాల పరిమితులు లేకుండా ఎగుమతి చేయవచ్చు. దీనిలో 85 శాతం సాంకేతికత భారత్ సొంతం. మిగిలిన 15 శాతం (ప్రధానంగా ఇంజిన్, కొన్ని లోహ భాగాలు) రష్యా నుంచి వస్తాయి.ఫిలిప్పీన్స్, వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు బ్రహ్మోస్‌ను ఎంచుకోవడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయి. ఇది ఇప్పటికే యుద్ధక్షేత్రంలో పరీక్షించి **నిరూపించుకున్న విజయవంతమైన క్షిపణి** పశ్చిమ దేశాలు లేదా ఇతర మేజర్ సరఫరాదారుల కంటే తక్కువ ఖర్చు.భారత్ శిక్షణ, మోహరింపు సహాయం, స్పేర్ పార్ట్స్‌ను తక్కువ ధరకు లేదా ఉచితంగా అందిస్తోంది. ఈ క్షిపణిని భూమి నుంచి, నౌకలు, జలాంతర్గాములు, విమానాల నుంచి కూడా ప్రయోగించవచ్చు.

**పెరిగిన భారత రక్షణ ఎగుమతులు..**




కొన్ని సంవత్సరాల్లో భారత రక్షణ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. 2023--24లో రూ. 21 వేల కోట్లు, 2024--25లో రూ. 28 వేల కోట్లు, 2025--26లో రూ. 38 వేల కోట్లకు చేరాయి. 2029--30 నాటికి రూ. 50 వేల కోట్ల లక్ష్యం నిర్దేశించారు. బ్రహ్మోస్‌తో పాటు ఆకాశ్, పినాకా, డ్రోన్లు, మందుగుండు సామగ్రి వంటివి కీలక పాత్ర పోషిస్తున్నాయి.గతంలో ప్రభుత్వ ఏకస్వామ్యంగా ఉన్న రక్షణ రంగం ఇప్పుడు ప్రైవేట్ సంస్థల సహకారంతో వేగంగా మారుతోంది. ఇది స్వావలంబన (ఆత్మనిర్భర్ భారత్) లక్ష్యానికి దోహదపడుతోంది. బ్రహ్మోస్ ఎగుమతులు కేవలం వ్యాపారం కాదు. చైనా ప్రభావం ఎక్కువగా ఉన్న దక్షిణ తూర్పు ఆసియాలో భారత్ తన రణనీతి, సాంకేతిక సామర్థ్యం, విశ్వసనీయతను ప్రదర్శిస్తున్న సంకేతం. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా చూడడం భారత రక్షణ రంగానికి పెద్ద విజయం.

# ఒక్కో పోస్టుకు 88 మంది అభ్యర్థులు

**లక్నో, జూన్ 9:**ఓ చేత్తో డిగ్రీ పట్టా.. మరో చేత్తో ఖాళీ పొట్ట పట్టుకుని తిరుగుతున్నాం సార్. ఉద్యోగం ఎవడూ ఇవ్వడం లేదు. ఎక్కడికి వెళ్లినా రిఫరెన్సులు అడుగుతున్నారు. ఉద్యోగం ఇవ్వకుంటే అనుభవం ఎక్కడి నుంచి వస్తుంది.. ఈ దేశం ఇలా నాశనం అవుతోంది అంటే దానికి ప్రధాన కారణం మీరే సార్. మీరు ఉద్యోగాలు ఇవ్వరు. మమ్మల్ని బతకనివ్వరు" అప్పట్లో విపరీతంగా ప్రాచుర్యం పొందిన ఓ చిత్రంలో కథానాయకుడు చెప్పిన డైలాగ్ ఇది.ఆ సినిమా ఇప్పటికాలానికి నిజంగా సరిపోతుంది. కొన్ని సంవత్సరాల క్రితమే ఇప్పటి పరిస్థితి ఊహించి ఆ సినిమా తీసినట్టు కనిపిస్తోంది. ఆ సినిమాలో మాదిరిగానే ఇప్పుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నిరుద్యోగులు హాహా కారాలు చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ కు భారీగా దరఖాస్తులు చేస్తున్నారు. ఆ పోటీ ఎంతలా ఉందంటే ఒక్క ఉద్యోగానికి దాదాపు 88 మంది దరఖాస్తు చేసుకునేలా.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 32,679 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు దాదాపు 28.86 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రకారం ఒక్కొక్క పోస్టుకు 88 మంది పోటీ పడుతున్నారు. మూడు రోజులపాటు రాధా పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తండోపతండాలుగా వెళ్లిపోతున్నారు. అభ్యర్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రవాణా ఏర్పాటు చేయలేకపోవడంతో.. రైల్వే స్టేషన్ లు.. బస్ స్టేషన్లలో విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. దీంతో తర్వాత పరీక్షకు హాజరు కావడానికి అభ్యర్థులు మొత్తం కిక్కిరిసి వెళ్ళిపోవాల్సి వస్తోంది. బస్సులు.. రైళ్లు కిటకిటలాడుతున్నాయి.ఉత్తర్ ప్రదేశ్ అతి పెద్ద రాష్ట్రం. అక్కడ జనాభా కూడా అదే స్థాయిలో ఉంటుంది. అయితే నిరుద్యోగ యువతకు తగ్గట్టుగా అక్కడ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలాకాల తర్వాత పోలీస్ డిపార్ట్మెంట్లో నోటిఫికేషన్ విడుదల చేయడంతో.. నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో ఉద్యోగానికి 88 మంది పోటీ పడుతున్నారంటే అక్కడ నిరుద్యోగ సమస్య ఏ స్థాయిలో



ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో కూడా ఉత్తరప్రదేశ్లో కొన్ని శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. అప్పుడు కూడా ఇంతే సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు కూడా రైల్వే స్టేషన్ లు.. బస్ స్టేషన్ లు నిరుద్యోగులతో కిటకిటలాడాయి. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది.

# పుట్టపాగ మహేంద్ర నాథ్ శత జయంతి

**జననం.10.06.1926**

**మరణం 17.07.2005**

శ్రీ పుట్టపాగా మహేంద్రనాథ్ కొల్లాపూర్ తాలూకా పెద్దకొత్తపల్లి మండలం జోనల్ బొగడ గ్రామంలో శ్రీ పుట్టపాక మాసన్న బాలమ్మ దంపతులకు 10 జూన్ 1926 నా జన్మించినారు

వీరి ప్రాథమిక విద్య కోడేరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్నత విద్య హైదరాబాదులో శ్రీ భాగ్యరెడ్డి గారిచే స్థాపించబడిన ఆది హిందూ సేవ సంగం హాస్టల్లో మిడిల్ ఆ తదుపరి బైతుల్ ఉల్మా అనే పాఠశాలలో చేరి మెట్రిక్యులేషన్ పూర్తి చేసినారు అదే హాస్టల్లో విద్యార్థి సంఘాలకు కార్యదర్శిగాను మరియు అధ్యక్షులుగానుండి మహాత్మా గాంధీ గారిచే స్థాపించబడిన అఖిలభారత హరిజనసేవక్ సంఘ్ రాష్ట్ర శాఖ బాధ్యతలు వహిస్తున్న శ్రీ ఎం బి గౌతమ్ గారి సహచర్యంలో రాజకీయ రంగం లో ప్రవేశించుట జరిగినది మెట్రిక్యులేషన్ తరువాత హైకోర్టు వారు నడిపిన లా క్లాసులో డిప్లమా పూర్తి చేసి ఆ తర్వాత వకీలుగా లా ప్రాక్టీస్ చేస్తూ నాగర్ కర్నూల్ లో స్థిరపడి హరిజన విద్యార్థుల వసతి గృహము నిర్వహిస్తూ జాతీయ ఉన్నత పాఠశాల పర్యవేక్షిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ భూమిలేని నిరుపేదలకు ఎంతో మందికి ప్రభుత్వ భూములను పట్టాలు మరియు రక్షక రక్షిత కౌలుదారులందరికీ పట్టా హోదాను యాజమాన్య హక్కులను కల్పించుటకు తీవ్ర కృషి చేసినందున నాగర్ కర్నూల్ ప్రాంతంలో రాజకీయాలలో ప్రత్యేకమైన ప్రజా మన్ననలు పొందిన ప్రముఖ పాత్ర మహేంద్ర నాద్ గారిది అనుటలో నిర్విదాంశము నాగర్కర్నూల్ శాసనసభ్యులుగా రెండు పర్యాయములు అచ్చంపేట నియోజకవర్గం శాసనసభ్యులుగా నాలుగు పర్యాయములు మొత్తం 30 సంవత్సరములు రాజకీయాలలో కొనసాగుతూ వివిధ ముఖ్యమంత్రుల వద్ద రాష్ట్ర మంత్రిగా నిర్వహించిన శాఖలు అడివిశాఖ ఆప్కారి శాఖ మార్కెటింగ్ శాఖ హరిజన సంక్షేమ శాఖ రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖ ఆర్థిక విద్యుత్ శాఖలు ఉన్నాయి రాజకీయాల్లో బాధ్యతాయుత మంత్రి పదవులు అలంకరించి జాతీయ విద్యా



సంస్థ నాగర్కర్నూల్ సమావేశాలకు హైదరాబాదు నుండి నాగర్కర్నూల్ కు మాజీ మంత్రిగా ఆర్టిసి బస్సుల్లో ప్రయాణం సాగించిన నిస్వార్థ నిష్కలంక రాజకీయ గాంధీయవాది శ్రీ ప్రభాకర్ జి సేవాగ్రం గాంధీజీ ఆశ్రమ వాసి అణుంగు అనుచరుడుగా మద్య నిషేధం సర్వోదయం ఉద్యమాలలో సంబంధాలు కలిగి ఉండి ఆచార్య వినోబాజీ గ్రామదాన ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర వహిస్తూ శ్రీ ప్రొఫెసర్ గోరా మార్గంలో మానవతా వాదిగా పాలమూరు జిల్లా హరిజన గిరిజన వెనుకబడిన జాతుల బాంధవుడు పుట్టపాగ మహేందర్ నాథ్ శతజయంతి ఉత్సవ ప్రారంభ సందర్భంగా రాజకీయ నాయకులందరూ రాజకీయ లకుఅతీతంగా వారి శత జయంతి ఉత్సవాలను విజయవంతంగా జిల్లాలో నిర్వహించుటకు ప్రారంభ సందర్భంగా మచ్చలేని మహా నాయకుడు మహేంద్రనాథ్ గారిని స్మరించుకొని వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ వారిని స్మరించుకుంటున్నాము.

**జీవి సుబ్బారావు అధ్యక్షుడు,**
**తెలంగాణ గాంధీ స్మారక నిధి**

# నీట్ ఎక్సపర్ట్స్ లాక్ డౌన్..

**న్యూఢిల్లీ,జూన్ 8:**వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ 2026 రీ ఎగ్జామినేషన్‌కు ముహూర్తం దగ్గరపడుతుండటంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసాధారణమైన భద్రతా చర్యలకు శ్రీకారం చుట్టింది. మే 3న జరిగిన మొదటి పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఎన్‌టీఏ.. ఈసారి జూన్ 21న జరగబోయే రీ టెస్ట్ విషయంలో జీరో ఎర్రర్ పాలసీని అమలు చేస్తోంది. పేపర్ లీకేజీకి అస్సలు ఛాన్స్ లేకుండా పేపర్ తయారీ దశ నుంచే ఊహించని రేంజ్‌లో కట్టుదిట్టమైన కమాండో తరహా భద్రతను ఏర్పాటు చేసింది.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. నీట్ రీ ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో భాగస్వాములైన సబ్జెక్ట్ నిపుణులు, పర్యవేక్షకులు, వివిధ భాషల్లోకి అనువదించే ట్రాన్స్‌లేటర్లతో కూడిన యావత్ టీమ్‌ను కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో ఒక అత్యంత రహస్య ప్రాంతంలో లాక్‌డౌన్ చేశారు. ఈ లాక్‌డౌన్ ప్రాంగణంలో ఉన్నవారికి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉన్న ఎలాంటి కమ్యూనికేషన్ పరికరాలనూ అనుమతించడం లేదు. కేవలం ముందస్తు అనుమతి పొందిన ప్రత్యేక సిబ్బందికి మాత్రమే ఈ జోన్‌లోకి ప్రవేశం ఉంటుంది. జూన్ 21న పరీక్ష ముగిసేంతవరకు ఈ నిపుణుల బృందం బయటి ప్రపంచానికి



పూర్తిగా దూరంగా ఇదే నిఘా నీడలో గడపనుందిగతంలో రవాణా, స్టోరేజ్ దశల్లోనే లీకేజీలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో.. ఈసారి ఎన్‌టీఏ సరికొత్త మల్టీ లేయర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను రంగంలోకి దించింది. క్వశ్చన్ పేపర్ల ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజ్ నుంచి పరీక్షా కేంద్రాలకు చేరే వరకు ప్రతి దశలోనూ బహుళ అంచెల నిఘా ఉంటుంది. అత్యంత కీలకమైన విషయం ఏంటంటే.. ఈ ప్రశ్నపత్రాల రవాణా కోసం ఈసారి భారత వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానాలను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ప్రైవేట్ రవాణా సంస్థల జోక్యం తగ్గి.. పేపర్లు అత్యంత సురక్షితంగా జిల్లాలకు చేరుకుంటాయి.ఇదిలా ఉండగా.. రీ ఎగ్జామ్ పేపర్ కూడా ముందే లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో కొన్ని ఫేక్ వార్తలు చక్కర్లు కొట్టడంపై ఎన్‌టీఏ తీవ్రంగా స్పందించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం పూర్తిగా అవాస్తవమని, మోసపూరితమైనదని స్పష్టం చేసింది. ఇలాంటి పుకార్లను నమ్మి అభ్యర్థులు, తల్లిదండ్రులు మోసపోవద్దని, కేవలం అధికారిక వెబ్‌సైట్ సమాచారాన్ని మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేసింది. ఇలాంటి ఫేక్ ప్రచారం చేసే అకౌంట్లపై సైబర్ క్రైమ్ పోలీసుల సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.దేశవ్యాప్తంగా మే 3న జరిగిన నీట్ పరీక్షలో లీకేజీ కలకలం రేగడంతో.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మే 12న ఆ పరీక్షను ఎన్‌టీఏ అధికారికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు నీట్ యూజీ రీ ఎగ్జామినేషన్ జరగనుంది. లక్షలాది మంది విద్యార్థులు హాజరవుతున్న ఈ పరీక్షను ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా ముగించేందుకు కేంద్ర విద్యాశాఖ, ఎన్‌టీఏ సర్వసన్నద్ధమయ్యాయి.

# రేవంత్ రాజకీయం
## నార్త్ జనానికి దూరమౌతున్న కాంగ్రెస్

**హైదరాబాద్, జూన్ 9:**తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల జాతీయ వేదికలపై ఆత్మగౌరవ వాదాన్ని అత్యంత అగ్రెసివ్‌గా వినిపిస్తూ దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపారు. ముఖ్యంగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన , కేంద్రం నుంచి వచ్చే నిధులు , పన్నుల పంపిణీలో జరుగుతున్న అసమానతలపై ఆయన ఎక్కుపెట్టిన విమర్శలు జాతీయస్థాయిలో హాట్ టాపిక్‌గా మారాయి. మేము కేవలం పన్నులు చెల్లిస్తూ, ఢిల్లీకి సలాం కొట్టే ద్వితీయ శ్రేణి పౌరులం కాబోం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవేదన మాత్రమే కాదు.. ఒక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు.ఒక జాతీయ పార్టీ తరఫున ముఖ్యమంత్రిగా ఉంటూ ఇలాంటి ప్రాంతీయ సెంటిమెంట్‌ను, ముఖ్యంగా ఉత్తరాది వర్సెస్ దక్షిణాది వాదాన్ని లేవనెత్తడం వెనుక కాంగ్రెస్ పార్టీ మారుతున్న అంతర్గత రాజకీయ సమీకరణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత కొన్ని ఎన్నికల సరళిని పరిశీలిస్తే, ఉత్తరాది రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో పుంజుకోలేకపోతోంది. అదే సమయంలో కర్ణాటక, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలు కాంగ్రెస్‌కు ప్రధాన ఆర్థిక, రాజకీయ వనరులుగా మారాయి. ఉత్తరాదిపై ఆశలు వదులుకోకపోయినా, తమకు పెట్టని కోటగా మారిన దక్షిణాదిని మరింత పటిష్టం చేసుకోవాలనే వ్యూహంలో భాగంగానే రేవంత్ రెడ్డి చేత కాంగ్రెస్ అధిష్టానం ఈ తరహా వాయిస్ వినిపిస్తోందని భావించవచ్చు.ఈ మొత్తం వ్యవహారంలో రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణ ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన పిల్లర్ గా రూపాంతరం చెందుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన కేవలం జనాభా ప్రాతిపదికన జరిగితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు



చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యతను కోల్పోతాయని రేవంత్ రెడ్డి గణాంకాలతో సహా హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఆయన తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వంటి ఇతర దక్షిణాది నేతలకు లేఖలు రాస్తూ అందరినీ ఏకం చేసే ప్రయత్నం చేయడం ద్వారా ప్రాంతీయ పార్టీల కంటే తానే ఈ వాదాన్ని బలంగా మోయగలనని నిరూపించుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ మోడల్' అంటే 50% సీట్లను జనాభా ప్రాతిపదికన, మిగిలిన 50% సీట్లను ఆయా రాష్ట్రాల ఆర్థిక సహకారం ఆధారంగా కేటాయించాలనే డిమాండ్ --- ఆయన పొలిటికల్ మెచ్యూరిటీని చూపిస్తోంది. దీనివల్ల ఆయన కేవలం గుడ్డిగా కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం లేదని, ఒక నిర్మాణాత్మకమైన ప్రత్యామ్నాయాన్ని చూపిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది అటు జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ ఇమేజ్‌ను దెబ్బతీయకుండా, ఇటు దక్షిణాది ప్రయోజనాలను కాపాడే సమతుల్య వ్యూహంగా ఉపయోగపడుతోంది.భవిష్యత్ రాజకీయాల కోణంలో చూస్తే, ఈ 'దక్షిణాది సెంటిమెంట్' రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఢిల్లీ పాలకుల నిర్లక్ష్యం వల్ల దక్షిణాది రాజకీయంగా అణగారిపోతుందనే భయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ప్రాంతీయ సెంటిమెంట్‌ను ఓట్లుగా మార్చుకునే ప్రయత్నం కాంగ్రెస్ చేయవచ్చు. అయితే, ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్‌కు ఈ వ్యూహం రెండు అంచుల కత్తి లాంటిది. దక్షిణాదిలో ఈ వాదం మైలేజ్ ఇచ్చినప్పటికీ, ఉత్తరాది రాష్ట్రాలలో దీనివల్ల కాంగ్రెస్ మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో దక్షిణాది హక్కుల కోసం పోరాడే ఒక 'ఫైర్ బ్రాండ్' లీడర్‌గా రేవంత్ రెడ్డి జాతీయ స్థాయిలో తన స్థానాన్ని పదిలం చేసుకుంటున్నారు.

**మంత్రి పదవి ఇవ్వాలంటూ వినతులు**

తెలంగాణకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు.. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. వీరిలో ప్రముఖంగా మునుగోడు ఎమ్మెల్యే, ఫైర్ బ్రాండ్ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఉన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన సుదీర్ఘ లేఖను రాహుల్‌గాంధీకి అప్పగించారు. తాను పార్టీకి ఎంత విధేయుడినో ఆయన వివరించారు. 15 పేజీల లేఖలో పలు విషయాలను ఆయన వెల్లడించినట్టు తెలిసింది త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న చర్చల నేపథ్యంలో కోమటిరెడ్డి సహా.. సీనియర్ నాయకుల రాహుల్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఒకసారి మంత్రివర్గాన్ని విస్తరించారు. అప్పట్లో అద్దూరి లక్ష్మణ్ సహా.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు అవకాశం కల్పించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు ఈ కూర్పు జరిగింది. అయితే.. ఇప్పుడు మరోసారి

# 75 లక్షల టన్నుల మార్కు

- మొదటి పేజీ తరువాయి

మన పొరుగున ఉన్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మొత్తం కొనుగోళ్లు కలిపినా 40 లక్షల టన్నుల లోపే ఉండటం గమనార్హం.తెలంగాణలో ఈ స్థాయి దిగుబడి రావడానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రాజెక్టుల ద్వారా నిరంతర నీటి లభ్యత, వ్యవసాయ రంగానికి అందిస్తున్న ఉచిత విద్యుత్, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతుభరోసా పథకం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 అదనపు బోనస్ అందించడం, పకడ్బందీగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కారణంగా సాగు విస్తీర్ణం పెరిగిందని అంటున్నారు. గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది వానాకాలంలో 69.90 లక్షల ఎకరాలు, యాసంగిలో 59.90 లక్షల ఎకరాలు కలిపి మొత్తం 129.80 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఈ రెండు సీజన్ల ద్వారా రాష్ట్రంలో సుమారు 282 లక్షల టన్నుల భారీ ధాన్యం దిగుబడి వచ్చినట్లు పౌరసరఫరాల సంస్థ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ అనుకూల విధానాల వల్లే తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా మారిందని నిపుణులు కొనియాడుతున్నారు.

# రేవంత్ మైండ్ గేమ్ లో కేసీఆర్...

- మొదటి పేజీ తరువాయి

ఎప్పటిలానే ఆయన తరచూ తాను చెప్పే కొన్ని మాటల్నీ ఈ సభలోనూ రిపీట్ చేశారు. ఎప్పటిలానే మరోసారి కేసీఆర్ కు సవాలు విసిరారు. గతంలో అసెంబ్లీకి రావాలని తరచూ కోరే ఆయన..ఇటీవల కాలంలో అసెంబ్లీలో చర్చకు రావాలన్న ఛాలెంజ్ చేశారు. గతానికి ఈసారి తేడా ఒక్కటే. అసెంబ్లీలో నిర్వహించే చర్చలో తాను కానీ ఓడితే అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ కు క్షమాపణలు చెబుతానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలు

తెలంగాణలో రాజకీయాన్ని ఏకపక్షం చేసుకోవాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నట్లుగా కనిపిస్తోంది. రాజకీయాల్లో అదను చూసి దెబ్బ తీయాలని సామెత ఉంది. విపక్షం వీక్ గా ఉన్నప్పుడే జోరు చేయాలని తెలిసిన వారే ముందుకు సాగుతారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు అదే పంథాను అనుసరిస్తున్నారు. బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ అయితే గత రెండున్నరేళ్లుగా ఫాం హౌజ్ లోనే ఉంటున్నారు. ఓటమి తరువాత ఎందుకో ఆయన మునుపటి మాదిరిగా దూకుడు చేయడం లేదు. దాంతో ఈ అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతి పెద్ద అడ్వాంటేజ్ గా తీసుకుని స్పీడ్ పెంచేశారు అని అంటున్నారు. రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎన్నికల వేడి లేవో అన్నట్లుగా ఆయన హడావుడి చేస్తున్నారు. తాజాగా చూస్తే ఆయన



బీఆర్ఎస్ కి బలం ఉంది అన్న చోట పాలమూరు లో పర్యటించారు. అక్కడ భారీ బహిరంగ సభను నిర్వహించడమే కాదు ఏకంగా కేసీఆర్ కే సవాల్ చేశారు. తన రెండున్నరేళ్ల పాలన కేసీఆర్ పదేళ్ల పాలనకు తేడా ఏంటో చర్చిద్దాం సిద్ధమేనా అని సవాల్ చేశారు. కేసీఆర్ చర్చకు రెడీ అంటే తాను కూడా రెడీ అన్నారు. అభివృద్ధి సంక్షేమ విషయంలో తాను బీఆర్ఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తున్నానని రేవంత్ రెడ్డి చెప్పుకున్నారు. ఇక ఈ మధ్య కాలంలో అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని తమ ప్రభుత్వం ఏమి చేసిందో తాను చెబుతాను అని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు.కేసీఆర్ అయితే జనం లోకి రావడం లేదు. ఆయన గత డిసెంబర్ లో ప్రెస్ మీట్ పెట్టారు. ఒక రోజు శీతాకాల సమావేశాలకు అటెండ్ అయ్యారు. 2026 లో కొత్త ఏడాదిలో మూడు ప్రాంతాలలో మూడు భారీ బహిరంగ సభలు పెడతామని కూడా ప్రకటించారు. కానీ అవేమీ జరగలేదు. యథా ప్రకారం కేసీఆర్ ఫాం హౌజ్ కే పరిమితం అయిపోయారు. మరో వైపు బీఆర్ఎస్ నుంచి కవిత బయటకు వెళ్లి కొత్త పార్టీని పెట్టుకుంది ఆమె బాణాలు బీఆర్ఎస్ మీదనే ఎక్కుపెడుతోంది. అదొక చికాకు అనుకుంటే హరీష్ రావు బీజేపీలో చేరిపోతున్నారని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలు మరో చికాకుగా మారాయి. వాటికి హరీష్ రావు ధీటుగా బదులిస్తూ ఖండిస్తున్నప్పటికీ జనంలో గులాబీ పార్టీ రేకులు విడిపోతున్నాయని చెప్పడానికే ఈ వ్యూహాత్మకమైన విమర్శలు అన్నది కూడా ఉంది. ఇక కేటీఆర్ విమర్శలు కానీ ఆయన స్టేట్మెంట్స్ కానీ కాంగ్రెస్ పట్టించుకోవడం లేదు. తన మీదకు ఇద్దరు నాయకులను వదిలేశారని కానీ వారి వల్ల ఏమీ కాదని రేవంత్ రెడ్డి హరీష్ కేటీఆర్ లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు గమనార్హం. తనకు సమ ఉజ్జీ కేసీఆర్ తప్ప బీఆర్ఎస్ లో ఎవరూ కారని రేవంత్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే కేసీఆర్ ఇప్పట్లోనే వచ్చే అవకాశం అయితే కనిపించడం లేదని అంటున్నారు. దాంతో రేవంత్ రెడ్డి దూకుడు రాజకీయం తెలంగాణలో కొనసాగుతోంది. ప్లైగా 2034 వరకూ మాదే అధికారం అని బల్ల గుద్ది మరీ రేవంత్ రెడ్డి చెబుతున్నారు.

## పార్లమెంటులో స్పెషల్ మెజారిటీ కోసం ఎన్‌డీయే ప్రయత్నాలు!

- మొదటి పేజీ తరువాయి

పలికే అవకాశం ఉన్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇదే జరిగితే ఎన్‌డీఏ సంఖ్యా బలం 300 మార్కు దాటుతుంది. ఇక టీడీపీకే ఎంపీలు కూడా ఎన్‌డీఏకు కొన్ని షరతులకు లోబడి మద్దతు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్‌డీఏకు ప్రస్తుతం లోక్‌సభలో 293 మంది ఎంపీలు ఉన్నారు. 20 మంది టీఎంసీ ఎంపీలు మద్దతు కూడా లభిస్తే సంఖ్యాబలం 313కు పెరుగుతుంది. 22 మంది డీఎంకే ఎంపీల మద్దతు సాధించగలిగితే ఇది 335కు చేరుతుంది. మహారాష్ట్ర నేత ఉద్ధవ్ థాకరే సారథ్యంలోని శివసేనకు చెందిన 9 మంది ఎంపీల మద్దతును కూడగట్టేందుకూ ప్రయత్నాలు సాగుతున్నాయి. వీరిలో కొందరి మద్దతు లభించినా ఎన్‌డీఏ సంఖ్యా బలం 341కు పెరుగుతుంది. మిగిలిన ఓట్లను చిన్న పార్టీలు, స్వతంత్ర ఎంపీల రూపంలో సాధించుకోవచ్చని ఎన్‌డీఏ భావిస్తున్నట్లు సమాచారం. రాజ్యసభలో కూడా మూడింట రెండు వంతుల స్పెషల్ మెజారిటీని (164) కూడగట్టేందుకు ఎన్‌డీఏ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే టీఎంసీ రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన మళ్లీ ఎన్నికై బీజేపీకి మద్దతు పలికే ఛాన్స్ ఉందన్న టాక్ వినిపిస్తోంది. మిగిలిన 12 టీఎంసీ ఎంపీలు ఇదే ఫార్ములా ఫాలో అయ్యే అవకాశం ఉంది. 8 మంది డీఎంకే ఎంపీలు కూడా షరతులకు లోబడి ఎన్‌డీఏ ఈ బిల్లు విషయంలో మద్దతు తెలిపే ఛాన్సు ఉంది. ఇతర చిన్న పార్టీల మద్దతు కూడా కూడగడితే పెద్దల సభలో కూడా ఎన్‌డీఏ పైచేయి సాధించే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం.

## బిఆర్ఎస్ నేతలు తెలంగాణను దోపిడీ చేశారు...

- మొదటి పేజీ తరువాయి

వడ్ల కొనుగోళ్లు జరగడం లేదన్నారు. తాము మొక్కజొన్నలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కంలకు డబ్బులు చెల్లించలేదన్నారు. కానీ ఇప్పుడు డిస్కంలకు డబ్బులు చెల్లిస్తున్నామని అన్నారు.'ఎన్నికల సందర్భంగా నేను, సీఎం ఇక్కడి ప్రజలకు హామీలు ఇచ్చాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం' అని భట్టి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు.. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని.. కానీ ఇప్పుడు అభివృద్ధి జరుగుతోందన్నారు. రఘునాథపల్లిలో 230కెవి సబ్ స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

- మొదటి పేజీ తరువాయి

ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని, తెలంగాణ సైతం ప్రాజెక్టుల పనులను సమీక్షించకుండా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు.

## తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో X అకౌంట్ హ్యాక్..

- మొదటి పేజీ తరువాయి

ఆన్‌లైన్ మోసాలను అరికట్టడం, హ్యాకింగ్ ఘటనలను గుర్తించి చర్యలు తీసుకోవడం వంటి కీలక బాధ్యతలు నిర్వహించే సంస్థకే ఈ పరిస్థితి ఎదురుకావడం చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గతంలో అనేక సైబర్ నేరాలను ఛేదించి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. దేశంలోనే అత్యాధునిక సైబర్ దర్యాప్తు వ్యవస్థలను ఉపయోగిస్తున్న సంస్థగా పేరుపొందింది. అలాంటి సంస్థకు చెందిన సోషల్ మీడియా ఖాతా హ్యాక్ కావడం, మే 22వ తేదీన జరిగిన ఈ ఘటనను గుర్తించకపోవడం భద్రతా వ్యవస్థలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో నెటిజన్లు కూడా తీవ్రంగా స్పందిస్తున్నారు. సైబర్ భద్రతకు మార్గదర్శకంగా నిలవాల్సిన సంస్థ తన ఖాతాను సురక్షితంగా ఉంచుకోకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. హ్యాకింగ్ ఘటన ఎలా జరిగింది?, ఖాతా భద్రతలో ఎలాంటి లోపాలు చోటుచేసుకున్నాయి? అనే విషయాలపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నట్లు సమాచారం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎ అకౌంట్ హ్యాకింగ్ ఘటన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

## భారత్ అణ్వాయుధాల్ని బయటపెట్టిందా.. కేంద్ర పాలసీ మారిందా..?

- మొదటి పేజీ తరువాయి



అణ్వాయుధాలను ప్రయోగించేందుకు సిద్ధం చేసిందని అర్థం. ఈ అణ్వాయుధాలను అండర్‌గ్రౌండ్ సిలోస్ లోపల, సబ్‌మెరైన్స్ లోపల ప్రయోగానికి సిద్ధం చేసి ఉంచారు. అలా, 12 అణ్వాయుధాలను ప్రత్యేక బేస్‌లలో, సైనిక దళాల ఆధ్వర్యంలో ఇండియా సిద్ధం చేసి ఉంచింది. ఈ ఏడాది జనవరి నాటికి ఇండియా వద్ద 190 అణ్వాయుధాలు ఉన్నట్లు సిప్రి అంచనా. వీటిని విమానాల నుంచి, నేలమీద నుంచి, సముద్రాల నుంచి ప్రయోగించడానికి అవకాశం ఉంది. అయితే, ఇప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆయుధాల్ని ముందుగా మోహరించి సిద్ధం చేస్తున్నారు. ఇలా అణ్వాయుధాలను ప్రయోగానికి సిద్ధంగా ఉంచినప్పటికీ తన మూల సూత్రాలను మర్చిపోలేదని సిప్రి నివేదిక తెల్పింది. 'నో ఫస్ట్ యూజ్' అనే పాలసీని ఇండియా అనుసరిస్తోంది. అంటే, అణ్వాయుధాలను ముందుగా మనం ప్రయోగించకూడదు అనేది మన దేశ అభిప్రాయం. మన దేశం మీద అణు దాడి జరిగినప్పుడే ఇండియా శత్రుదేశాలపై అణ్వాయుధాన్ని ప్రయోగిస్తుంది.

# సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్..

**అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలంటూ డిమాండ్**



**హైదరాబాద్:** అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు.

**ఎమ్మెల్యే హరీశ్ రావు ఎక్స్ పోస్టు..**

'రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62 వేల మంది అంగన్‌వాడీ సోదరీమణుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పకుండా వారి ఉసురు తగులుతుంది. సాటి మహిళల కన్నీటి గోసను మహిళా మంత్రిగా ఉన్న సీతక్క అర్థం చేసుకోకపోవడం శోచనీయం. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారి గౌరవాన్ని పెంచారు. వారు వర్కర్లు కాదని, టీచర్లని పేర్కొంటూ హోదాను ఉన్నతీకరించారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.13,650కు, మినీ అంగన్‌వాడీ టీచర్ల జీతాన్ని రూ.7,800కు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800కు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18వేలకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. మాయమాటలు చెప్పి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదు. ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక అబద్ధాల ప్రచారం చేస్తున్నట్లు కాంగ్రెస్ వైఖరి ఉంది. సమస్యల పరిష్కారం కోసం 'ఛలో సెక్రటేరియట్' పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించింది. అంగన్‌వాడీలపై పోలీసులను ప్రయోగించి దుర్మార్గమైన చరిత్రను కాంగ్రెస్ మూటకట్టుకుంది. ఇప్పటికైనా కళ్లు తెరవండి. మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీ కొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండి. పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీల వేతనాలను తక్షణమే చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ పోస్టు పెట్టారు.

# హైదరాబాద్‌లో నేపాలీ గ్యాంగ్ భారీ దోపిడీ...

**రూ.5 కోట్ల విలువైన ఆభరణాలు చోరీ!**

**నెల రోజుల క్రితమే పనిమనుషులుగా చేరిన నేపాల్ దంపతులు**

**వ్యాపారి కుటుంబ సభ్యులు ముంబై వెళ్లిన సమయంలో చోరీ**

**రంగంలోకి దిగిన ఆరు ప్రత్యేక పోలీసు బృందాలు**



హైదరాబాద్ లో నేపాలీ గ్యాంగ్ లు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఇటీవల ఓ నేపాల్ గ్యాంగ్ మాజీ ఐపీఎస్ అధికారి భార్యను హత్య చేసి, దోపిడీకి పాల్పడిన ఘటన మరువక ముందే... తాజాగా మరో నేపాలీ గ్యాంగ్ దోపిడీకి పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ప్రముఖ వ్యాపారవేత్త ఇంట్లో సుమారు ఐదు కోట్ల రూపాయల విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలను దోచుకుని దుండగులు పరారయ్యారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తక్షణమే రంగంలోకి దిగారు. ఈ భారీ చోరీపై దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఏకంగా ఆరు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ప్రస్తుతం పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ప్రాథమిక సమాచారం ప్రకారం... సదరు వ్యాపారవేత్త కేవలం నెల రోజుల క్రితమే నేపాల్‌కు చెందిన ఒక దంపతులను (భార్యాభర్తలను) తమ ఇంట్లో పనిమనుషులుగా నియమించుకున్నారు. ఇటీవల ఆ వ్యాపారి కుటుంబ సభ్యులంతా కలిసి ముంబై వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్న ఈ నేపాలీ దంపతులు... తమ గ్యాంగ్‌తో కలిసి ఇంట్లోని కోట్ల విలువైన వజ్రాలు, బంగారు నగలను ఊడ్చేసి ఉడాయించారు. వ్యాపారి కుటుంబం ముంబై నుంచి తిరిగి వచ్చేసరికి ఇల్లంతా గుల్ల అయి ఉండటాన్ని చూసి షాక్‌కు గురైంది. ఈ ఘటన గచ్చిబౌలి లాంటి సంపన్న ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు రేకెత్తించింది.

# రైతులకు బీజేపీ శనిలా తయారైంది: వేముల వీరేశం



**హైదరాబాద్, జూన్ 9:** తెలంగాణలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు బీజేపీ ఓ శనిలా తయారైందని విమర్శించారు. తెలంగాణ బీజేపీ నేతలు.. ప్రధాని మోదీకి చెప్పి ధాన్యం కొనుగోలు చేయిస్తారని రైతులు ఎదురు చూశారని తెలిపారు. 8 మంది బీజేపీ ఎంపీలతో రైతులకు ఎలాంటి లాభం లేదని వ్యాఖ్యానించారు. రైతుల ముందు మోదీనే మోకరిల్లిన చరిత్రను బీజేపీ నాయకులు మరిచిపోయారా అని ప్రశ్నించారు. నల్ల చట్టాలని వెనక్కి తీసుకున్న చరిత్ర మోదీది అంటూ వీరేశం వ్యాఖ్యానించారు. 15వ తేదీలోపు రాష్ట్రంలో ప్రతి గింజా కొనుగోలు చేస్తామని బీజేపీ ప్రకటించాలని.. లేదంటే బీజేపీ నాయకుల ఇళ్లు ధాన్యంతో నిండిపోతాయన్నారు. రైతుల కోపానికి బీజేపీ బలికాక తప్పదని హెచ్చరించారు. తెలంగాణలో బీజేపీకి రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత ఉందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసేది బీజేపీ అయితే.. బీజేపీకి బీ టీమ్‌గా బీఆర్ఎస్ పని చేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం లేకున్నా పెద్ద ఎత్తున పంట వస్తే అసత్య రాజకీయ క్రీడకి తెరలేపారంటూ వేముల వీరేశం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## రాంగ్ రూట్ లో వస్తే

# అడ్డంగా బుక్కైనట్టే...

**100 ప్రధాన మార్గాల్లో సీసీ కెమెరాలు..**

**హైదరాబాద్, జూన్ 9:** ట్రాఫిక్ పోలీసులు లేరు కదా అని కాస్త దూరం తగ్గించుకోవడానికి అడ్డదారిలో బండి నడిపితే ఇకపై నేరుగా కెమెరా కంటికి చిక్కాల్సిందే. నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ట్రాఫిక్ విభాగం పూర్తిగా సిద్ధమైంది. అడ్డదారిలో వెళ్తూ నిబంధనలు ఉల్లంఘిస్తే క్షణాల వ్యవధిలోనే మొబైల్‌కు ఈ-చలానా సందేశం వచ్చేలా ఏర్పాట్లు చేశారు. పదేపదే ఇలాంటి తప్పులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా పోలీసులు వెనుకాడటం లేదు. నగరవ్యాప్తంగా వాహనదారులు అడ్డదారిలో ప్రయాణిస్తున్నట్లు సుమారు 200కు పైగా ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. వీటిలో అత్యంత ప్రధానమైన 100 మార్గాల్లో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వారిని ఈ కెమెరాల ద్వారా గుర్తించి, కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నేరుగా జరిమానాలు విధిస్తున్నారు. ఎలాగైనా వెంటనే గమ్యస్థానానికి చేరాలనే తొందరతో వాహనదారులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ఈ సంవత్సరం కేవలం 5 నెలల వ్యవధిలోనే రాంగ్‌రూట్ ప్రయాణాల వల్ల 50కి పైగా ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో కుటుంబానికి ఆధారమైన ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడ్డారు.



ఉదయం, రాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉంటాయని, పోలీసులు ఉండరనే ఉద్దేశంతో ఇష్టానుసారంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురుగా వాహనాలు వేగంగా దూసుకొస్తున్నా వినకుండా అడ్డదారిలో వచ్చే వాహనదారులు, పోలీసుల తనిఖీల్లో పట్టుబడినప్పుడు రకరకాల సాకులు చెబుతున్నారు. చుట్టూ తిరిగి రావడం ఇబ్బందని, కొద్ది దూరమే కదా వచ్చామంటూ మాయమాటలతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొందరైతే అడ్డదారిలో రావడమే కాకుండా పోలీసులతో గొడవకు దిగుతూ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిపై ప్రతి నెల నమోదవుతున్న కేసుల్లో సగానికి పైగా (20 మందిపై కేసులు నమోదైతే అందులో 10 మంది) రాంగ్ సైడ్‌లో వచ్చే వాహనదారులే ఉంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మలుపులు దూరంగా ఉన్నాయని కాలనీల్లోకి వెళ్లేందుకు రాంగ్‌సైడ్‌ను ఎంచుకునే వాహనదారులు, ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను తొలగించడం లేదా మార్చడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. నగరంలో కేవలం ఒక నెల వ్యవధిలోనే రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై 30 ప్రాంతాల్లోనే ఏకంగా 2 లక్షలకు పైగా ఈ-చలానాలు నమోదు కావడం ఈ ఉల్లంఘనల తీవ్రతను నిరూపిస్తోంది. నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఎదురవుతున్న ప్రాంతాలుగా షేక్‌పేట్, ఫిలింనగర్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ, టోలిచౌకి, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, అత్తాపూర్, చార్మినార్, అబిడ్స్, నారాయణగూడ, ఖైరతాబాద్, పంజాగుట్ట, బేగంపేట్, అమీర్‌పేట్, రాణిగంజ్, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, అఫ్జల్‌గంజ్, కాచిగూడ, సుల్తాన్‌బజార్ వంటి నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. ఈ ప్రదేశాలలో అడ్డదారి ప్రయాణాల వల్ల తరచూ తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

# రేవంత్ వర్సెస్ పవన్...



**హైదరాబాద్, జూన్ 9:** సాధారణంగా రాజకీయాలలో కొందరి మధ్య వైరం అనేది అంత ఈజీగా సాధ్యం కాదు. ఎందుకంటే వారి మధ్య అటువంటి వ్యవహారాలు ఎప్పుడూ చోటు చేసుకోవు కాబట్టి.. ప్రజలు ఆ విధంగా ఆలోచించరు. కానీ తెలంగాణలో అందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి.. ఎవరు ఊహించని విధంగా.. కలలో కూడా అనుకోని విధంగా రాజకీయ వైరం ఏర్పడింది. అది కాస్త ఒక రకమైన సంచలనానికి దారితీసింది. ఇది ఎటువైపు వెళుతుంది.. దేని వైపు దారితీస్తుందో చూడాలి. ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడిన మాటల తర్వాత.. అది రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సంచలనం సృష్టించిన తర్వాత.. ఈ ఎపిసోడ్లోకి కాంగ్రెస్ నాయకులు వచ్చేసారు. ఆ విశ్లేషకుడిని బాధిత పక్షం లాగా చూపించేందుకు ప్రయత్నాలు చేశారు. ముందుగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ ఈ వ్యవహారంలోకి ప్రవేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను హైదరాబాద్ ఖాళీ చేసి వెళ్లిపోవాలని.. డిమాండ్ చేశారు. ఆ తర్వాత జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ కళ్యాణ్ ప్యాకేజి స్టార్ అంటూ మండిపడ్డారు. ఇక టీఆర్ఎస్ అధినేత్రి పళ్లు రాలుతాయి అంటూ పవన్ కళ్యాణ్ మీద మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కళ్యాణ్ బిజెపి, బీఆర్ఎస్ కు అమ్ముడుపోయిన వ్యక్తి అని.. ఆయన ఒక ప్యాకెజిస్టార్ అంటూ ఆరోపించారు..ఈ పరిణామాల తర్వాత పవన్ కళ్యాణ్ స్పందించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలను పెద్దగా లెక్కలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఎప్పుడైతే హస్తం పార్టీ నాయకులు తనమీద విమర్శలు చేయడం మొదలుపెట్టారో ఆయన నేరుగా రంగంలోకి దిగారు. అంతేకాదు.. తెలంగాణలోని గచ్చిబౌలి ప్రాంతంలో సంధ్య కన్వెన్షన్ హాల్ లో అంతర్గత సమావేశం నిర్వహించుకుంటామని తెలంగాణ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం చివరి నిమిషంలో పవన్ కళ్యాణ్ కు హ్యాండ్ ఇచ్చింది. దీనికి తెలంగాణ పోలీసులు చెప్పిన కారణమేంటంటే.. ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద జనసేన నాయకులు విమర్శలు చేయడం ద్వారా.. తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతిన్నది.. తెలంగాణ ప్రజలు పవన్ కళ్యాణ్ మీద ఆగ్రహంగా ఉన్నారు.. అందువల్ల ఈ సమావేశానికి అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. జన సేన అధినేత తన గృహం నుంచి విలేకరుల సమావేశం నిర్వహించారు. చాలా ఆవేశంగా మాట్లాడారు. తాను ఇక్కడ పోటీ చేసే విషయం మీద స్పష్టత ఇచ్చారు. పోరాటల పురిటిగడ్డలో ఎందుకు సమావేశంనిర్వహిస్తున్న విషయం మీద కూడా క్లారిటీ ఇచ్చారు. జనసేన అధినేత మీద కవిత ఆరోపణలు చేస్తే ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే ఆమెకు ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు కావాలి. అందువల్లే ఆమె అలా చేస్తుందనుకోవచ్చు. భారత రాష్ట్ర సమితి పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే.. దాన్ని కూడా ఒక రకంగా తీసుకోవచ్చు. ఎందుకంటే భారత రాష్ట్ర సమితికి ఆంధ్రా ప్రాంతం మీద.. అక్కడి రాజకీయ నాయకుల మీద విమర్శలు చేస్తేనే ఆ పార్టీకి మనుగడ. అదే గనుక లేకపోతే ఆ పార్టీకి తెలంగాణలో కొనసాగింపు ఉండదుభారత రాష్ట్ర సమితి నుంచి కవిత వరకు ఏపీ డిప్యూటీ సీఎం మీద విమర్శలు చేశారంటే దాని వెనక ఒక అర్థం ఉంది. కానీ కాంగ్రెస్ నాయకులు ఈ స్థాయిలో జనసేన అధినేత మీద విమర్శలు చేయడం నిజంగా ఆశ్చర్యం. రేవంత్ రెడ్డి ఆదేశాల లేకుండా వారు ఇలా చేశారనుకోవడానికి లేదు. కానీ ఈ ఉద్దేశ్యాలు ఆశించి కాంగ్రెస్ పార్టీ ఇలాంటి విమర్శలు చేస్తుందో అర్థం కావడం లేదు..త్వరలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మున్సిపల్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు అన్ని పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకం. అలాంటప్పుడు తెలంగాణ సెంటిమెంట్ రగిలితేనే ఓట్లు పడతాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అందువల్లే జనసేన అధినేత మీద ఈ స్థాయిలో విమర్శలు చేసినట్టు కనిపిస్తోంది. కానీ హైదరాబాదులో సెటిలర్ ఓటర్లు చాలా ఎక్కువగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేస్తే..ఆంధ్రా వాదం మీద ఆరోపణలు చేస్తే అప్పుడు ఆ ఓట్లు వేరే పార్టీ వైపు వెళ్లే అవకాశం ఉంది. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తానని జనసేనాని స్పష్టం చేశారు. అలాంటప్పుడు కాంగ్రెస్ ఎందుకు అతడిని టార్గెట్ చేసినట్టు.. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. మన పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్లో కూడా రాజకీయాలు చేస్తోంది. అలాంటప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ ఇలాంటి వైఖరి ఎందుకు తీసుకున్నారు.. భారత రాష్ట్ర సమితికి అవకాశం ఇవ్వకూడదనా.. పవన్ కళ్యాణ్ వస్తే భారత రాష్ట్ర సమితికి ప్రయోజనం దక్కుతుందనా.. ఈ ప్రశ్నలు రాజకీయ విశ్లేషకులు వేస్తున్నారు.. ఒకవేళ ఇదే విధానం కనుక రేవంత్ రెడ్డిది అయితే.. ఆయన ముందుగానే మేల్కొన్నట్టు..కానీ, గత ఎన్నికల్లో సెటిలర్ ఓటర్లు భారత రాష్ట్ర సమితి వైపు మొగ్గు చూపించారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ విషయంలో రేవంత్ రెడ్డి కొనసాగించిన వైఖరి వల్ల వారి ఓట్లు ఎటువైపు వెళ్తాయో చూడాల్సి ఉంది. కాకపోతే ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్న వ్యాఖ్యల ద్వారా గోటితో పోయే వ్యవహారాన్ని ఇక్కడ దాకా తీసుకొచ్చారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా మార్చారు. అయితే ఇది ఎక్కడదాకా దారి తీస్తుందో చూడాల్సి ఉంది.


# శాటర్ డే.. నో బ్యాగ్ డే

**వరంగల్, జూన్ 9:** తెలంగాణలోని పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ విద్యాశాఖ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈసారి కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్యాలెండర్‌లో పెద్దపీట వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో.. క్యాలెండర్‌లోనే ప్రతిరోజూ క్రీడలు, ఆటలు నిర్వహించాలనే నిబంధనను విద్యాశాఖ పొందుపరిచింది. కొత్త నిబంధనల ప్రకారం.. పాఠశాలల్లో పిల్లలకు సాధారణ బోధనతో పాటు ప్రతిరోజూ క్రీడలు నిర్వహించాలి. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు కథల పుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్లు లాంటి వాటిని రోజుకు అరగంట పాటు చదివించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు, ప్రార్థన సమయంలో లేదా అది పూర్తయిన తర్వాత తరగతి గదిలో ఐదు నిమిషాల పాటు విద్యార్థులకు యోగా లేదా ధ్యానం చేయించటం తప్పనిసరి చేశారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు మొత్తం 227 రోజుల పాటు పనిచేస్తాయి. పదో తరగతి సిలబస్‌ను 2027 జనవరి 10వ తేదీ నాటికి, మిగిలిన తరగతులకు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాలని అధికారులు గడువు విధించారు. వచ్చే ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినంగా ఉంటుంది. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 24 నుంచి జూన్ 13వ తేదీ వరకు (2027) వేసవి సెలవులు ఉంటాయి. 2027 మార్చి 15 నుంచి చివరి పనిదినం వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. తొలిసారిగా ఈ ఒంటిపూట బడుల తేదీలను విద్యా క్యాలెండర్‌లోనే ముందుగా ప్రకటించడం విశేషం. ఇక ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులకు నో బ్యాగ్ డేగా అమలు చేస్తారు. అదే రోజున అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశాలు కూడా జరపాలి. 1 నుంచి




9వ తరగతి చదివే విద్యార్థులకు భోజన విరామం తర్వాత సెప్టెంబరు వరకు ప్రతిరోజూ ఒక సబ్జెక్టుపై ప్రత్యేకంగా రెమిడియల్ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల చదువులో వెనుకబడిన విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన పెంచుకునే అవకాశం లభిస్తుంది. కాగా.. మే 14న ప్రారంభమైన బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 19 వరకు కొనసాగించాలని విద్యాశాఖ ఆదేశించింది. అలాగే.. గత ఏడాది స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను 6 నుంచి 7కు పెంచగా.. ఈసారి మళ్లీ వాటిని 6కు తగ్గించారు. ఈ సమావేశాలు జులై, ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు, ఫిబ్రవరి నెలల్లో జరుగుతాయి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వివిధ సైన్స్ ప్రదర్శనల షెడ్యూల్‌ను క్యాలెండర్‌లో చేర్చారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025-26 జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌ను అక్టోబరులో నిర్వహించనున్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయి పోటీలను నవంబరు లేదా డిసెంబరులో, రాష్ట్రస్థాయి పోటీలను డిసెంబరు లేదా జనవరిలో జరుపుతారు. సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2027 జనవరిలో నిర్వహించనున్నారు.

# అర్ అండ్ బీ ఈఎన్సీ ఇంటిపై ఏసీబీ దాడులు...




**హైదరాబాద్:** ఆర్.అండ్.బి. ఈ ఎన్ సి అధికారి మోహన్ నాయక్ పై ఏసీబీ దాడులు జరిపింది. మంగళవారం ఉదయం నుంచి మియాపూర్ లోని మోహన్ నాయక్ నివాసం లో సోదాలు కొనసాగుతున్నాయి. మోహన్ నాయక్ ఇంటి తో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఉదయం నుండి దాడులు జరుగుతున్నాయి. మియాపూర్ లోని వసంత సిటీ విల్లా నెంబర్ 98 లో మోహన్ నాయక్ వుంటున్నారు.

# తాగు నీరు కోసం నీళ్ల ట్యాంకు పెకెక్కి నిరసన...



**మీర్ పేట్:** తాగడానికి చుక్క నీళ్లు ఇవలేని ఎమ్మెల్యే మాకొద్దని మీర్పేట్ డబల్ బెడ్ రూమ్ కాలనీ ప్రజలు నిరసనకు దిగారు. డౌన్ డౌన్ రేవంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలతో బిందెలతో నీళ్ల ట్యాంకు పైకి ఎక్కి నిరసన తెలిపారు.

# ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు ఉద్యమం ఉద్ధృతం

## రాజకీయ పార్టీలతో చర్చలు -- జూన్ 16న కీలక సమావేశం

**రంగారెడ్డి జిల్లా జూన్ 9: ( స్కై న్యూస్ )** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టిన ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ నిర్ణయించింది ఈ విషయాన్ని జేఏసీ కన్వీనర్ టీజీ శ్రీనివాస్ వెల్లడించారు జేఏసీ ఏర్పాటు అనంతరం ఏప్రిల్, మే నెలలతో పాటు జూన్ తొలి వారంలో ఉమ్మడి జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టులను విస్తృతంగా పరిశీలించినట్లు ఆయన తెలిపారు ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు తెలియజేసేందుకు వివిధ ప్రాంతాల్లో పాత్రికేయుల సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులకు గత పాలకుల రాజకీయ వైఫల్యాలే కారణమని పేర్కొంటూ ప్రజాప్రతినిధుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రాలు పంపినట్లు చెప్పారు జేఏసీ చేపట్టిన కార్యక్రమాల ప్రభావంతో సాగునీటి అంశం రాజకీయ చర్చగా మారిందన్నారు ప్రజాప్రతినిధుల చొరవతో ముఖ్యమంత్రి జిల్లాకు సంబంధించిన నీటి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారని తెలిపారు జూన్ 4, 5 తేదీల్లో ముఖ్యమంత్రి చేపట్టిన పర్యటనలో కృష్ణా, భీమా నదులపై బ్యారేజీల నిర్మాణ అవకాశాలను పరిశీలించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఈ అంశంలో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు లేకపోతే కర్ణాటక రాష్ట్రానికే అధిక ప్రయోజనం






కలిగే అవకాశం ఉందని, ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి జిల్లాలకు ఉపయోగపడే భారీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై స్పష్టత అవసరమని అభిప్రాయపడ్డారు గద్వాల, మక్తల్ ప్రాంతాల్లో ప్రాజెక్టుల పరిశీలన అనంతరం జేఏసీ నాయకులు సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు జూన్ 16 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రస్తుత మరియు మాజీ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసి చర్చలు జరపాలని నిర్ణయించినట్లు వెల్లడించారు అదేవిధంగా రౌండ్ టేబుల్ సమావేశాలు, పాదయాత్రలు, ఉమ్మడి జిల్లా కేంద్రంలో ధర్నా, నియోజకవర్గ స్థాయి జేఏసీల ఏర్పాటు వంటి అంశాలపై జూన్ 16న జరిగే ప్రత్యేక సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు డిండి లిఫ్ట్ పేరుతో జిల్లాకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, దానిని రద్దు చేయాలని ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. అలాగే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, చంద్రసాగర్–అమ్రాబాద్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల సాధనకు ప్రత్యేక కృషి అవసరమని అన్నారు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, నీటి హక్కుల కోసం పోరాడే ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని టీజీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు ఇప్పటివరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజలను గాలికి వదిలేసిన రేవంత్ సర్కార్

**రాజకీయ పునరావాస నామినేటెడ్ పదవుల జి ఓ ను రద్దు చేయాలి**

**సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి**

**బిజెపి రాష్ట్ర నేత కోలన్ శంకర్ రెడ్డి డిమాండ్**

**హైద్రాబాద్ జూన్ 9 ;**తెలంగాణ రాష్ట్రం లో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని బిజెపి రాష్ట్రనేత కొలను వెంకటరెడ్డి విమర్శించారు. ప్రజలను పట్టించుకోకపోవడం ,ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం వల్ల వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ జడ్పిటిసి సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు ఆయన పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై పట్టు కోల్పోయాడని, దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాది రాష్ట్రాలు అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, కేంద్రాన్ని విమర్శించడం తప్ప పరిపాలనను గాలికి వదిలేసాడని విమర్శించారు. ఎంపీటీసీ సింగిల్ విండో ఎన్నికలు జరపకపోగా వాటికి నామినేటెడ్ పెదవులలో పార్టీ శ్రేణులు నియమించి మూలంగా రైతులకు రావలసిన సౌకర్యాలు అనడం లేదని ,పాలన వ్యవస్థ లేకపోవడం మూలంగా సహకార వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆయన విమర్శించారు అంతేకాకుండా నేడు రాష్ట్రంలో యువతీ యువకులు రైతులు,విద్యార్థులు ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతో ఉన్నారన్నది స్పష్టమవుతుంది అన్నారు .రైతు భరోసా కు తూట్లు పొడిచి రైతులను అనేక ఇబ్బందులకు గురిచేసారని ఆయన దుయ్యబట్టారు. ప్రజల



సంక్షేమం గాలికి వదిలేసి కాంగ్రెస్ శ్రేణులకు రాజకీయ పునరావాసము కల్పించడం కోసం కుట్రలు చెస్తుందని ఆరోపించారు. వెంటనే రైతు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, కాంగ్రెస్ శ్రేణుల రాజకీయ పునరావాస నామినేటెడ్ పదవుల జి ఓ ను రద్దు చేయాలని కోలన్ శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు....

# కమ్మదానంలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు**

**గ్రామస్థుల హర్షం**

**రంగారెడ్డి జిల్లా జూన్ 9 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదానం గ్రామంలో ప్రజల సౌకర్యార్థం ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్థుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజల అవసరాల తీర్చడమే తమ లక్ష్యమని తెలిపారు హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వల్ల గ్రామంలో భద్రత మెరుగుపడటంతో పాటు రాత్రి వేళల్లో ప్రజల రాకపోకలకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు గ్రామ ప్రజలకు ఉపయోగపడే ఈ ప్రజాప్రయోజన కార్యక్రమాన్ని సొంత నిధులతో అమలు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కమ్మదానం సర్పంచ్ గోదుల లత కిరణ్‌కుమార్ గౌడ్, ఉపసర్పంచ్ పెద్దింటి జగన్నాథ్, కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# వార్డ్ అవగాహన సదస్సు ని తిరస్కరించిన బి ఆర్ ఎస్ కౌన్సిల్లర్ లు (36,37 వార్డు లు)

**వార్డ్ అవగాహన సదస్సు కు హాజరుకాని BRS కౌన్సిల్లర్ లు**

**జోగులాంబ గద్వాల, జూన్ 8 (స్కై న్యూస్):**గద్వాల పట్టణంలో 26 27,28,36,37 వార్డ్ లకు అవగాహన సదస్సు పేరిట మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ అద్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంకు 36,37 వ వార్డ్ ల కౌన్సిల్లర్ లు కమ్మరి సునీత,గంగాళం మంజుల రాణి ఈ కార్యక్రమాన్ని తిరస్కరించి కార్యక్రమానికి హాజరు కాలేదు.ప్రజా సమస్యల పై స్పందించి ప్రజల అవసరాలు తీర్చకుండా నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలియజేశారు.పట్టణ ప్రగతి పాలన అంటూ 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రభుత్వం కార్యక్రమాల పేరిట కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు..ప్రతి వార్డ్ లో వార్డ్ సభ కార్యక్రమం అంటు సభకు సంబంధించి ఏర్పాట్లు కూడా తూ తూ మంత్రంగా చేస్తూ.. ఒకే బ్యానర్ ను అన్ని వార్డ్ లకు తిప్పుతూ కౌన్సిల్లర్ ల ముందు ఆ బ్యానర్ లు ఉంచి ఫోటోలు దిగుడు కార్యక్రమం పూర్తి అయ్యిందని ఎల్లిపోవుడు అని 36,37వార్డ్ కౌన్సిల్లర్ లు విమర్శించారు. ప్రజా సమస్యలను తీరుస్తారు అనే ప్రధాన ఉద్దేశ్యం మాకు ప్రజలు ఓట్లేశారు ఆ ప్రజా సమస్యలే తీర్చలేనప్పుడు ఈ మీటింగ్ లు ఎందుకుదీనికి మేము పోవుడు ఎందుకనే ఉద్దేశ్యంతో మేము వార్డ్ అవగాహన కార్యక్రమాన్ని బాయ్ కాట్ చేయడం జరిగిందని చెప్పడం జరిగింది.



# పశువులలో జబ్బ వాపు, గొంతువాపు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పాల్గొన్న...

**పెద్దపల్లి గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి..**

**జోగులాంబ గద్వాల జూన్ 9 (స్కై న్యూస్):**మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో ఉచిత గొంతు వాపు,జబ్బ వాపు వ్యాధి నివారణ టీకాలు శిబిరం గ్రామ సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి,డాక్టర్ ఉష తో కలిసి మంగళవారం ప్రారంభించారు...పాల్వాయి పశు వైద్య అధికారిని డా. ఉష మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చే వ్యాధులు –గేదెలలో గొంతువాపు మరియు గో జాతి పశువులలో జబ్బ వాపు గొంతువాపు వ్యాధి ఎక్కువగా గేదెలలో వస్తుందని,ఈ వ్యాధిని గురకవ్యాధి అని కూడా అంటారు,గొంతువాపు వ్యాధి లక్షణాలు 104 – 106 జ్వరం,కళ్ళు ఎర్రబడి నీరు కారటం,గొంతు పై భాగాన మెడ కింద వాపు, శ్వాస పీల్చేటప్పుడు పశువులు ఆయాసపడతాయి.జబ్బా వాపు వ్యాధి లక్షణాలు బలంగా ఆరోగ్యంగా ఉన్న గోజాతి పశువులలో ఎక్కువగా వస్తుంది.జబ్బా మరియు తొడ కండరాల పైన వాపు కనపడుతుంది.కావున పశుపోషకులు ముందస్తు జాగ్రత్తగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలి అన్నారు.సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పశు వులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశు యాజమానూలు అప్రమత్తంగా ఉండి రోగాల భారీ నుండి తమ పశువులను కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా 52 గో జాతి పశువులు,20 గేదెల లో టీకాలు వేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మధు,సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మీనరసింహా,ఓం శంకర్ ఉల్వ నర్సింహా,కుర్వ నర్సింహా, శ్రీశైలం, రమేష్,రంగస్వామి గ్రామస్తులు,పశు పోషకలు పాల్గొన్నారు..



# బాధ్యతలకు వన్నెతెస్తేనే గుర్తింపు...

**నాగర్ కర్నూల్ జూన్ 9 (స్కైన్యూస్)** ప్రభుత్వ శాఖలలో పనిచేసే పదవి విరమణ పొందిన తరువాత రాజకీయాలలో బాధ్యతలు స్వీకరించిన వారు వారి బాధ్యతలకు వన్నె తీసుకు వస్తేనే ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి శ్రీధర్ అన్నారు మంగళవారం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి వంకేశ్వరం నిరంజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక కావడం జరిగిందని ఆయనను సంఘం కార్యాలయంలో సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలు స్వీకరించిన వంకేశ్వరం నిరంజన్ అణగారిన వర్గాల కోసం విధి నిర్వహణలో ఉండగా ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా తన దగ్గరకు వచ్చే మిత్రులను ఆదరించి అండగా నిలిచి ప్రత్యేక గుర్తింపును పొందాలని కోరారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటశెట్టి మండల అధ్యక్షులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి కార్యదర్శి యుగంధర్ రెడ్డి నాయకులు వెంకట్ రెడ్డి సంజీవ గౌడ్ పోల శ్రీనివాసులు వీరేశలింగం లక్ష్మీనారాయణ ప్రభాకర్ వెంకటస్వామి సింహారెడ్డి తో పాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు



# అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి...

**విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి**

**నాగర్ కర్నూల్ జూన్ 9( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై ఉక్కు పాదం మోపి అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలను సీజ్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు డిమాండ్ చేశారు మంగళవారం మండల విద్యాశాఖ అధికారి కురుమయ్యకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు లేకపోయినా విచ్చలవిడిగా విద్యార్థుల సంఖ్యను నమోదు చేసుకుంటూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని తాగునీటి మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు ఇతర సామాగ్రి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యను వ్యాపారమయం చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై దృష్టి సారించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థలలో విద్యాహక్కు చట్టం ప్రకారం 25% పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్ సంయుక్త కార్యదర్శి శివ నాయకులు జీవన్ విష్ణు రమేష్ తదితరులు పాల్గొన్నారు



# సకాల వైద్యంతో ఆవుకి పునర్జన్మ

**నాగర్ కర్నూల్ జూన్ 9 (స్కైన్యూస్)** రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే కుప్పకూలిన ఆవుకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ కల్పన సకాలంలో స్పందించి వైద్య సేవలు అందించడంతో కాశన్న గౌడ్ అనే వ్యక్తికి చెందిన ఆవు కోరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చార వాణి ద్వారా సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి వెంటనే స్పందించి సిబ్బందితో కలిసి శస్త్ర చికిత్స చేసి నాలుగు గంటల పాటు సేవలు అందించడంతో మూగజీవానికి పునర్జన్మ లభించిందని అన్నారు ఈ సందర్భంగా గ్రామస్తులు మండల పరిషత్ వైద్యాధికారి కల్పనతో పాటు సిబ్బంది మాధ్య నిరంజన్ లింగస్వామి బాలకృష్ణ లకు అభినందనలు తెలిపారు



# ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌కు పదేళ్లు

**గర్భిణీలకు అవగాహన కల్పించిన వైద్యులు**

**ప్రతి నెల 9వ తేదీన ఉచిత పరీక్షలు, ప్రత్యేక సేవలు:డాక్టర్ స్రవంతి**

**రంగారెడ్డి జిల్లా జూన్ 9 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలంలోని చించోడు గ్రామంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పి ఎం ఎస్ ఎం ఎ) కార్యక్రమం ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా గర్భిణీలకు అందించే ఉచిత వైద్య సేవలు, పరీక్షలు, పోషకాహారం ప్రాముఖ్యతపై వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ, ప్రతి నెల 9వ తేదీన నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ద్వారా గర్భిణీలకు అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు అధిక ప్రమాద గర్భధారణ (హైరిస్క్) కేసుల గుర్తింపు, ప్రత్యేక పర్యవేక్షణ, సురక్షిత ప్రసవం కోసం ఫాలోఅప్ సేవలు, 102 అంబులెన్స్ ద్వారా ఉచిత రవాణా, సమీప ఫస్ట్ రిఫరల్ యూనిట్ సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, వ్యాక్సినేషన్, ఐరన్–ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ, గర్భం దాల్చిన మూడు నెలల్లోపు ప్రతి మహిళ తప్పనిసరిగా ఏఎన్ఎంల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు నమోదు అనంతరం మూత్ర పరీక్షలు, రక్త పరీక్షలు, రక్తపోటు, థైరాయిడ్, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తారని తెలిపారు గర్భిణీలు తాజా ఆకుకూరలు, కూరగాయలు, ఉడకబెట్టిన గుడ్లు, పండ్లు, పాలు వంటి పోషకాహారం తీసుకోవాలని, ప్రతి నెలా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, డీఈవో విజయ, ఏఎన్ఎంలు మధువాణి, అనురాధతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కొందుర్గు మండలంలో విస్తృత పర్యటన

**లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు సందర్శన**

**హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవాలు**

**రంగారెడ్డి జిల్లా జూన్ 9 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లోని పలు గ్రామాల్లో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ విస్తృతంగా పర్యటించనున్నారు ఈ మేరకు ఆమె పర్యటన షెడ్యూల్ విడుదలైంది షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 గంటలకు జమాన్‌పేట్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం కార్యక్రమంలో పాల్గొననున్న ఎంపీ, అనంతరం ఉత్తరాశిపల్లి గ్రామంలో నిర్వహించే పార్టీ చేరికల కార్యక్రమానికి హాజరవుతారు ఆ తర్వాత రేగడి చిలుకమర్రి, చిన్న ఉమ్మెంత్యాల, కొందుర్గు, గుర్రంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించనున్నారు కొందుర్గు గ్రామంలో స్థానిక నాయకులతో సమావేశమై మీడియా సమావేశం నిర్వహించనున్నారు మధ్యాహ్నం జిల్లేడ్ గ్రామంలో భోజన కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని పరిశీలించనున్నారు అనంతరం సాయంత్రం 5 గంటలకు రవిర్యాల వంతెనను సందర్శించి పరిశీలన చేపట్టనున్నట్లు పర్యటన షెడ్యూల్‌లో పేర్కొన్నారు.



వార్తాతరంగాలు

బుధవారం 10 జూన్ 2026

## సమస్యలతో సతమతం సాయిబాబా కాలనీ పరిష్కారం కోసం
## కమిషనర్ గడప తట్టిన కాలనీ వాసులు



**రంగారెడ్డి జిల్లా జూన్ 9 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని సాయి ఎన్క్లేవ్ – బాబా నగర్ కాలనీ ఫేజ్-2లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ, ప్రస్తుతం తాత్కాలికంగా ఉన్న విద్యుత్ సరఫరాకు శాశ్వత పరిష్కారం కల్పించాలని, కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు అలాగే కాలనీకి వచ్చే ప్రధాన రహదారిని విస్తరించి అడ్డంకులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు కాలనీ ప్రారంభంలో పాత హైవేపై ఉన్న హైమాస్ట్ లైట్‌ను తొలగించడంతో పాటు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, మురుగు కాలువలు మరియు అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరారు కాలనీలో ఉన్న 10 శాతం ప్రభుత్వ భూమిలో పార్కును అభివృద్ధి చేయాలని, మిగిలిన స్థలంలో చెట్లు నాటి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని సూచించారు రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం రోడ్లపై మట్టి పోసి ప్రజలు సులభంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో శివ ఎస్పీ, పినపాక ప్రభాకర్, సాంబశివరావు (శివ), డాక్టర్ రవి తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వర్షాకాలానికి ముందస్తు చర్యలు

**పట్టణంలో నీరు నిల్వకుండా ప్రత్యేక ఏర్పాట్లు**

**షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



**రంగారెడ్డి జిల్లా జూన్ 9 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని షాద్‌నగర్ మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో వర్షపు నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు అవసరమైన మరమ్మతు పనులు చేపడుతున్నామని చెప్పారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు వర్షాల సమయంలో నీటి నిల్వల వల్ల రాకపోకలకు ఆటంకం కలగకుండా అన్ని వార్డుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు పట్టణంలో వర్షపు నీటి పారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నరేష్, జీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణకు రూ.587 కోట్లు కేటాయింపు శుభపరిణామం

**షాద్‌నగర్ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరే దిశగా ముందడుగు**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి అభినందనీయం**

**మూలే జనార్ధన్**



**రంగారెడ్డి జిల్లా జోన్ 9 : ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రతిపాదించిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.587 కోట్ల నిధులను కేటాయించడం శుభపరిణామమని షాద్‌నగర్ తాలూకా జేఏసీ చైర్మన్ మూలే జనార్ధన్ పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అని తెలిపారు ప్రాజెక్టు సాధన కోసం ఎన్నో సంవత్సరాలుగా ఉద్యమాలు, వినతిపత్రాలు, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదన్నారు అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సాధన కోసం నిరంతరం కృషి చేయడంతో భూసేకరణకు రూ.587 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు ప్రాజెక్టు భూసేకరణకు నిధులు కేటాయించడం ద్వారా షాద్‌నగర్ ప్రాంత ప్రజల ఆశలకు కొత్త ఊపిరి లభించిందని తెలిపారు ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు షాద్‌నగర్ తాలూకా జేఏసీ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, జేఏసీ కన్వీనర్ నక్క బాల్‌రాజ్ యాదవ్, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం తాలూకా కోఆర్డినేటర్ జాంగారి రవి, జేఏసీ ట్రెజరర్ గోర్ల రాము, ఉద్యమకారుడు మల్లేష్ తదితరులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## జమ్మిచేడు జమ్ములమ్మ ఆలయ వసతి గృహ నిర్మాణానికి రూ. 20 లక్షల భారీ విరాళం

**దాతలను సన్మానించిన ఆలయ ఈఓ పురేందర్ కుమార్**



**జోగులాంబ గద్వాల, జూన్ 9(స్కై న్యూస్):** నడిగడ్డ భక్తుల ఇలవేల్పుగా పేరుగాంచిన గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడు శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన వసతి గృహ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ నిర్మాణ కార్యక్రమానికి గాను బెంగళూరు పట్టణానికి చెందిన విశ్వనాథం కుటుంబ సభ్యులు రూ. 20 లక్షల భారీ విరాళాన్ని మంగళవారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథం కుటుంబ సభ్యులు ఆలయాన్ని సందర్శించి, శ్రీజములమ్మ అమ్మవారికి మరియు పరశురామ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ అభివృద్ధికి, దూరప్రాంతాల నుండి వచ్చే భక్తుల వసతి కొరకు ఇంతటి భారీ విరాళాన్ని అందజేసిన దాత విశ్వనాథం కుటుంబ సభ్యుల ఉదారతను ఆలయ కార్యనిర్వహణాధికారి పురేందర్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో వారిని శాలువాతో ఘనంగా సన్మానించి, అమ్మవారి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల పథకాల భూ సేకరణ ప్రక్రియను పూర్తిచేయాలి...

**నెట్టెంపాడు భూ సేకరణ 45 రోజుల్లోగా పూర్తవ్వాలి**

**సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ ఆర్ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలు**



**జోగులాంబ గద్వాల, జూన్ 9 (స్కై న్యూస్):** జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీల పరిధిలో సేకరించాల్సిన 534 ఎకరాలలో ఎలాంటి ఇబ్బందులు లేని భూ సేకరణ ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు 45 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్(రిహాబిలిటేషన్ మరియు రీ సెటిల్మెంట్) కమిషనర్ శివకుమార్ నాయుడు అన్నారు. జిల్లాలోని నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ కు అవసరమైన భూ సేకరణ పై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కమిషనర్ తో పాటు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రాజెక్టులపై సమీక్ష చేసేందుకు ఇటీవల పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి గద్వాల జిల్లా పెండింగ్ ప్రాజెక్టులపై మాట్లాడారన్నారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో భూ సేకరణ ఆలస్యం కావడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారని, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి ముందుకెళ్లాల్సిందిగా ఆదేశించారన్నారు. గట్టు ఎత్తిపోతల పథకంకు సంబంధించి 462 ఎకరాలను, ఆర్డీఎస్ పరిధిలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా ఫేజ్2 కింద నిర్మిస్తున్న మల్లమ్మ కుంట రిజర్వాయర్ కు 567 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభమై చాలా ఏళ్లు కావడంతో భూసేకరణ విషయంలో దీనికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ముందుకెళ్లాలన్నారు. నెట్టెంపాడు పరిధిలో మొత్తం 534 ఎకరాల్లో కోర్టు కేసులు, ఇతర సమస్యలు లేని సుమారు 220 ఎకరాలకు ఈనెల 15వ తేదీలోగా ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ పూర్తయితేనే ఎత్తిపోతల పథకాల పనులను సకాలంలో పూర్తిచేసి సంబంధిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు వీలుంటుందన్నారు. జిల్లాలోని వివిధ రిజర్వాయర్లలో ముంపుకు గురైన గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రాలలో ఆవాసం కల్పించినందున అక్కడ వారికి కల్పిస్తున్న కనీస మౌలిక వసతులలో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా పథకాలకు సంబంధించి వివిధ మండలాల పరిధిలో సంబంధిత గ్రామాల్లో సేకరించాల్సిన భూ సేకరణ పై అధికారులతో క్షుణ్ణంగా మాట్లాడారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా ఎత్తిపోతల పథకాలకు అవసరమైన భూ సేకరణ విషయంలో ఎవరైనా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైతే ప్రభుత్వ అవసరాలు, ప్రాజెక్టుల ఆవశ్యకతను గురించి వారికి వివరించి ఒప్పించాలన్నారు. రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులు ప్రత్యేక టీములుగా ఏర్పడి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఇరిగేషన్ శాఖ సిఈ రహీముద్దీన్, సర్వే ఏడి నూకరాజు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, వివిధ మండలాల తహసిల్దార్లు, నీటి పారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి...

**జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్**



**వనపర్తి జూన్ 9 (స్కైన్యూస్)** కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత అసత్య ప్రకటనలతో మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రగల్బాలు పలుకుతున్నారని వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ డిమాండ్ చేశారు మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎన్నికల ముందు ఇస్తామన్నా 2500 పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు ఆర్టీసీ బస్సులు మరియు పెట్రోల్ పంపులు వారికి కేటాయించడం జరిగిందని ప్రకటన చేయడం తప్ప ఎవరికి మంజూరు చేశారో ఎన్ని బస్సులకు మహిళలను యజమానులు చేశారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వివిధ డిపోలలో ఉన్న పాత బస్సులకు కొత్తగా రంగులు వేసి రాజధానికి తరలించి నూతన బస్సులకు మహిళలను యజమానులు చేస్తున్నామని ప్రకటించారని ఆయన ఆరోపించారు. వనపర్తి డిపోకు చెందిన బస్సులకు అలంపూర్ మహిళా సమస్యల పేర్లు స్టిక్కర్లు వేసి చూపించడం మినహా మహిళలకు ఒరిగిందేమీ లేదని అన్నారు మహిళల ఆర్థిక అభివృద్ధికి నూతనంగా బస్సులు కొనుగోలు చేసి వారికి కేటాయించాలని కోరారు. మహిళలకు ఇచ్చిన హామీల నుండి తప్పించుకొని మహిళల దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు మహిళలకు 2500 కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకంలో తులం బంగారం కేసీఆర్ కిట్టు విద్యార్థులకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. బహిరంగ సభలలో మహిళలను తరలించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకోవడమే తప్ప మహిళలకు ఒరిగిందేమీ లేదన్నారు ఈ సమావేశంలో నాయకులు నీల స్వామి మైనార్టీ సెల్ అధ్యక్షులు హుస్సేన్ మండల యువత అధ్యక్షులు రాము తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రి శత జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి...

**ఉత్సవాలను విజయవంతం చేయాలి**

**ఉత్సవ కమిటీ కన్వీనర్ పుట్టపాగ శ్రీనివాసులు**



**నాగర్ కర్నూల్ జూన్ 9( స్కైన్యూస్)** దళిత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ మంత్రి దివంగత పుట్టపాగ మహేంద్ర నాథ్ శత జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని బుధవారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రావు భవనంలో జరిగే ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఉత్తమ కమిటీ కన్వీనర్ పుట్టపాగ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించడంతోపాటు దళిత బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కూడా విద్యను అందించేందుకు జాతియో ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యను అందించారని వివరించారు. విద్యా వ్యాప్తి కోసం కృషి చేయడంతో పాటు రాజకీయ రంగంలో ప్రవేశించి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారని తెలిపారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గం నుండి 1957 ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగిందని అనంతరం అచ్చంపేట నియోజకవర్గం నుండి 1967లో మరియు 1983లో ఎమ్మెల్యేగా గెలుపొంది పలు శాఖలకు మంత్రిగా కూడా పనిచేశారని ఆయన వివరించారు బుధవారం జరిగే కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాసీం అధ్యక్షత వహిస్తారని సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలు అందించిన ప్రముఖ వృద్ధులను పౌరులను సామాజిక సేవకులను వివిధ రంగాలలో విశేష సేవ అందించిన ప్రముఖులను సన్మానించడం జరుగుతుందని తెలిపారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఎంపీ డాక్టర్ మల్లురవి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డిలు హాజరవుతారని కార్యక్రమానికి మేధావులు రాజకీయ నాయకులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు

# భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

**ప్రభుత్వ పాఠశాలలో**

**మౌలిక వసతులు కల్పించాలి**






**నాగర్ కర్నూల్ జూన్ 9( స్కై న్యూస్)** నియోజకవర్గంలోని ఇంద్రకల్ ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న తరగతి గదులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జిల్లా అధ్యక్షులు సాయిబాబు మండల అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు మంగళవారం పాఠశాలను సందర్శించి సమస్యలను అధ్యయనం చేశారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సుమారు 100 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు కానీ పాఠశాలలో కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మౌలిక వసతులు కల్పించి నిర్మాణం మధ్యలో నిలిపివేసిన గదుల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కాంట్రాక్టర్కు చెల్లించవలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాఠశాల ప్రాంగణంలో నీరు నిల్వ ఉండడంతో సమస్య ఏర్పడుతుందన్నారు. పలు గదులలో పెచ్చులు ఊడడం వల్ల విద్యార్థులకు ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొని ఉందని అన్నారు వెంటనే పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని క్రిమి కీటకాల నుండి విద్యార్థులను రక్షించాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# దాహార్తి తీర్చేందుకే నూతన ట్రాన్స్ ఫార్మర్



**తాడూర్ జూన్ 9 (స్కైన్యూస్)** మండల పరిధిలోని గుంత కోడూరు గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంగళవారం చాకలి దమ్ము నర్సరీలో నూతనంగా ట్రాన్స్ఫార్మర్ ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ వార్ల వెంకటయ్య తెలిపారు రాబోయే రోజులలో గ్రామంలో నీటి ఎద్దడి నివారించేందుకు విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన వివరించారు ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో ఏఈ శ్రీరాములు గ్రామ పంచాయతీ కార్యదర్శి పరమేష్ వార్డు సభ్యులు చెన్నా శ్యామ్ లింగంపల్లి ఉపసర్పంచ్ సత్యం వాటర్ మాన్ కిష్టయ్య మల్టీపర్పస్ వర్కర్ కృష్ణయ్య శివ మధు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణలో గాడితప్పుతున్న పాలన

**జోక్యం చేసుకోండి చేసుకోండి**
**రాహుల్ గాంధీకి**
**మాజీ మున్సిపల్ కమిషనర్ ఎల్ .తాజ్ మోహన్ రెడ్డి విజ్ఞప్తి**

**హైద్రాబాద్ జూన్ 9 :**తెలంగాణలోరేవంత్ రెడ్డి పరిపాలన గాడితప్పుతుందని జోక్యం చేసుకోవలసిందిగా రాహుల్ గాంధీకి మాజీ మున్సిపల్ కమిషనర్ ఎల్ .తాజ్ మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు రాహుల్ గాంధీకి ఫ్యాక్స్ ద్వారాలేఖను పంపారు.తెలంగాణలోని ప్రస్తుత పరిపాలనా మరియు రాజకీయ పరిస్థితులపై మీ దయతో కూడిన పరిశీలన మరియు జోక్యం కోసం నేను ఈ వినతిపత్రాన్ని గౌరవపూర్వకంగా సమర్పిస్తున్నాను.నేను రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్‌ను మరియు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుండి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు నిబద్ధత కలిగిన మద్దతుదారుడిని. పార్టీకి దీర్ఘకాలిక శ్రేయోభిలాషిగా మరియు బాధ్యతాయుతమైన పౌరుడిగా, కొన్ని సమస్యలను మీ దృష్టికి తీసుకురావడం నా విధిగా భావిస్తున్నానని పేర్కొన్నారు.ప్రస్తుతం, తెలంగాణలో పరిపాలనలో తగిన సమన్వయం మరియు నియంత్రణ కొరవడిందనే భావన ప్రజల్లో పెరుగుతోంది. చాలా మంది మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు వారి వ్యక్తిగత సిబ్బంది (పర్సనల్ స్టాఫ్) కూడా సాధారణ పౌరులకు అందుబాటులో ఉండటం లేదు. మంత్రుల లభ్యతకు సంబంధించిన సమాచారాన్ని పొందడంలో మరియు తమ సమస్యలను పరిష్కరించుకోవడంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి ప్రజల్లో అసంతృప్తికి



కారణమవుతోందని పేర్కొన్నారు.నేను రైతు బంధు సహాయం సమస్య కూడా మీ దృష్టికి తీసుకు రావాలనుకుంటున్నాను. దీని అమలుపై రైతుల్లోని ఒక పెద్ద విభాగం అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. నా అభిప్రాయం ప్రకారం, ఈ ప్రయోజనాన్ని ప్రతి రైతుకు కనీసం పది ఎకరాల వరకు పొడిగించడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతు సమాజానికి ఉన్న నమ్మకం బలపడుతుంది. ఈ ఆందోళనను పరిష్కరించడంలో విఫలమైతే, రైతుల్లో అసంతృప్తిని సృష్టించడం ద్వారా ఇది పరోక్షంగా ప్రతిపక్ష పార్టీలకు, ముఖ్యంగా బిఆర్ఎస్ కి ప్రయోజనం చేకూర్చవచ్చు నన్నారు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేసినప్పటికీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉన్నందున కొన్ని హామీలు ఇంకా పూర్తిగా నెరవేరలేదు. ఇది ప్రజల్లోని కొన్ని వర్గాలలో కొంతవరకు నిరాశను కూడా కలిగించింది. కాబట్టి, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి సమర్థవంతమైన కమ్యూనికేషన్ మరియు పెండింగ్‌లో ఉన్న హామీలను దశలవారీగా అమలు చేయడం చాలా అవసరం.కొంతమంది మంత్రులు తగిన సమన్వయం లేకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారనే భావన కూడా ఉంది, ఇది ప్రభుత్వ విమర్శలకు దారితీస్తోంది. బలమైన పరిపాలనా పర్యవేక్షణ మరియు మంత్రుల మధ్య మెరుగైన సమన్వయం మరింత ప్రభావవంతమైన పాలనకు దోహదపడుతుంది మరియు ప్రభుత్వ పబ్లిక్ ఇమేజ్‌ను మెరుగుపరుస్తుందన్నారు.ఇంకా, గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు తరచూ న్యూ ఢిల్లీకి వెళ్లడం ప్రజల్లో అనవసరమైన ఊహాగానాలకు తావిస్తోంది. ముఖ్యమంత్రి గారికి రాష్ట్రంలోనే సకాలంలో నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా మరింత పరిపాలనా స్వయంప్రతిపత్తిని కల్పిస్తే, ప్రభుత్వం ఒక సమైక్య మరియు ఆత్మవిశ్వాసం కలిగిన బృందంగా పని చేస్తోందని పౌరులకు భరోసా ఇచ్చినట్లు అవుతుంది మరియు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.మరొక ముఖ్యమైన ఆందోళన గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలకు సంబంధించినది. ఎన్నికల సమయంలో, కాంగ్రెస్ పార్టీ అనేక అక్రమాలను మరియు ప్రజా వనరుల దుర్వినియోగాన్ని ప్రముఖంగా ప్రస్తావించింది. అయితే, విచారణలు స్పష్టంగా పురోగమించడం లేదని చాలా మంది పౌరులు భావిస్తున్నారు. ఈ భావన ప్రజల నమ్మకాన్ని బలహీనపరుస్తోంది. అందువల్ల, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలు మరియు ఆర్థిక అక్రమాలపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా మరియు కాలపరిమితితో కూడిన విచారణలు జరిపించాలని తగిన సంస్థలను ఆదేశించవలసిందిగా నేను వినమ్రంగా అభ్యర్థిస్తున్నాను, తద్వారా జవాబుదారీతనం నిర్ధారించబడుతుంది మరియు ప్రజల నమ్మకం బలపడుతుంది.అయ్యా, దాదాపు రెండేళ్ల పాలన పూర్తయి, సమయం తదుపరి ఎన్నికల వైపు సాగుతున్న తరుణంలో, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడానికి తక్షణమే నివారణ చర్యలు చేపట్టడం చాలా ముఖ్యం. సకాలంలో చర్యలు, మెరుగైన సమన్వయం, స్పందించే పరిపాలన మరియు స్పష్టమైన జవాబుదారీతనం తెలంగాణ ప్రజలలో పార్టీ స్థాయిని గణనీయంగా మెరుగుపరుస్తాయి.పూర్వపు ప్రభుత్వ ఉద్యోగిగా, విశ్వసనీయమైన కాంగ్రెస్ కార్యకర్తగా మరియు రాష్ట్ర సంక్షేమానికి, కాంగ్రెస్ పార్టీ విజయానికి కట్టుబడిన బాధ్యతాయుతమైన పౌరుడిగా నేను ఈ సూచనలను పూర్తి చిత్తశుద్ధితో సమర్పిస్తున్నాను.మీరు దయచేసి ఈ సమస్యలను పరిశీలించి, రాష్ట్ర నాయకత్వానికి తగిన మార్గదర్శకత్వాన్ని జారీ చేస్తారని ఆశిస్తున్నాను.

# అసంపూర్తి రోడ్డు ను వెంటనే పూర్తి చేయాలనీ మాస్ లైన్ ఆందోళన బాట

**- బి. రాము**

**నారాయణపేట జూన్ 9 (స్కై న్యూస్) 9:**నారాయణపేట్నియోజకవర్గం లోని అప్పక్ పల్లి కోటకొండ,కోయిల్ కొండ అసంపూర్తి రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ ఎం ఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము,డివిజన్ కార్యదర్శి కాశినాథ్ తెలిపారు.మంగళవారం నారాయణపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతు నారాయణపేట జిల్లా కేంద్రం నుండి మహబూబ్నగర్ జిల్లా కేంద్రాని కలిపే ప్రధానమైన రెండు వరుసల రోడ్డును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంద న్నారు. కొడంగల్ నియోజక వర్గం రోడ్డు పనులన్నీ వెంట వెంటనే పూర్తవుతాయి. కానీ నారాయణపేట నియోజక వర్గ రోడ్లు ఎందుకు అసంపూ ర్తిగా మిగులుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. నారాయణపేట కొడంగల్ రెండు నియోజకవర్గాలు రెండు కళ్ళలాగా నాకు ఉంటాయి అని పిసిసి అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి ఎన్నికల సభలో మాట్లాడారనీ గుర్తు చేశారు. కొడంగల్ రోడ్లు మాత్రమే పూర్తి అవుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో పని చేస్తే




బిల్లులు తొందరగా వస్తాయని కాంట్రాక్టర్లు అక్కడి రోడ్లనే పూర్తి చేస్తున్నారు. నారాయణపేట నియోజకవర్గ రోడ్లను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. అసంపూర్తిగా పనులు చేశారు. అప్పకుపల్లి నుండి కోటకొండ మధ్యలో నాలుగు కిలోమీటర్లు, కోటకొండ గ్రామంలో రెండు కిలోమీటర్లు, కోటకొండ కోయిలకొండ మధ్యలో ఆరు కిలోమీటర్లు రోడ్డును పూర్తి చేయాల్సి ఉందన్నారు. అధికారులకు, ప్రజాప్రతిని ధులకు ఎన్నిసార్లు విన్న వించినా చలనం లేదని అన్నారు. దీంతో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 9 గంటలకు కోటకొండ భగత్ సింగ్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కు చేరుకుంటుందన్నారు. 16న నారాయణపేట జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా లో రాస్తారోకో, 17న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని పై మూడు రోజుల అప్పక్ పల్లి, కోటకొండ, కోయిలకొండ రోడ్డు సాధన ఉద్యమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాద గిరి, మండల కార్యదర్శి బి నరసింహ, గ్రామ కార్యదర్శి హాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, రైతు సంఘం జిల్లా నాయకులు బాలకృష్ణ, టియుసిఐ జిల్లా నాయకులు ఎదురింటి నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకట్ రాములు, పి వై ఎల్ నాయ కులు సలీం,మంగలి హనుమంతు, నారాయ ణపేట టౌన్ నాయకులు నజీర్ అహ్మద్, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు కోనేటప్పుడు ప్రతి రైతు రసీదు తీసుకోవాలి

**చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్**

**నారాయణపేట జూన్ 9: (స్కైన్యూస్)** విత్తనాలు కొన్న ప్రతి రైతు తప్పకుండా రసీదు తీసుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ లక్ష్మీపతి గౌడ్ సూచించారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం షేర్నపల్లి గ్రామంలో న్యాయ



విజ్ఞాన సదస్సు నిర్వహించ డం జరిగింది. ఇట్టి విజ్ఞాన సదస్సుకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ హాజరై గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల యొక్క భూసార పరీక్షలు చేయించు కొని, పంటల బీమా చేయిం చి, నష్టాలను అధిగమించ వచ్చని తెలిపారు. నిత్యవస ర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపర చుకంటే నష్ట పరిహారం పొందే వెసలుబాటు ఉంటుందని అన్నారు. వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు, ఇది ఒక సంస్కృతి, జీవన విధానం. మనకు కావాల్సిన ఆహారా న్ని అందించేది వ్యవసాయ మేఅన్నారు.బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, ఆడ పిల్లలకు చిన్న వయ స్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండి మంచి రక్షణ విద్యావకాశాలు కల్పి స్తే, వారి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది అని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100 కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవ చ్చు అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమానికి సర్పంచ్ అనురాధ, పంచాయితీ కార్యదర్శి శైలజ అనురాధ ,కానిస్టేబుల్ శ్యామప్ప,అంగన్వాడీ టీచర్ భాగ్యరేఖ,వార్డ్ మెంబెర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకే నిధుల మంజూరు..

**నిర్వాసితుల సంక్షేమానికై ప్రత్యేక దృష్టి**
**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ జూన్ 9 (స్కై న్యూస్)** జిల్లాలోని రైతుల పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతూ భూ నిర్వాసితులు అందరిని ఆదుకునేందుకు నిధులను మంజూరు చేయడంతో పాటు ప్రత్యేక దృష్టి సారించినట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు. పాలమూరు రంగారెడ్డి భూ నిర్వాసితులకు 673.15 కోట్ల నిధులను మంజూరు చేయాలని ప్రతిపాదనలు అధికారుల ద్వారా అందించడం జరిగిందని ఆర్ అండ్ ఆర్ పనులకు 25 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ప్రాజెక్టు ద్వారా భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు పరిహారం అందించడంతో పాటు పునరావాసం మౌలిక సదుపాయాల కల్పన కోసం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక చర్యలను తీసుకోవడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన లో ఆదేశించిన విధంగా అధికారులు ప్రభుత్వ నిధుల మంజూరు కి ప్రతిపాదనలు పంపించడం హర్షనీయమని



వెంటనే వాటిని మంజూరు చేసేందుకు కృషి చేస్తానని వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో పునరావాసం పనులు మరియు గృహ నిర్మాణాలు నగదు ప్రయోజనాలు పునరావాస కాలనీల అభివృద్ధి కోసం ఖర్చు చేయడం జరుగుతుందని అదేవిధంగా భూసేకరణకు 50 కోట్ల నిధులు అవసరమని అధికారులు నివేదించడం జరిగిందని వాటిని వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం దృష్టికి ప్రత్యేకంగా వట్టెం రిజర్వాయర్ పరిధిలోని బూర్నర్వాసితుల కుటుంబాల సమస్యలను తీసుకువెళ్లడం జరిగిందని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ప్రజా పాలనలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తూ విధులను మంజూరు చేస్తున్నామని తెలిపారు వట్టెం రిజర్వాయర్ పరిధిలో 46 నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటికే 53.20 కోట్ల పరిహారాన్ని అందించడంతోపాటు 29.93 కోట్ల నిర్మాణ వ్యయంతో పునరావాస కాలనీలలో రోడ్లు త్రాగునీరు విద్యుత్ గృహ నిర్మాణాల వసతులను కల్పించడం జరిగిందని తెలిపారు. అధికారుల ప్రతిపాదనలో మంజూరు చేయించి నిధుల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. 35200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి పాలమూరు రంగారెడ్డి నల్గొండ జిల్లాలోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా ఇప్పటికే 26, 882.95 ఎకరాల భూమిని భూసేకరణ ద్వారా పూర్తి చేయడం జరిగిందని 196.64 ఎకరాల భూసేకరణ త్వరలో పూర్తి చేస్తామన్నారు దీనికి గాను ప్రభుత్వం 50 కోట్లు మంజూరు చేయవలసి ఉంటుందని తెలిపారు

# హక్కుల పరిరక్షణ విద్యాభివృద్దే లక్ష్యంగా కృషి...




**నాగర్ కర్నూల్ జూన్ 9 (స్కై న్యూస్)** ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ సంక్షేమం మరియు విద్యాభివృద్దే లక్ష్యంగా స్టేట్ టీచర్స్ యూనియన్ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు పనిచేస్తుందని ఎస్టియు జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు అన్నారు మంగళవారం యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేశారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఏర్పడి 79 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని ఎన్నో ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసి హక్కులను సాధించుకోవడం జరిగిందని వివరించారు. ఉపాధ్యాయుల వేతనాలు పదోన్నతులు సేవా భద్రతా వంటి అంశాలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించి అటు ఉపాధ్యాయులు ఇటు విద్యార్థుల సంక్షేమానికి పాఠశాలల బలోపేతం నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకురావాల్సిన మార్పులపై పోరాటం చేసి సాధించుకోవడం జరిగిందని తెలిపారు. సంఘం చేపట్టిన పోరాటాలతో ప్రభుత్వ విద్య బలోపేతం అయ్యిందని తెలిపారు గ్రామీణ ప్రాంతాలలో విద్యాభివృద్ధి కోసం పనిచేస్తూ సంఘటితశక్తిగా ఇరిగిందని అన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఇచ్చిన పిఆర్సి హెల్త్ కార్డుల హామీని వెంటనే అమలు చేయాలని సిపిఎస్ అమలు కాకపోవడం వల్ల 16 వేల ప్రాథమిక పాఠశాలలో 4 వేల ఫ్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలనుకోవడం సరికాదని విమర్శించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి పూర్వ అధ్యక్షులు మురళి రాష్ట్ర నాయకులు రమేష్ అనిల్ కుమార్ రెడ్డి ప్రభాకర్ జిల్లా మండల ప్రతినిధులు హనుమంత రెడ్డి మద్దిలేటి ఈశ్వర్ కరుణాకర్ రెడ్డి బాలస్వామి హనుమంతు నరసింహ సురేష్ బాబు సత్యనారాయణ వెంకటస్వామి రాజన్ గౌడ్ నారాయణ రాజేష్ లక్ష్మి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట జూన్ 9( స్కైన్యూస్)** మంగళ వారం జిల్లా కలెక్టర్ ప్రియాంక జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు.అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...**






భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ జయ సుధ, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విమర్శలు మాని హామీలు నెరవేర్చాలి

**కిషన్ రెడ్డిని విమర్శించే అర్హత రేవంత్ కు లేదు**

**బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ నామాజీ**



**నారాయణపేట జూన్ 9:( స్కై న్యూస్)** హిట్లర్ మనస్తత్వం గల కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ అన్నారు.ఇచ్చిన హామీలు అమలు చేయలేక బిజెపి పై,కిషన్ రెడ్డిపై అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో తెలంగాణ అభివృద్ధికి పెద్దపీట వేసిందని అందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కృష్ణని అన్నారు.ఆత్మనీర్భ భారత్ కింద పల్లెల ప్రగతికి గ్రామ పంచాయతీ లకు నేరుగా నిధులు అందిం చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని అన్నారు.ఎస్ టి పి కింద మురుగునీటి శుద్ధి కోసం 3వేల 975 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు.అలాగే 2 టైర్ నగరాల అభివృద్ధికి 1,420 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ట్రైబల్ ఆర్ ఉత్తర భాగానికి కేంద్రం పచ్చ జెండా ఊపిందని161 కిలో మీటర్ల 6 లైన్లు రోడ్డుకు టెండర్లు పిలిచిందని తెలిపారు.అలాగే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని నిర్మాణ వ్యయంలో 50 శాతం కేంద్రం భరిస్తుందని కేంద్రం ప్రకటిం చిందని అన్నారు.తెలంగాం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నా రు.ఎన్నికల్లో ఎలాంటి హామీ లు ఇవ్వక పోయినా తెలంగా ణ అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తోందని అన్నారు.ఇకనైనా విమర్శలు మాని హామీలు నెరవేర్చి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు .

# మహిళలు ధైర్యసహసాలతో ముందుకు సాగాలి





**నాగర్ కర్నూల్ జూన్ 9 (స్కై న్యూస్)** దేశ తొలి మహిళా ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీని ఆదర్శంగా తీసుకొని పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న మహిళలు ధైర్య సాహసాలతో ముందుకు సాగి నేరస్తుల భరతం పట్టాలని జిల్లా అదనపు ఎస్పీ నోముల వెంకటేశ్వర్లు క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాసా రాఘవేందర్ కోరారు మంగళవారం కిరణ్ బేడీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో పోలీస్ మహిళా అధికారులను సన్మానించారు ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో ఐపీఎస్ గా బాధ్యతలు చేపట్టిన కిరణ్ బేడీ ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకొని పోలీసు శాఖకు పేరు ప్రతిష్టలు తీసుకురావడం జరిగిందని వివరించారు. క్లాస్ మెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాఘవేందర్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అన్నారు. ఎంతో సాహసోపేతమైన పోలీసు శాఖలో మహిళలు రాణిస్తున్నారని కొనియాడారు ఈ సందర్భంగా ఏఎస్ఐ మరియు ఒక హెడ్ కానిస్టేబుల్ తో పాటు ముగ్గురు మహిళా కానిస్టేబుల్ సన్మానించారు ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏవో కృష్ణయ్య సిసిఎస్ సీఐ శంకర్ తోపాటు వెంకటపతి క్లాస్ మెంట్ క్లబ్ రాష్ట్ర నాయకులు పోల శ్రీనివాసులు జిల్లా నాయకులు కందూరు లక్ష్మణ్ కేపీ ప్రసాద్ చిగుళ్లపల్లి రమణ శివ తదితరులు పాల్గొన్నారు

# పేట జట్టు పై వనపర్తి గెలుపు



**నారాయణపేట జూన్ 9: (స్కైన్యూస్)** సమ్మర్ క్రికెట్ క్యాంపు లో భాగంగా మంగళవారం నారాయణపేట బాలాజీ ఐ టి ఐ కాలేజీ మైదానంలో ఎం డి సి ఎ ఆధ్వర్యంలో అండర్ 16 వనపర్తి నారాయణపేట జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో వనపర్తి జట్టు విజయం సాధించిందనీ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఇంఛార్జి రమణ తెలిపారు.ఈ మ్యాచ్ ను ప్రారంబించిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి జాతీయ అంతర్జాతీయ స్థాయి లో రాణించాలని అన్నారు.ఈ మ్యాచ్ పరిశీలకులు ముక్తార్ మాట్లాడుతూ క్రికెటర్లు వైభవ్ సూర్యను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కోచ్ లు అజయ్,కార్తీక్,సురేష్,జహీర్,అర్చన తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను తాను “హిట్లర్”గా అభివర్ణించుకోవడం సిగ్గు చేటు

**ప్రపంచ చరిత్రలో కోట్లాది మంది ప్రాణాలు బలిగొన్న ఒక నియంత హిట్లర్**

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్**

**హైదరాబాద్ జూన్ 9** :ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి తీరు ఆడలేక మద్దెల ఓడు చందంగా తయారైంది. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. కానీ వాటిని అమలు చేసే దమ్ము, ధైర్యం లేకపోవడంతో ఇప్పుడు బీజేపీని తిట్టడం, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం, కిషన్ రెడ్డి గారిని లక్ష్యంగా చేసుకోవడం మాత్రమే పనిగా పెట్టుకున్నారు. అధికారంలోకి రాకముందు బట్లర్‌లా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై హిట్లర్ తరహా పాలన చేస్తున్నారు.ఇటీవల రేవంత్ రెడ్డి గారు తనను తాను “హిట్లర్”గా అభివర్ణించుకోవడం అత్యంత బాధాకరం. ప్రపంచ చరిత్రలో కోట్లాది మంది ప్రాణాలు బలిగొన్న ఒక నియంతను స్ఫూర్తిగా చెప్పుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న ముఖ్యమంత్రికి తగదు. తెలంగాణ కోసం మూడు తరాలు పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. తెలంగాణ ప్రజలు అహంకార రాజకీయాలను సహించరని కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెబుతారని హెచ్చరించారుప్రతిరోజూ తెలంగాణే దేశాన్ని పోషిస్తోందని, తామే అత్యధిక పన్నులు చెల్లిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెబుతున్నారు. కానీ వాస్తవాలు మాట్లాడితే తెలంగాణకు జీఎస్టీ వసూళ్లలో ఒకప్పుడు దేశంలో ఏడో స్థానం ఉండేది. ప్రస్తుతం తొమ్మిదో స్థానానికి పడిపోయింది. దేశానికి జీఎస్టీ రూపంలో వచ్చే సుమారు రూ.22 లక్షల కోట్ల ఆదాయంలో మహారాష్ట్ర 21 శాతం వాటాతో మొదటి స్థానంలో ఉంది. కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హర్యానా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు తెలంగాణ కంటే ముందున్నాయి. తెలంగాణ ప్రస్తుతం సుమారు రూ.63 వేల కోట్ల జీఎస్టీ వసూళ్లతో తొమ్మిదో స్థానంలో ఉంది. ఇదే మీ ఫ్యూచరిస్టిక్ పాలన ఫలితం.ఈరోజు రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు అయినా కేంద్రం చేయాలి, నిధులు కేంద్రం ఇవ్వాలి. రీజినల్ రింగ్ రోడ్ కావాలన్నా కేంద్రం ఇవ్వాలి. మెట్రో రైలు కావాలన్నా కేంద్రం ఇవ్వాలి. రైల్వే లైన్లు కావాలన్నా కేంద్రం ఇవ్వాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన భూసేకరణ కూడా చేయలేకపోతోంది. రూ.33 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా, భూసేకరణలో రాష్ట్రం విఫలమైంది. రింగ్ రైల్ ప్రాజెక్టుకు కూడా రైల్వే శాఖ సిద్ధంగా ఉన్నా కనీస సహకారం ఇవ్వడం లేదు.మాటిమాటికి కేంద్రాన్ని విమర్శించే ముఖ్యమంత్రి గారికి నేను ఒక ప్రశ్న అడుగుతున్నాను. ఈరోజు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం 110 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుంటే, అందులో తెలంగాణ రైతుల నుంచి సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తోంది. రైతులను ఆదుకోవడంలో మోదీ ప్రభుత్వం చేస్తున్న సహకారాన్ని ఎందుకు గుర్తించరు అని ప్రశ్నించారు.ఇంకో వైపు ఉత్తర–దక్షిణ విభజన రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటైంది. దేశ రాష్ట్రపతి ఒడిశా నుంచి వచ్చారు. ఉపరాష్ట్రపతి తమిళనాడు నుంచి వచ్చారు. ప్రధానమంత్రి గుజరాత్ నుంచి వచ్చారంటూ.. నార్త్, సౌత్, ఈస్ట్, వెస్ట్ అనే విభజనలు సృష్టించడం ఒక ముఖ్యమంత్రికి తగదని హెచ్చరిస్తున్నాం. భారతదేశం అంటే ఒకే దేశం, ఒకే ఆత్మ అనేది గుర్తుంచుకోవాలి.బీజేపీ తెలంగాణకు ఏమి చేసిందని అడిగే వారికి చర్చకు మేము సిద్ధం. మీ మొత్తం మంత్రివర్గం వచ్చినా నేను ఒక్కడినే సరిపోతాను. లెక్కలతో సహా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాను. కాంగ్రెస్ పాలనలో దశాబ్దాల పాటు తెలంగాణలో కేవలం 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు మాత్రమే ఉండగా, మోదీ ప్రభుత్వ పాలనలో దాదాపు 2,800 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారులు తెలంగాణకు వచ్చాయి.కాంగ్రెస్ పార్టీ దేశాన్ని దశాబ్దాల పాటు పాలించినా తెలంగాణకు ఒక్క ఎయిమ్స్ కూడా ఇవ్వలేదు. కానీ మోదీ గారు ఎయిమ్స్ మంజూరు చేశారు. వరంగల్ మామునూరు విమానాశ్రయం, ఆదిలాబాద్ విమానాశ్రయం అభివృద్ధికి కేంద్రం సిద్ధంగా ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ కూడా



పూర్తిచేయలేకపోతోందిప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకులు, తెలంగాణలో పదేళ్లు, మహారాష్ట్రలో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు కనీసం ఒక పునాది రాయి కూడా ఎందుకు వేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.. ఢిల్లీలోకి వెళ్లి కేంద్రం సహాయం కోరుతూ, తెలంగాణకు వచ్చాక కేంద్రాన్ని విమర్శించడం కాంగ్రెస్‌కు అలవాటైపోయింది.ముఖ్యమంత్రి పదవి అనేది దేవుడు ఇచ్చిన వరం. ఆ పదవిని ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగించాలి. కానీ రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా దేశాభివృద్ధి కోసం కష్టపడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ గారిపై, బీజేపీపై అవాకులు–చెవాకులు పేల్చడం మంచిది కాదు.బీజేపీ నాయకులకు కూడా ముఖ్యమంత్రి రేవంత్ లాంటి భాష రాదని కాదు, విమర్శలు చేయడం చేతకాదని కాదు. కానీ మేము సంస్కారంతో కూడిన రాజకీయాలను నమ్ముతాం. అయినప్పటికీ వ్యక్తిగత దూషణలు, తిట్ల రాజకీయాలు కొనసాగితే బీజేపీ నాయకులు కూడా తగిన విధంగా సమాధానం చెప్పగలరని గుర్తుంచుకోవాలని బూర హెచ్చరించారు.తెలంగాణకు మోదీ ప్రభుత్వం ఏమిచ్చింది, ఎంత నిధులు ఇచ్చింది, ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది అనే అంశాలపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం. దమ్ము, ధైర్యం ఉంటే కాంగ్రెస్ నాయకులు కూడా ముందుకు రావాలి.తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.

# శ్రీనగర్ పంచాయతీలో అనుమతులు లేని అక్రమ కట్టడాలు

**సరైన పత్రాలు లేకుండా ఏజెన్సీలో బహుళ అంతస్తుల నిర్మాణాలు**

**అంతస్తులు కడుతున్న పట్టించుకోని పంచాయతీ మండల్ అధికారులు**

**లక్ష్మీదేవి పల్లి జున్ 9 (స్కై న్యూస్ )**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.లక్ష్మీదేవి పల్లి మండలం శ్రీనగర్ కాలనీ పంచాయతీ పరిసరాల్లోని గిరిజన ప్రాంతాలు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతున్నాయి. గిరిజనుల హక్కులను రక్షించాల్సిన 1/70 చట్టం, ఐటిడిఏనిబంధనలు ఇక్కడ కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. కళ్ళముందే భారీ బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా, ఎమ్మార్వో ఆఫీస్ కి దగ్గరలో బహుళ అంతస్తులు కడుతున్న నిద్రమత్తు వీడని అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక భారీ స్థాయిలో అవినీతి హస్తం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు భూములు కొనడం అమ్మడం భారీ కట్టడాలు చేపట్టడంపై కఠినమైన నిషేధాలు ఉన్నాయి. కానీ, కొందరు బడా వ్యాపారస్తులు గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, బినామీ పేర్లతో భూములను ఆక్రమించి కోట్లాది రూపాయల విలువైన వాణిజ్య సముదాయాలను,అపార్ట్మెంట్లను నిర్మిస్తున్నారు. కేవలం పైస్థాయి ఒత్తిళ్లతోనే పంచాయతీ రాజ్ ఐటిడిఏ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. అక్రమ కట్టడాలకు నోటీసులు ఇవ్వాల్సింది పోయి, వాటికి మౌలిక వసతులు కల్పించడంలో చూపిస్తున్న ఉత్సాహం వెనుక ఉన్న మతలబు ఏమిటని గిరిజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.మరోవైపు, ఎన్నికల సమయంలో గిరిజన హక్కుల గురించి గొంతు చించుకునే ప్రజాప్రతినిధులు, ఈ అక్రమ నిర్మాణాల విషయంలో మౌనం వహించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనంగా నిలుస్తోంది. వీరి అండదండలు లేనిదే ఇంతటి భారీ నిర్మాణాలు సాధ్యం కాదన్నది బహిరంగ రహస్యం, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ భవనాల వల్ల డ్రైనేజీ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. భవిష్యత్తులో వరదలు సంభవిస్తే ఈ ప్రాంతం జలమయం అయ్యే ప్రమాదం ఉంది. గిరిజనుల భూములను, వారి సంస్కృతిని కాపాడాల్సిన చట్టాలు ఇక్కడ తుంగలో తొక్కబడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక





విచారణా కమిటీని ఏర్పాటు చేసి, లక్ష్మీదేవి పల్లి మండలం శ్రీనగర్ కాలనీలో లక్ష్మి దేవి పల్లి ఏజెన్సీ పరిధిలో గత ఐదేళ్లలో నిర్మించిన అన్ని బహుళ అంతస్తుల భవనాల అనుమతులను తనిఖీచేయాలి. అక్రమంగా నిర్మించిన వాటిని తక్షణమే కూల్చివేయడమే కాకుండా, సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ కోరుతున్న ప్రజలు.

# జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయాలి

**డాక్టర్.తుకారాం రాథోడ్ డి ఎం హెచ్ ఓ**

**కొత్తగూడెం జూన్ 9 (స్కై న్యూస్ ):**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహించే సమీక్ష సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది, ఈ సమావేశంలో జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసర్లు అందరు పాల్గొన్నారు.సమావేశంలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ, ముఖ్యంగా సాధారణ ప్రసవాలను పెంచడం, మాతృ మరియు శిశు ఆరోగ్య సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించారు.అలాగే యాంటీ మలేరియా కార్యక్రమాలు, ఆంటీ డయేరియల్ ప్రోగ్రాం, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు, ఫ్లూ వ్యాక్సినేషన్ కార్యక్రమాల అమలు స్థితిని సమీక్షించారు. ఈ కార్యక్రమాలను మరింత బలోపేతం చేసి, జిల్లాలో వ్యాధుల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.టీ బి నోటిఫికేషన్‌ను పెంచడం, అనుమానిత ట్యూబర్క్యులోసిస్ కేసుల నుంచి స్పుటం శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించడం, నిర్ధారిత రోగులకు సకాలంలో మందులు అందించడం పై ప్రత్యేకంగా సూచించారు.అదేవిధంగా రక్తపోటు షుగర్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించి, అవసరమైన వారికి నిరంతర మందుల సరఫరా జరిగేలా చూడాలని ఆదేశించారు. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, అనుమానిత కేసులను ఉన్నత స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు.పాలియేటివ్ కేర్ సేవలను



సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచిస్తూ, అవసరమైన దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దనే సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అలాగే ప్రజలు ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లు పాటించాలని, ప్రతిరోజూ శారీరక శ్రమ చేయాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని సమావేశంలో అవగాహన కల్పించారు.అబస్ హాజరు విధానం, సమయపాలన, ఫీల్డ్ స్థాయి సేవల నాణ్యత, ఆరోగ్య కేంద్రాల పనితీరు వంటి అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రతి ప్రోగ్రాం అధికారి తమకు అప్పగించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు.ప్రజారోగ్య సూచికలను మెరుగుపరచడానికి సమన్వయంతో పని చేయాలని, ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సమావేశంలో స్పష్టం చేశారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎటువంటి లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన తెలియజేశారు. మాతృ మరణాలు జరగకుండా నివారించాలని హైరిస్కు గర్భిణీలకు ప్రత్యేక శ్రద్ధతో సేవలు అందించాలని తెలియజేశారు , చిన్నపిల్లలకు అర్హులైన అందరికీ అన్ని రకాల వ్యాక్సిన్లు సకాలంలో వేయాలని ఆదేశించారు సమావేశం చివరలో అన్ని ప్రోగ్రాం అధికారులు తమ ప్రగతి నివేదికలను సమర్పించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ సాయి కళ్యాణ్ డి వై డీ ఎం హెచ్ ఓ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ దినేష్ ,డాక్టర్ హరీష్ , డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు


# నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చిన సీఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా జోన్ 9 : ( స్కై న్యూస్ )** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ కోశాధికారి చింత సాయి తేజేశ్వర్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలవుతున్న ప్రజాపాలన కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని అన్నారు ప్రజాపాలనలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతోందని, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు చేరుతున్నాయని తెలిపారు షాద్‌నగర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్ల నిర్మాణంపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించిన ఆయన, ప్రస్తుతం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధితో పాటు పేదల గృహ కలను నెరవేర్చేందుకు కృషి కొనసాగుతోందని చింత సాయి తేజేశ్వర్ పేర్కొన్నారు.

# కృత్రిమ మాయలో మనిషి

'కృత్రిమ మేధ'గా మనం చెప్పుకునే 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) 'కపటి' అనే అర్థంలో నిజంగానే కృత్రిమంగా మారి ప్రపంచాన్ని భయపెడుతోంది. తెలుగులో 'నకిలీ తెలివి' లాంటి మాటల్ని వెతుక్కునే లోపలే అది నకిలీ విన్యాసాలలో చిత్రవిచిత్రమైన లోతులు చూస్తోంది. ఒక చేత్తో సానుకూలపు పూల బాణాలనూ, ఇంకోచేత్తో ప్రతికూలపు వాడిబాణాలనూ ప్రయోగిస్తూ జనాన్ని ఏకకాలంలో మోహపారవశ్యంలోనూ, భయవిభ్రమాల్లోనూ ముంచెత్తుతోంది. అనుకూల ఫలితాలపై ఆశపడుతూనే, ప్రతికూల ప్రభావాలనుంచి తప్పించుకునే మార్గాల వేటలో ప్రపంచం తలమునకలవుతోంది. భారత్, చైనా, రష్యా సహా పది దేశాలు సభ్యులుగా ఉన్న 'బ్రిక్స్' కూటమి కృత్రిమ మేధో వినియోగంలో, అభివృద్ధిలో, దానితో ముడిపడిన నైతిక సమస్యల నివారణలో, మేధో హక్కులూ, డేటా పరిరక్షణలో కలసి పనిచేసే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా, సాంస్కృతిక రంగంలో కృత్రిమ మేధో దుర్వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో వర్కింగ్ గ్రూప్ సమావేశాలు జరుపుతోంది; ఒక సమావేశానికి ప్రపంచ పురాతన నగరాలలో ఒకటైన వారణాసి వేదిక కాబోతోంది. కృత్రిమ మేధ ఏం చేస్తోందంటే, ఒక సాంకేతిక మహాద్భుతంగా మాయామేయ మాంత్రిక జగత్తును సృష్టిస్తూ పురాణ, ఇతిహాస, జానపద కథల కాలంలోకి తీసుకెడుతోంది. రామాయణంలో భర్త శాపానికి గురై అహల్య శిలగా మారిపోవడం, రాముని పాదాలు తాకగానే పూర్వరూపం తెచ్చుకోవడం గురించి చదివాం; 'జగదేకవీరుని కథ' సినిమాలో జలక్రీడలాడుతున్న దేవకన్యలను చూసిన పాపానికి వారి శాపానికి ఎరై కథానాయకుడు శిలగా మారిపోవడం, ఒక వృద్ధ మహిళ అతనికి శాపవిముక్తి కలిగించడం చూశాం. త్రిశంకుని స్వర్గానికి పంపించే ప్రయత్నంలో అతణ్ణి మధ్యలోనే స్తంభింపజేసి 'త్రిశంకు స్వర్గా'న్ని సృష్టించిన విశ్వామిత్రుని పునఃసృష్టి పాటవాన్ని కథల్లో దర్శించాం. రామాయణంలో ఇంద్రజిత్తు చేసే మబ్బుచాటు మాయావి యుద్ధాన్నీ, మహాభారతంలో సైంధవుని వధ సందర్భంలో కృష్ణుడు చక్రం అడ్డేసి కృత్రిమ సూర్యాస్తమయాన్ని సృష్టించడాన్నీ తిలకించాం. తన అర్థాంగి పార్వతి అభ్యంగన స్నానానికి వెడుతూ నలుగుపిండి నుంచి సృష్టించి కాపలాపెట్టిన బాలుడు తనను అడ్డగించినందుకు శివుడు ఆగ్రహించి అతని శిరస్సును ఖండించడం; నిజం తెలిసి అతనికి ఏనుగు తలను అతికించి,



బతికించడం గురించి విన్నాం. తలలు తీసి తలలు పెట్టడంతో సహా కృత్రిమ మేధ ఇలాంటి చిత్రవిచిత్ర సన్నివేశాలను అవలీలగా సృష్టించగలుగుతోంది. అవి కపటత్వపు అంచులు తాకుతూ ప్రసిద్ధ వ్యక్తుల శీలహననానికి పాల్పడుతూ వివాదాస్పదమవుతున్నాయి; నిజమో, అబద్ధమో తెలియని త్రిశంకు స్థితికి జనాన్ని నెడుతున్నాయి. రాజకీయ నాయకులు, సినీనటులతో సహా ప్రముఖుల రూపాలనూ, గొంతులనూ వాడుకుంటూ అభ్యంతరకర సన్నివేశాలను సృష్టించడం, వారు న్యాయస్థానాలను ఆశ్రయించడం చూస్తున్నాం. పూర్తి సాంకేతిక నైపుణ్యాలూ, సాంకేతికతను బాధ్యతాయుతంగా వాడుకోవాలనే స్పృహ లేనివారికి కూడా కృత్రిమ మేధ అందుబాటులోకి రావడం వల్ల తలెత్తే ఇలాంటి వైపరీత్యాలతో కూడా పురాణ, ఇతిహాస కథలతో పోలిక కుదరడం మరో వైచిత్రి. ఉదాహరణకు, మహాభారతంలోని అశ్వత్థామతో ముడిపడిన ఒక ఉదంతాన్నే చూస్తే, కురుక్షేత్ర యుద్ధాంతంలో అతను ఉపపాండవులను వధించి పారిపోయినప్పుడు అతణ్ణి పట్టుకోవడానికి భీముడు బయలుదేరి వెడతాడు; అశ్వత్థామ క్రూరుడనీ, చపలచిత్తుడనీ; అతని దగ్గర 'బ్రహ్మశిరోనామక'మనే దివ్యాస్త్రం ఉందనీ, దాని ప్రయోగమే తప్ప ఉపసంహారం అతనికి తెలియదనీ కృష్ణుడు అర్జునుడితో చెప్పి భీముని కాపాడుకోవడానికి తక్షణమే వెళ్ళాలంటాడు; ఊహించినట్టే అశ్వత్థామ దానిని ప్రయోగించడం, ప్రయోగోపసంహారాలు రెండూ తెలిసిన అర్జునుడు అదే అస్త్రంతో దానిని శాంతింపచేయబోవడం చూస్తాం. మనిషి-- తన మేధ సృష్టించిన కృత్రిమ మేధముందు తనే చిత్తవుతున్నాడు. మాంత్రికతనుంచి వాస్తవికతవైపు వెడుతున్న భ్రమలో ఉన్న మనిషిని కృత్రిమ మేధ తిరిగి మాంత్రికతవైపు మళ్ళిస్తూ పైచేయిని చాటుకుంటోంది. తను సృష్టించిన సాంకేతికత చేతిలో తనే ఓడి దిక్కులు చూసే పరిస్థితిని తెచ్చుకోవడం మనిషిని తొలినుంచి వెంటాడుతున్న శాపం.

# ఎన్నికల స్వరూపాన్ని ఎత్తిచూపిన ఏడుకోలల బాయి

ప్రజాస్వామ్యం అనే పదం వినగానే మనసులో ఒక పవిత్రమైన భావన కలుగుతుంది. ప్రజల చేతుల్లో దేశ భవిష్యత్తు ఉండే వ్యవస్థ అది. కానీ కాలం మారినకొద్దీ ఎన్నికల స్వరూపం కూడా మారిపోయింది. ఒకప్పుడు ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన నాయకుల స్థానంలో..ఇప్పుడు అధికారమే లక్ష్యంగా చూసే నేతలు పెరిగిపోయారు. ఎన్నికలు వస్తే చాలు హామీల హోరు, డబ్బు ప్రవాహం, కులమతాల లెక్కలు, ప్రలోభాల రాజకీయాలు మొదలవుతున్నాయి. ప్రజల సమస్యల కంటే గెలుపే ముఖ్యమైపోయిన ఈ పరిస్థితిని చూసిన ప్రతిస్పందనగానే డా.ఏనుగు నరసింహారెడ్డి రచించిన 'ఏడుకోలల బాయి' అనే శతకం రూపుదిద్దుకున్నది. ఈ కృతి కేవలం పద్యాల సమాహారం కాదు. మన సమకాలీన రాజకీయాలపై ఆయన గుండె నుంచి వచ్చిన గట్టి ప్రశ్న. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న వక్రీకరణలు, ఓటర్ల అమాయకత్వం, నాయకుల అవకాశవాదాన్ని పదునైన వ్యంగ్యంతో, తెలంగాణ మట్టివాసనతో కూడిన భాషలో కవి ఆవిష్కరించారు. ఈ శతకంలోని ప్రధాన ఆకర్షణ భాష. సంప్రదాయ పద్యాల్లో కనిపించే భారమైన సంస్కృత ప్రభావం కంటే..ఇందులో ప్రజల నోట వినిపించే మాటలే ఎక్కువ. తెలంగాణ పలుకుబడులు, ఉర్దూ-హిందీ-ఆంగ్ల పదాల మేళవింపు ఈ పద్యాలకు సహజత్వాన్ని తీసుకొచ్చాయి. చదువుతుంటే మన ఊరి చౌరస్తాలో కూర్చొని ఎవరో తమ మనసులోని బాధ చెప్తున్నట్టుగా అనిపిస్తుంది.

కవి చూపించిన రాజకీయ వాస్తవాలు మన రోజువారీ జీవితానికి దగ్గరగా ఉంటాయి. పార్టీలు మారే నాయకులు, టికెట్ల కోసం విలువలు వదిలేసే వ్యక్తులు, ప్రజలను కులమతాల పేరిట విడగొట్టే కుట్రలు, ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే సేవాభావం ఇవన్నీ ఈ కృతిలో అద్దంలా ప్రతిబింబిస్తాయి. అధికారంలోకి రావటానికి ఎలాం టి మార్గమైనాసరే అనుకునే రాజకీయ ధోరణిపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు రచయిత. ఈ శతకం ఓటరుని కూడా ప్రశ్నిస్తుంది. క్షణిక ప్రయోజనాల కోసం ఓటు అమ్ముకోవటం ఎంత ప్రమాదకరమో గుర్తుచేస్తుంది. ఒక ఓటు వెనుక సమాజ భవిష్యత్తు దాగి ఉన్నదని పదేపదే హెచ్చరిస్తుంది. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేది నాయకులు కాదు, చైతన్యవంతమైన ఓటరులేనని ఈ కృతి బలంగా చెప్తుంది. సాహిత్యపరంగా కూడా 'ఏడుకోలల బాయి' ప్రత్యేకతను సంపాదించింది. సీసపద్య సంప్రదాయానికి ఆధునిక భావజాలాన్ని జోడిస్తూ ఏనుగు నరసింహారెడ్డి కొత్త ప్రయోగాలు చేశారు. ముఖ్యంగా నాలుగు పాదాల మకుటంతో సాగించిన నిర్మాణం వినూత్నంగా నిలిచింది. వ్యంగ్యం, సామాజిక చైతన్యం, ప్రజా భాష ఈ మూడు కలిసినప్పుడు పద్యం ఎంత శక్తివంతమవుతుందో ఈ శతకం నిరూపిస్తుంది. ఇది కేవలం రాజకీయాలపై విమర్శ మాత్రమే కాదు..మంచి వ్యవస్థ కోసం చేసిన ఆత్మీయ పిలుపు కూడా. ఎన్నికలు మారాలి, నాయకత్వం మారాలి, ముఖ్యంగా ప్రజల ఆలోచనా విధానం మారాలనే ఆకాంక్ష ఈ రచన అంతటా కనిపిస్తుంది. సమాజాన్ని గమనించే కండ్లున్న ప్రతి పాఠకుడిని ఆలోచింపజేసే శక్తి 'ఏడుకోలల బాయి'కి ఉన్నది. ప్రజాస్వామ్యం మీద ప్రేమ ఉన్నవారెవరైనా తప్పక చదవాల్సిన సమకాలీన శతకమిది.

# లద్దాక్‌కు పోటెత్తున్న టూరిస్టులు

వేసవిలో టూరిస్టు ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. అయితే మన దేశంలో అందమైన కశ్మీర్‌లోని పహల్గాంలో గతేడాది జరిగిన ఘటనలో పర్యాటకులు కాస్త తగ్గారు. కానీ కేంద్రం, ఆర్మీ తీసుకున్న రక్షణ చర్యలతో ఈ వేసవిలో లద్దాక్‌కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఈ మే నెలలో మొత్తం 72,834 మంది పర్యాటకులు లద్దాక్‌ను సందర్శించారు. గత ఏడాది మే నెలలో 32,927 మంది మాత్రమే వచ్చిన విషయాన్ని పోలిస్తే ఇది 121.2% అద్భుత పెరుగుదల. లద్దాక్ టూరిజం చరిత్రలో ఇది ఒక నిజమైన మైలురాయి. జనవరి నుంచి మే వరకు మొత్తం 1,17,546 మంది సందర్శకులు వచ్చారు. గతేఏడాది అదే కాలంతో పోలిస్తే 43.65% వృద్ధి. ఇందులో దేశీయ పర్యాటకుల సంఖ్య 1,10,585 (45.9% పెరుగుదల), విదేశీయులు 6,961 (15.5% పెరుగుదల). లద్దాక్ ఆర్థిక వ్యవస్థలో టూరిజం ఎంత కీలక పాత్ర పోషిస్తోందో స్పష్టంగా చెప్పే సంకేతాలు.లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఈ వృద్ధిని సమర్థించడమే కాకుండా, టూరిజం రంగానికి స్థానికులకు ఉపాధి కల్పించే ముఖ్యమైన ఇంజిన్‌గా అభివర్ణించారు. ఆయన నాయకత్వంలో గత కొన్ని నెలల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయి. హోటల్స్, హోమ్‌స్టేలు, టూర్ ఆపరేటర్ల కోసం ఏకీకృత, సరళీకృత రిజిస్ట్రేషన్ విధానం, టూరిజం



యూనిట్లకు "ఇండస్ట్రీ" స్టేటస్ ఇవ్వడం కాంప్లయన్స్ భారం తగ్గించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించాయిఈ సంస్కరణలు స్థానిక యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాయి. హోమ్‌స్టేలు, ట్రాన్స్‌పోర్ట్, హ్యాండిక్రాఫ్ట్, ఫుడ్ అండ్ బెవరేజెస్ రంగాల్లో ఉపాధి పెరిగింది. మెరుగైన రోడ్డు కనెక్టివిటీ, ఎక్కువ విమాన సర్వీసులు, సోషల్ మీడియా ద్వారా లద్దాక్ సౌందర్యం వైరల్ కావడం, పోస్ట్?పాండమిక్ ట్రావెల్ బూమ్ ఈ సీజన్‌ను రికార్డు స్థాయికి తీసుకెళ్లాయి. ప్రత్యేకించి మే నెలలో రోడ్లు తెరవడం, అనుకూల వాతావరణం, పర్వతాలు, సరస్సులు, మఠాలు, అడ్వెంచర్ యాత్రలు కలిపి ఒక అద్భుతమైన అనుభవాన్ని అందిస్తున్నాయి. ఈ అపూర్వ వృద్ధి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నప్పటికీ, లద్దాక్ పర్యావరణ సున్నితత్వాన్ని మరచిపోకూడదు. ఇప్పటికే పాపులర్ స్పాట్లైన పాంగాంగ్ లేక్, నుబ్రా వ్యాలీ, లే?మనాలి హైవేల్లో క్రౌడింగ్, వాస్తే మేనేజ్‌మెంట్, నీటి కొరత, వాహనాల నుంచి వచ్చే కాలుష్యం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. లద్దాక్ ఒక ఫ్రాజైల్ ఎకోసిస్టమ్. ఇక్కడ టూరిజం వృద్ధి చెందాలంటే అది సస్టైనబుల్, రెస్పాన్సిబుల్ టూరిజంగా మాత్రమే ఉండాలి. ప్రభుత్వం, స్థానికులు, టూరిజం స్టేక్‌హోల్డర్లు కలిసి పనిచేసి, క్యాపాసిటీ బిల్డింగ్, ఆఫ్?సీజన్ టూరిజం ప్రోత్సాహం, ఎకో?టూరిజం, వేస్ట్ మేనేజ్‌మెంట్, కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గించడం వంటి వ్యూహాలను అమలు చేయాలి.లద్దాక్ టూరిజం ప్రస్తుతం చూస్తున్న ఈ బూమ్ ఒక అపూర్వ అవకాశం. సరైన ప్రణాళిక, స్థానికుల పాల్గొన్నత, పర్యావరణ సంరక్షణతో కూడిన విధానాలతో ఈ వృద్ధిని మరింత స్థిరంగా, అర్థవంతంగా మార్చుకోవాలి. లద్దాక్ కేవలం ఒక టూరిస్ట్ డెస్టినేషన్ కాదు.. ఇది ఒక ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, ప్రకృతి. దానిని కాపాడుకుంటూ అభివృద్ధి చేయడమే నిజమైన విజయం.

## నిలోఫర్‌లో వైద్యులు నిరసన

**హైదరాబాద్ :** నిలోఫర్ ఆస్పత్రిలో పీజీ వైద్యుడిపై రోగి సహాయకుడి దాడి చేయడాన్ని నిరసిస్తూ, పీజీ వైద్యులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. మూడు రోజులక్రితం డాక్టర్స్ పై దాడి జరిగినా అధికారులు, పోలీసులు పట్టించుకోలేదని వారన్నారు. పిజి విద్య విద్యార్థులపై రోగి సహాయకులు దాడి చేయడాని నిరసిస్తూ...దాడి చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలికను ఆసుపత్రికి తీసుకొచ్చారు. వచ్చిన మొదటి రోజునుండి బాలిక తాలూకు కుటుంబసభ్యులు ఐసీయూలో పదుల సంఖ్యలో వచ్చి తీవ్ర ఇబ్బందులు పెట్టారు. శని వారం అర్ధరాత్రి రోగి సహాయకుడు ఐసీయూలోకి వచ్చి వాగ్వాదం చేసి డాక్టర్ పై రోగి సహాయకుడు దాడికి దిగారు. వెంటనే స్పీఎఫ్ పోలీసులకు పిర్యాదు చేసారని అన్నారు. ఎస్పీఎఫ్ పోలీసులు డాక్టర్స్ కు కాకుండా దాడికి పాల్పడిన వారికే మద్దత్తు పలకడానికి పిజి వైద్యులు తీవ్రంగా ఖండించారు నాంపల్లి పోలీసులకు పిర్యాదు చేసిన ...అప్పటికి పోలీసులు పట్టించుకోకపోవడం తో పిజి వైద్యులు వీధులు బహిష్కరించి ఆందోళ చేపట్టారు.

## బోల్లారం లో చైన్ స్నాచింగ్

**మేడ్చల్ :** బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో తెల్లవారుజామున చోరీ కలకలం రేపింది. చింతల బజార్ గంగపుత్ర సంఘం వెనుక కాలనీలో ఘటన జరిగింది. ఇంటి ముందు వాకిలి ఊడుస్తున్న మహిళపై దుండగుడి దాడి జరిగింది. ముఖంపై మత్తు పౌడర్ చల్లి బంగారు పుస్తెలతాడు అపహరణ జరిగింది. బాధితురాలు రాంప్రసాద్ భార్య.. సుమారు 7 తులాల బంగారం చోరీ అయింది. సమాచారం అందుకున్న వెంటనే బొల్లారం పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## తమను దూషించిన వారు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి.

**కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి.**

**లేనిపక్షంలో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.**

తమను దూషించిన సెంట్రింగ్ కార్మిక సంఘాల పై చర్యలు తీసుకోవాలంటూ మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఆగ్రహం వ్యక్తమైంది. పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో కార్మికులు సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. నిర్మాణ రంగంలో రక్తాన్ని చెమటగా మార్చే కార్మికులను దళారీలు, మోసగాళ్లు అంటూ సెంట్రింగ్ కార్మిక సంఘాలు చేసిన అనుచిత వ్యాఖ్యలపై కార్మిక లోకం భగ్గుమంది.భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించేది లేదని మేస్త్రీల సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు. ఘట్కేసర్ సర్కిల్, 8వ డివిజన్ పోచారం పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో సోమవారం ఉదయం నుంచే వాతావరణం వేడెక్కింది. తమను దుర్భాషలాడిన సెంట్రింగ్ సంఘాల వారికి వ్యతిరేకంగా కార్మికులు రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా రాజీవ్ గృహకల్ప కాలనీ భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీల సంఘం అధ్యక్షుడు తిరుమలయ్య మాట్లాడుతూ... రాత్రింబవళ్లు కష్టపడి భవనాలు నిర్మించే కార్మికులను కొందరు నోటికొచ్చినట్లు దూషించడం దారుణమన్నారు.ఈ నిరసన కేవలం కాలనీకే పరిమితం కాదని, రాష్ట్ర రాజధాని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మహా ధర్నాకు మద్దతుగా ఈ ర్యాలీ చేపట్టామని నేతలు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేస్త్రీల సంఘం పెద్దలు, కార్మిక సంఘాల నేతల సూచనల ప్రకారం... న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, అవసరమైతే నిర్మాణ పనులన్నింటినీ బంద్ చేసి నిరసనను ఉధృతం చేస్తామని కార్మిక నేతలు ఘాటుగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అవునా నిర్మాణ కార్మికుల మేస్త్రి సంఘం ఉపాధ్యక్షుడు కీల భాస్కర్, ప్రధాన కార్యదర్శి మద్దూరి శ్రీను, కోశాధికారి ఈ. ఉపేందర్, ప్రచార కార్యదర్శి ఎం. శేఖర్ మరియు కమిటీ సలహాదారులు ఎస్.కె. ఆలీ భాయ్, సైదులు, డి.వి. కృష్ణ మరియు భవన నిర్మాణ కార్మికులు మేస్త్రిలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించగా, అందులో తొలి విడతగా రూ.50 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. సోమవారం అంబేద్కర్ భవన్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల్లో నిర్మించనున్న ఈ నాలెడ్జ్ సెంటర్ నిరుపేద విద్యార్థులకు ఉన్నత స్థాయి శిక్షణ అందించే కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని భట్టి తెలిపారు. ఇందులో శిక్షణ తరగతులు, ఆధునిక డిజిటల్ లైబ్రరీ, వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులతో సెమినార్లు, చర్చా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని పంచుతామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యా, ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ కేంద్రాలు దోహదపడతాయని అన్నారు.అదే విధంగా, నింబోలి అడ్డలోని ఎస్సీ హాస్టల్‌ను ఆధునికీకరిస్తున్నామని, దానికి "బాబు జగ్జీవన్ రామ్ భవన్"గా నామకరణం చేయనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శంకర విద్యాలయ స్కూల్ తొలగించాలి.

శక్తి సాయి నగర్ లో శంకర విద్యాలయ స్కూల్ ఏ యూనిట్ ఆఫ్ శాండిల్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్కూల్ ను తక్షణమే కాలనీ నుంచి తొలగించాలని శక్తి సాయి నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం శంకర విద్యాలయ స్కూల్ ఎదుట కాలనీవాసులు పెద్ద ఎత్తున చేరి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి స్కూలు ఇక్కడ ఏర్పాటు చేయొద్దని పోరాటాలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ క్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి డీఈఓ, మండల అధికారి ఎంఈఓ కు సైతం ఫిర్యాదులు చేసినట్లు వివరించారు. తాము ఎన్ని ఫిర్యాదు చేసినా కూడా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. స్కూల్ ని ఇక్కడ ఏర్పాటు చేయడం వల్ల కాలనీవాసులకు పెద్ద ఎత్తున ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. కాలనీలో రెసిడెన్షియల్ అనుమతి తీసుకొని నిర్మించిన భవనంలో కమర్షియల్ గా స్కూల్ ఏర్పాటు చేయడం కూడా చట్ట విరుద్ధమని దీనిపైన కూడా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్కూలును కాలనీ నుంచి తీసివేయాలని లేనియెడల పెద్ద ఎత్తున కాలనీవాసులు అందరం నిరసన కార్యక్రమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

## నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**హైదరాబాద్ :** సిపిఎం ఆధ్వర్యంలో రెండు రోజుల యువజన సమ్మేళనం జరగనుంది. ఈ నెల 16, 17 తేదీల్లో కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ హాలులో యువజన సమ్మేళనం జరగనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కక్రోజ్ పార్టీ పేరుతో యూత్ నిరసన వ్యక్తం చేస్తుంది. ఈ సమ్మేళనంలో యువజన సమస్యలపై చర్చించడంతోపాటు భవిష్యత్తు కార్యచరణ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్ పై దృష్టి పెట్టటడంలేదు. ప్రభుత్వం రంగంలో 60లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. రైల్వేస్ లో 10లక్షల ఖాళీలు ఉన్నాయి. రాజీవ్ యువ వికాసం ప్రకటించి దానికి నిధులు కేటాయించటం లేదు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఎస్సీ ఎస్టీసంక్షేమం నిర్వీర్యం అయ్యాయని ఆయన ఆరోపించారు..

# బిజినెస్

## బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల.. ఈరోజు ఎలా ఉన్నాయంటే..



శనివారం నాడు బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గడం, డాలర్ బలపడడం మొదలైన కారణాలతో పసిడి ధరలు క్రమంగా తగ్గుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,720గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,42,740గా ఉంది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,870గా ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,42,890గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా స్వల్ప తగ్గుదలను నమోదు చేశాయి కిలోకు వంద రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,79,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,74,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,79,900గా, బెంగళూరులో రూ.2,74,900గా ఉంది.

## ట్రైన్ టికెట్ దొరకట్లేదా.. అసలు కారణం ఇదే!




ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు.. అవినీతి, మోసపూరిత కార్యకలాపాలను అరికట్టేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ కీలక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా రైల్వే టికెట్ల బుకింగ్‌లో జరుగుతున్న అక్రమాలను నియంత్రించేందుకు ఈ సన్నాహాలు చేస్తోంది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ.. రైలు టికెట్లు పొందడం ప్రయాణికులకు చాలా కష్టంగా మారింది. టికెట్ బుకింగ్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే సీట్లు పూర్తవుతున్నాయని చాలామంది ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణంగా బాట్స్, టౌట్స్, నకిలీ ఖాతాలు, మోసపూరిత యూజర్ ఐడీలు అని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ మూడు కోట్లకు పైగా అనుమానాస్పద యూజర్ ఐడీలను డీయాక్టివేట్ చేసింది. అదనంగా మరో ఆరు కోట్ల ఖాతాలను పరిశీలన కోసం గుర్తించింది. టికెట్ బుకింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా.. 4.2 లక్షల అనుమానాస్పద పీఎన్‌ఆర్‌లకు సంబంధించిన 501 ఫిర్యాదులను నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదు చేసింది. అలాగే నకిలీ డిజిటల్ గుర్తింపులతో సంబంధం ఉన్న 13,343 అనుమానాస్పద ఈమెయిల్ డొమైన్‌లను కూడా బ్లాక్ చేసింది. ఈ చర్యల వల్ల ప్రయాణికులకు టికెట్లు అందుబాటులోకి రావడం సులభమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# అంచనాలను మించిన భారత జీడీపీ

న్యూఢిల్లీ: దేశీయంగా వినియోగానికి డిమాండ్ పటిష్టంగా ఉండటం, ప్రభుత్వం కూడా గణనీయంగా వ్యయాలు చేయడంతో గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనాలకు మించి వృద్ధి చెందింది. 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఇది 7 శాతంగాను, తాజా క్యూ3లో 8 శాతంగాను నమోదైంది. ఇక వినియోగం, పెట్టుబడులు మెరుగ్గా ఉండటంతో పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను జీడీపీ 7.7 శాతం మేర వృద్ధి చెందింది. 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 7.1 శాతంగా నమోదైంది. కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అంతర్జాతీయంగా పరిస్థితులు మెరుగుపడితే 2028 ఆర్థిక సంవత్సరంలో భారత్ మళ్లీ 7 శాతానికి పైగా వృద్ధి సాధించవచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ తెలిపారు. ఆర్‌బీఐ అంచనా వేస్తున్నట్లుగా 2027 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7 శాతం లోపునకు నెమ్మదించినా, స్థూల ఆర్థిక స్థిరత్వానికి ప్రభుత్వం తీసుకునే పాలసీపరమైన చర్యలనేవి ఎకానమీ మళ్లీ 7 శాతం పైగా వృద్ధి రేటువైపు మళ్లేందుకు దోహదపడగలవని పేర్కొన్నారు. స్థిర ధరల ప్రాతిపదికన వాస్తవ జీడీపీ 2025--26లో రూ. 323.12 లక్షల కోట్ల స్థాయిలో ఉంటుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) పేర్కొంది. ప్రస్తుత ధరల్లో నామినల్ జీడీపీ రూ. 346.36 లక్షల కోట్ల స్థాయిలో ఉండొచ్చని వివరించింది. 2025--26లో నిర్మాణం, తయారీ, ట్రేడ్, హోటల్స్, రియల్ ఎస్టేట్, ఐటీ తదితర సెకండరీ, టర్షరీ రంగాలు వరుసగా 8.8 శాతం, 9.3 శాతం వృద్ధి చెందాయి. వ్యవసాయం, ఫిషరీ రంగాల దన్నుతో ప్రైమరీ సెక్టార్ 3.6 శాతం వృద్ధి చెందింది.




### పశ్చిమాసియా ప్రభావం క్యూ1లో ..

పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం జనవరి--మార్చి త్రైమాసికంలో ఒక నెలలోనే కనిపించింది. కీలకమైన ముడి చమురు, నేచురల్ గ్యాస్, ఎల్‌పీజీపరంగా సంక్షోభ పూర్తి ప్రభావం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్--జూన్) కనిపించనుంది. ఇంధనాలు, కమోడిటీల ధరలు భారీ స్థాయిలో తిరుగాడుతుండటం, సరఫరా వ్యవస్థలో ఆటంకాలు తదితర సవాళ్ల నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాలను రిజర్వ్ బ్యాంక్ 6.9% నుంచి 6.6 శాతానికి తగ్గించింది.

### సంస్కరణల ఎక్స్‌ప్రెస్ దూకుడు..

గ్లోబల్ సవాళ్ల నడుమ ఆర్థిక ప్రగతి సాధించే దిశగా పాలసీలపరంగా నిర్ణయాత్మక చర్యలతో సంస్కరణల ఎక్స్‌ప్రెస్ దూకుడుని కొనసాగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎక్స్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పోస్ట్ చేశారు.

# ఏఐ దాహం.. ప్రపంచానికి కొత్త సవాల్!

కృత్రిమ మేధస్సు సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు కారణమవుతోంది. విద్య, వైద్యం, పరిశ్రమలు, రవాణా, వినోదం వంటి అనేక రంగాల్లో ఏఐ వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. అయితే.. ఈ అభివృద్ధి వెనుక సమస్యలు కూడా ఉన్నాయని, ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాల కంటే.. దాని కోసం అవసరమయ్యే నీరు, విద్యుత్, భూమి వినియోగం భవిష్యత్తులో పెద్ద సవాలుగా మారవచ్చని యూఎన్‌యూ హెచ్చరించింది. ఏఐ వ్యవస్థలు పనిచేయడానికి భారీ డేటా సెంటర్లు అవసరం. ఈ డేటా సెంటర్లలో వేలాది సర్వర్లు నిరంతరం పనిచేస్తుంటాయి. దీంతో సర్వర్లు అధిక ఉష్ణోగ్రతలకు లోనవుతాయి. అలాంటప్పుడు వీటిని చల్లబరచడానికి భారీ మొత్తంలో నీరు అవసరమవుతుంది. యూఎన్‌యూ నివేదిక ప్రకారం.. 2030 నాటికి డేటా సెంటర్లు వినియోగించే నీరు, ప్రపంచంలోని 1.3 బిలియన్ మంది ప్రజల ప్రాథమిక గృహ అవసరాలను తీర్చగల స్థాయిలో ఉండవచ్చని అంచనా. ఇది ప్రస్తుతం మొత్తం ఆఫ్రికా ఖండ జనాభాకు సమానం అని తెలుస్తోంది. ఇప్పటి వరకు ఏఐ గురించి జరిగిన చర్చల్లో కార్బన్ ఉద్గారాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. కానీ నీటి వినియోగం కూడా అంతే ముఖ్యమైన సమస్యగా మారుతోందని పరిశోధకులు చెబుతున్నారు. ఏఐ మోడళ్లను నడపడానికి అవసరమైన విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియలోనూ, సర్వర్ల శీతలీకరణలోనూ భారీ స్థాయిలో నీటి వినియోగం ఉంటుంది. విద్యుత్ వినియోగం విషయంలో కూడా.. పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. 2030 నాటికి ఆధారిత డేటా సెంటర్లు ప్రతి సంవత్సరం సుమారు 945 టెరావాట్ గంటల విద్యుత్‌ను వినియోగించే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఇది పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియా దేశాల వార్షిక విద్యుత్ వినియోగాన్ని కలిపినా వచ్చే మొత్తానికి దాదాపు మూడు రెట్లు ఎక్కువ. ఏఐ అనేది కేవలం డిజిటల్ సాంకేతికత మాత్రమే కాదని నివేదిక స్పష్టం చేసింది. దీనికి అత్యాధునిక కంప్యూటర్ చిప్స్, భారీ డేటా సెంటర్లు, శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ మౌలిక సదుపాయాలు అవసరం. ఇవన్నీ భూమి వనరులపై గణనీయమైన ఒత్తిడిని



కలిగిస్తాయి. డేటా సెంటర్ల నిర్మాణం కోసం విస్తారమైన భూభాగం అవసరమవుతుంది. అదనంగా చిప్‌ల తయారీ ప్రక్రియలో కూడా విలువైన ఖనిజాలు, నీరు, పవర్ పెద్ద మొత్తంలో వినియోగించాల్సి ఉంటుంది. అయితే.. ఇక్కడ ఐక్యరాజ్యసమితి ఏఐ అభివృద్ధిని నిలిపివేయాలని సూచించడం లేదు. బదులుగా ప్రభుత్వాలు, టెక్నాలజీ సంస్థలు, వినియోగదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించా లని కోరుతోంది. కొత్త ఆవిష్కరణలతో పాటు నీటి వినియోగం, విద్యుత్ అవసరాలు, భూమి వినియోగం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తోంది. ఏఐ మానవ జీవితాన్ని సులభతరం చేస్తున్నప్పటికీ దాని వెనుక దాగి ఉన్న పర్యావరణ వ్యయాన్ని విస్మరించకూడదు. భవిష్యత్తులో సాంకేతిక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను సాధించడం ప్రపంచ దేశాల ముందున్న ప్రధాన సవాలు. కాబట్టి ాూ× వల్ల కలిగే ప్రయోజనాలను ఆస్వాదిస్తూనే, దాని పర్యావరణ ప్రభావాన్ని తగ్గించే మార్గాలను అన్వేషించడం చాలా అవసరం.

# ఆఫ్ఘనిస్థాన్‌తో వన్డే సిరీస్..

## కోహ్లీ స్థానంలో జట్టులోకి యశస్వి జైస్వాల్

ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టులోకి యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. గాయపడిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకుంటున్నట్లు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రకటించారు. జైస్వాల్ తన చివరి వన్డేలో సౌతాఫ్రికాపై అజేయ సెంచరీ (116 పరుగులు, నాటౌట్) తో అదరగొట్టడం విశేషం. ఇదే సిరీస్‌లో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ హార్దిక్ పాండ్యా ఆడటం వారి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టంచేశారు. వెన్నునొప్పితో బాధపడుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఇప్పటికే బెంగళూరులోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో రిహాబిలిటేషన్‌లో ఉండగా.. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న రోహిత్ కూడా త్వరలో అక్కడికి చేరుకుని ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతున్నప్పుడు కోహ్లీకి తొడ కండరానికి గాయమైంది. ఆ మ్యాచ్‌లో 75 పరుగులతో జట్టును గెలిపించినప్పటికీ ఆ తర్వాత గాయం తీవ్రత ఎక్కువవడంతో అతడు ఈ సిరీస్‌కు దూరమవాల్సి వచ్చింది. జూలైలో జరిగే ఇంగ్లండ్ వన్డే సిరీస్ నాటికి కోలుకునే అవకాశం ఉందని అగార్కర్ చెప్పారు. భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య వన్డే పోరు జూన్ 13న ధర్మశాల వేదికగా



ప్రారంభం కానుంది. ఆ తర్వాత మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు జూన్ 17న లక్నోలో, జూన్ 20న చెన్నైలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్ ముగిసిన తర్వాతే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే పూర్తిస్థాయి భారత వన్డే జట్టును సెలెక్టర్లు ప్రకటించనున్నారు. రోహిత్, హార్దిక్‌లు ఫిట్‌నెస్ సాధిస్తేనే ఈ సిరీస్‌లో ఆడతారని, లేదంటే జట్టులో మరికొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.

## ఒత్తిడి ఉండే కీలక టోర్నీల్లో అతడు గేమ్ ఛేంజర్‌గా మారగలడు.. భారత జట్టులోకి వైభవ్ ఎంపికపై బీసీసీఐ ఫస్ట్ రియాక్షన్

భారత క్రికెట్‌లో ఓ యువ సంచలనం సరికొత్త చరిత్ర సృష్టించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ ఏకంగా భారత సీనియర్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతోపాటు ఆసియా క్రీడల కోసం ప్రకటించిన భారత టీ20 జట్లలోనూ అతడికి స్థానం లభించింది. దాంతో భారత పురుషుల సీనియర్ జట్టుకు ఎంపికైన అత్యంత పిన్నవయస్కుడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. ఈ సందర్భంగా బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వైభవ్ ప్రతిభపై ప్రశంసల వర్షం కురిపించారు. వైభవ్ కీలక టోర్నీల్లో గేమ్ ఛేంజర్‌గా మారగలడని అన్నారు. యువ క్రికెటర్‌గా వైభవ్ అసాధారణ ప్రదర్శన కనబరుస్తున్నాడని కొనియాడారు. 'ఒక యువ ఆటగాడి గురించి ఏం చెప్పగలం..? అతడు ఏం చేయగలడో మీరంతా చూశారు. ఐపీఎల్




ప్లేఆఫ్స్‌లో కూడా దాదాపు ఒంటిచేత్తో రాజస్థాన్ రాయల్స్‌ను నడిపించాడు. అతని బ్యాటింగ్ గురించి నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సీజన్‌లోనే కాదు, గత సీజన్‌లోనూ అద్భుతంగా ఆడాడు. ఐపీఎల్ లాంటి అత్యంత పోటీ, ఒత్తిడి ఉండే టోర్నమెంట్‌లో అతడు ఎంతో విధ్వంసకరంగా, గేమ్ ఛేంజర్‌గా మారగలడు' అని అగార్కర్ చెప్పారు. క్రికెట్‌ను, ముఖ్యంగా టీ20 ఫార్మాట్‌ను చూసేవారికి వైభవ్‌పై భారీ అంచనాలున్నాయని అన్నారు. అతడు తన ప్రదర్శనతోనే జట్టులో చోటు దక్కించుకున్నాడని చెప్పారు.

# స్పోర్ట్స్

## అండర్18 హాకీ.. భారత మహిళల జట్టుకు కాంస్య పతకం



**కాకామిగహర:** జపాన్‌లో జరుగుతున్న మహిళల అండర్ 18 ఆసియాకప్ హాకీ(ఔశీఎవఅం ఖ18ాూంఱు జబజూ)లో భారత జట్టుకు కాంస్య పతకం దక్కింది. మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో కొరియాపై విజయాన్ని నమోదు చేసింది. సందీప్ కుమారి, స్వీటీ కుజుర్, నౌషీన్ నాజ్‌లు భారత్ తరపున గోల్స్ చేశారు. సెమీఫైనల్స్ మ్యాచ్‌లో చైనా చేతిలో షూటౌట్ ఓడిన భారత జట్టు బ్రాంజ్ మెడల్ ఫైట్‌లో గట్టిగా పోరాడింది. ఆరంభంలోనే డ్రీమ్ స్టార్ట్ అందింది. తొలి రెండు నిమిషాల్లోనే సందీప్ కుమారి గోల్స్ చేసింది. దీంతో ఇండియా ఈ మ్యాచ్‌లో దూకుడు ప్రదర్శించింది. మ్యాచ్ మొత్తం ఇండియా జట్టు అటాక్ చేసింది. ఇక ఆట 16వ నిమిషంలో స్వీటీ కుజుర్ ఫీల్డ్ గోల్‌తో ఆధిక్యాన్ని పెంచింది. రెండు గోల్స్‌తో భారత మహిళల జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఆ తర్వాత మళ్లీ 33వ నిమిషంలో భారత్‌కు మరో గోల్ దక్కింది. నౌషీన్ ఆ గోల్ స్కోరు చేసింది. ఈ టోర్నీలో నౌషీన్ తన ఖాతాలో మొత్తం 12 గోల్స్ వేసుకున్నది. సందీప్ కుమారి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నది.

# టాలీవుడ్ హీరోయిన్ల పాత్రలపై విమర్శలు.. గట్టి కౌంటర్ ఇచ్చిన నటి ఆషికా రంగనాథ్!



సౌత్ ఇండియన్ కమర్షియల్ సినిమాలలో, ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరోల చిత్రాలలో హీరోయిన్ల పాత్రల నిడివి, వారి ఎంపికలపై వచ్చే విమర్శలకు ప్రముఖ నటి ఆషికా రంగనాథ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. రామ్ చరణ్, ఎన్టీఆర్ వంటి టాప్ స్టార్స్ సరసన కేవలం భారీ రెమ్యునరేషన్, క్రేజ్ కోసమే హీరోయిన్లు నటిస్తున్నారని, నటనకు స్కోప్ లేని పాత్రలను గుడ్డిగా ఒప్పుకుంటున్నారని విమర్శకులు చేసే ఆరోపణలను ఆమె తీవ్రంగా తిప్పికొట్టారు. నటీమణులకు మద్దతుగా పరిశ్రమలోని అసలు వాస్తవాలను వివరిస్తూ ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు ప్రాధాన్యత లేకుండా పోవడానికి నటీమణులను నిందించడం ముమ్మాటికీ తప్పని, దీని వెనుక సినిమా ఇండస్ట్రీ నడిచే ఒక పెద్ద వ్యాపార వ్యవస్థ ఉందని ఆషికా పేర్కొన్నారు. చాలా మంది హీరోయిన్లకు ఇలాంటి భారీ పాన్-ఇండియా సినిమాల్లో నటించడం అనేది కేవలం నటనకు సంబంధించిన ఎంపిక మాత్రమే కాదని, తమ కెరీర్‌ను మార్కెట్‌లో నిలబెట్టుకోవడానికి చేసే ఒక వ్యూహాత్మక నిర్ణయమని (క్రితీఖ్వస్త్రఅఎ స్పష్టం చేశారు. సాధారణంగా పెద్ద కమర్షియల్ చిత్రాలలో హీరోయిన్ పాత్రలు కేవలం యాక్షన్ సీక్వెన్స్‌ల మధ్యలో వచ్చే గ్లామరస్ విరామాలు లాంటివని, హీరోయిన్ స్వంత ఇమేజ్ కంటే హీరో ఎలివేషన్‌ను పెంచేలాగే ఆ పాత్రలను చాలా జాగ్రత్తగా డిజైన్ చేస్తారని అభిప్రాయపడ్డారు. అందుకే నటీమణులపై అనవసర నిందలు వేయడం ఆపి, ఇప్పటికీ ఇలాంటి గ్లామర్ పాత్రలనే ప్రేక్షకులు ఇష్టపడతారని నమ్ముతున్న మేకర్స్‌ను, ఈ పాతకాలపు వ్యవస్థను ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. నటీనటులు ఎప్పుడైనా తమకు వచ్చే అవకాశాల పరిధిలోనే బెస్ట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తారని, పెద్ద ప్రాజెక్ట్‌లలో భాగమవడం ద్వారా దేశవ్యాప్తంగా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవ్వాలని ప్రతి ఒక్కరూ ఆశిస్తారని తెలిపారు. ఒక సినిమాలో హీరోయిన్ పాత్ర సరిగ్గా రాయబడకపోతే ఆ తప్పు రచయితలు, దర్శకులదే కానీ.. ఆ పాత్రల్లో నటించిన మహిళలది కాదని ఆషికా రంగనాథ్ చెప్పుకొచ్చారు.




## మూడు భాషల్లో డబ్బింగ్ చెప్పిన విజయ్ సేతుపతి.. జూన్ 8న 'స్లమ్‌డాగ్' టీజర్

టాలీవుడ్ దర్శకుడు పూరీ జగన్నాథ్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ప్యాన్ ఇండియా చిత్రం 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్ర టీజర్ కోసం నటుడు మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి డబ్బింగ్ పూర్తి చేసినట్లు పూరీ జగన్నాథ్ శనివారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ అప్‌డేట్‌లో అసలు విషయం ఏంటంటే.. విజయ్ సేతుపతి కేవలం ఒక భాషలోనే కాకుండా ఏకంగా మూడు భాషల్లో (తెలుగు, తమిళం, హిందీ) స్వయంగా డబ్బింగ్ చెప్పారు. ఈ విషయాన్ని పూరీ జగన్నాథ్ తన ఎక్స్ ఖాతాలో పంచుకుంటూ, విజయ్ సేతుపతి తన సొంత వాయిస్‌తో మూడు భాషల టీజర్‌కు అద్భుతమైన వాయిస్‌ను అందించారని, ఈ చిత్ర టీజర్‌ను జూన్ 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గతేడాది జూలైలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రేక్షకుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తిగా ముగిసిందని, ప్రస్తుతం అన్ని భాషలకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర యూనిట్ స్పష్టం చేసింది. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి స్టైలిష్ గాగుల్స్ ధరించి, చేతిలో రక్తం అంటిన కత్తితో, కరెన్సీ నోట్ల పెట్టెల మధ్య నిలబడి ఉన్న లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరీ జగన్నాథ్, ఛార్మీ కౌర్, జేబీ నారాయణరావు కొండ్రొల్ల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జేబీ మోషన్ పిక్చర్స్ భాగస్వామ్యంతో ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటి టబు, కన్నడ స్టార్ దునియా విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరి పాత్రలు కథను మలుపు తిప్పే విధంగా ఎంతో బలంగా ఉంటాయని సమాచారం. హీరోయిన్ సంయుక్త పాత్ర ఎమోషనల్ గా, నటనకు మంచి స్కోప్ ఉన్నదిగా ఉంటుందని, ఈ పాత్ర పట్ల ఆమె ఎంతో ఉత్సాహంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో తన అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న జాతీయ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.




## సుడిగాలి సుధీర్‌కి జోడీగా బిగ్ బాస్ బ్యూటీ

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'సుధీర్స్ జోకర్'. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు హీరోయిన్ అయేషా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. 'సుధీర్స్ జోకర్' చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ ఫార్మెన్స్ తో ప్రేక్షకుల్ని అలరించబోతోంది. రీసెంట్ గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన 'సుధీర్స్ జోకర్' మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే ఎక్స్ పెక్టేషన్స్ ఈ మూవీపై ఏర్పడుతున్నాయి.

## సమాజంలో మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతోంది.. బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ద్వంద్వ ప్రమాణాలపై, పితృస్వామ్య మనస్తత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు బాలీవుడ్ సీనియర్ నటి మాధురీ దీక్షిత్. ప్రేమ, బంధాల విషయంలో పురుషులను ఒకలా, స్త్రీలను మరోలా చూసే వివక్ష సమాజంలో ఇంకా బలంగా నాటుకుపోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పురుషుల శృంగార ఎంపికలను సమాజం గొప్పగా చూస్తుందని, అదే సమయంలో మహిళలు అలాంటి ఎంపికలు చేసుకుంటే తప్పుగా చిత్రీకరిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఇది పూర్తిగా పితృస్వామ్య సమాజమని, కాలం మారుతున్నా మొదటి నుంచి ఉన్న ఆ పాత ఆలోచనలే కొనసాగుతున్నాయని విమర్శించారు. పురుషుడికి ఎక్కువ మంది గర్ల్‌ఫ్రెండ్స్ ఉంటే అతడిని 'క్యాసనోవా' అని పిలుస్తూ గొప్పగా చూస్తారని, అదే ఒక మహిళకు ఎక్కువ మంది బాయ్‌ఫ్రెండ్స్ ఉంటే ఆమెను ఎంతో నెగెటివ్‌గా చూస్తూ రకరకాల పేర్లతో దూషిస్తారని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న తన తాజా చిత్రం 'మా బెహన్' సమాజం సృష్టించిన ఇలాంటి సాంప్రదాయ నిబంధనలను, కట్టుబాట్లను బద్దలు కొడుతుందని 59 ఏళ్ల మాధురీ దీక్షిత్ తెలిపారు. ఈ సినిమాలో సమాజం సృష్టించిన ప్రతి నియమాన్ని తాము బ్రేక్ చేశామని, ఆ పాత్రలు చేస్తున్నప్పుడు తాము ఎంతో ఆనందించామని చెప్పారు. ఇందులోని పాత్రలు ఎంతో గందరగోళంగా, నిజ జీవితంలో ఉండే సాధారణ మనుషులకు ఎంతో దగ్గరగా, రిలేటబుల్‌గా ఉంటాయని ఆమె వివరించారు. సురేష్ త్రివేణి దర్శకత్వంలో తెరకెక్కిన 'మా బెహన్' ఒక బ్లాక్ కామెడీ థ్రిల్లర్ చిత్రం. ఇందులో మాధురీ దీక్షిత్‌తో పాటు తృప్తి డిమ్రి, ధరణ దుర్గా, రవి కిషన్, గీతాంజలి కుల్కర్ణి, అరుణోదయ్ సింగ్, శార్దూల్ భరద్వాజ్ కీలక పాత్రలు పోషించారు.



# ఐక్యతతో డీలిమిటేషన్ బిల్లును ఓడించాం



కాంగ్రెస్ నేతృత్వంలో దిల్లీ వేదికగా సోమవారం ప్రారంభమైన ఇండి కూటమి సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు హాజరయ్యారు. ఈ భేటీలో కేంద్రంపై పోరాటంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ప్రజా సమస్యలే అజెండాగా ముందుకు సాగాలని విపక్ష నేతలు నిర్ణయించారు. రెండేళ్ల తర్వాత దిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన ప్రతిపక్ష నేతలు దేశంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ అందరూ కలిసి అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కూటమి ఛైర్మన్, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రారంభోన్యాసం చేశారు. పార్లమెంటులో రాజ్యాంగ (131 సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లులను ఓడించడంలో కూటమి కనబరిచిన ఐక్యతను ఖర్గే ప్రశంసించారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లను ప్రస్తావించారు. ా×= పేరుతో లక్షలమంది ఓటు హక్కులను కాలరాస్తున్నారని, దర్యాప్తు సంస్థలను పావులుగా వాడుకుంటూ కేంద్రం బీజేపీయేతర రాష్ట్రాలపై వివక్ష చూపిస్తోందని మండిపడ్డారు. పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు, నిరుద్యోగం, పరీక్షల వ్యవస్థ వైఫల్యం వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు.

"ఇండియా బ్లాక్ నాయకుల ఈ సమావేశానికి మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాను. ఈ కూటమి మూడేళ్ల మూడేళ్ల కిందట ఏర్పడింది. మన ముందున్న సమస్యలు మీ అందరికీ బాగా తెలుసు. అందుకే కాబట్టి నేను ఎక్కువసేపు మాట్లాడదలచుకోలేదు. 2026 ఏప్రిల్ 17న లోక్‌సభలో మనమందరం ఏకమై, డీలిమిటేషన్‌పై మోదీ ప్రభుత్వ దురుద్దేశపూర్వక బిల్లులను ఓడించి, మన ఐక్యతను,సంఘీభావాన్ని చాలా నిర్ణయాత్మకంగా ప్రదర్శించాము" అని అన్నారు.

**ఎజెండా ఏంటంటే?**

కూటమిలోని కొన్ని భాగస్వామ్య పక్షాల మధ్య ఇటీవల విభేదాలు తలెత్తడంతో ఈ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. అయితే సమావేశ ఎజెండా గురించి అడగ్గా విపక్ష నేతలను మీడియా అడగ్గా, దీనిపై కూటమి భాగస్వాములు సమష్టిగా నిర్ణయం తీసుకుంటాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడమే అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. అయితే ఈ సమావేశంలో చర్చలకు సంబంధించిన మరిన్ని విషయాలను త్వరలోనే వెల్లడిస్తామని అఖిలేశ్ యాదవ్ చెప్పారు.

మరోవైపు, చాలా రోజుల తర్వాత జరుగుతున్న ఈ సమావేశం ప్రతిపక్షాలకు ముఖ్యమైనదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. అయితే దీనికి సంబంధించి ప్రత్యేకమైన అజెండా ఏమీ లేదని తెలిపారు. 'బీజేపీ హటావో, దేశ్ బచావో' పిలుపుతో ప్రతిపక్ష కూటమి ఏర్పడిందని గుర్తుచేసిన ఆయన, ప్రజలకు సంబంధించిన సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ భాగస్వామ్య పార్టీలు పరస్పర విశ్వాసం, గౌరవంతో ఎలా కలిసి పనిచేయగలవు? అనే దానిపై సమావేశంలో చర్చిస్తారని రాజా తెలిపారు.

**డీఎంకే దూరం కాకుండా చర్చలు**

ప్రతిపక్ష కూటమి సమవేశంపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ సోమవారం బారామతిలో మీడియాతో మాట్లాడారు. ఇండి కూటమికి డీఎంకే దూరంకానుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మిత్ర పక్షాల పార్టీల కీలక నాయకులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇవాళ దిల్లీలో జరుగుతున్న సమావేశంలో కూటమిలోని సభ్యులు ఎలాంటి తీవ్రమైన నిర్ణయాలు లేదా చర్యలు తీసుకోకూడదని విజ్ఞప్తి చేయనున్నట్లు చెప్పారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి డీఎంకే దూరం కానుందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న 8 -15 రోజుల్లో కూటమికి చెందిన కీలక నేతలతో సమావేశం నిర్వహించి, సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ప్రయత్నిస్తామని పవార్ పేర్కొన్నారు. ఇలాంటి చర్చల వల్ల పరిష్కారం తప్పకుండా దొరుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్, సోనియాగాంధీ, టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ, తేజస్వి యాదవ్, అఖిలేష్ యాదవ్, సుప్రియా సూలే, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ సహా 23 పార్టీల ప్రతిపక్ష నేతలు హాజరయ్యారు. అయితే ఇవాళ మధ్యాహ్నం కూటమి నేతలు ప్రెస్?మీట్ నిర్వహించనున్నారు. అయితే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ తమకు ద్రోహం చేసిందని ఆరోపించిన డీఎంకే ఈ సమావేశానికి దురంగా ఉంది. అలాగే ఇండి కూటమిలో తాము భాగం కాదని ఇప్పటికే ప్రకటించిన ఆప్? కూడా ఈ సమావేశానికి హాజరుకావడం లేదు.

# సంక్షోభం వల్లే ఎల్‌పీజీ ధరల పెంపు అనివార్యమైంది

ప్రపంచ సంక్షోభం కారణంగా ఎల్‌పీజీ ధరల పెంపు అనివార్యంగా మారిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. గ్యాస్ సిలిండర్ ధరల పెంపు పట్ల కేంద్రం కూడా బాధపడుతోందని, అలాగే విచారం వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. ఇంధన రవాణా సజావుగా సాగకపోవడం, చాలా పరిమిత వనరుల నుంచే ఎల్‌పీజీ లభించడం వంటి సమస్యలు ఉన్నాయని వెల్లడించారు. కర్ణాటకలోని ధార్వాడ్‌లో విలేకరులతో జరిగిన సంభాషణలో ప్రహ్లాద్ జోషి ఈ మేరకు వ్యాఖ్యానించారు.

**'ప్రపంచం తీవ్రమైన సంక్షోభాలతో సతమతమవుతోంది'**

"గ్యాస్ సిలిండర్ ధరల పెంపు పట్ల మేము కూడా చాలా బాధపడుతున్నాం, విచారం వ్యక్తం చేస్తున్నాం. కానీ మమ్మల్ని విమర్శించే ముందు ప్రతి ఒక్కరూ ప్రపంచవ్యాప్త పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ప్రపంచం తీవ్రమైన సంక్షోభాల మధ్య సతమతమవుతోంది. రవాణా సజావుగా సాగకపోవడం, చాలా పరిమిత వనరుల నుంచే ఎల్‌పీజీ లభించడం వంటి సమస్యలు ఉన్నాయి. ఎల్‌పీజీ, పెట్రోల్/డీజిల్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం సేకరణ వనరులను పెంచడానికి ప్రయత్నిస్తోంది. భారత్‌కు చాలా దూరంలో ఉన్న దేశాల నుంచి కూడా గ్యాస్, ఇంధన సేకరణ జరుగుతోంది. రవాణా ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. మూల ధర కూడా అధికంగా ఉంది. అలాగే 40-45 రోజుల రవాణా సమయం కారణంగా బీమా ఖర్చులు



కూడా పెరిగాయి. కాబట్టి సామాన్యుల గురించి మాకూ ఆందోళన ఉంది. కానీ అదే సమయంలో గ్యాస్ ధరల పెంపు అనివార్యంగా మారింది. "

**అధికార పార్టీలో తీవ్ర అసంతృప్తి : ప్రహ్లాద్ జోషి**

అలాగే కన్నడనాట రాజకీయాలపై కూడా ప్రహ్లాద్ జోషి కీలక వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, బంధుప్రీతి, వర్గపోరుతో సతమతమవుతోందని ఆరోపించారు. అధికార పార్టీలో అంతర్గత అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఒక మంత్రి రాజీనామా చేశారని, మరికొందరు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. డీకే సర్కార్ పాలన అంత సవ్యంగా లేదని ఈ పరిస్థితులే స్పష్టం చేస్తున్నాయని అన్నారు.


**పెరిగిన గ్యాస్ ధర**

ప్రపంచవ్యాప్తంగా ఇంధన వ్యయాలు పెరిగి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో గృహ వినియోగ వంట గ్యాస్ (ఎల్‌పీజీ) ధర సిలిండర్‌కు రూ. 29 మేర పెంచింది కేంద్ర ప్రభుత్వం. గత మూడు నెలల్లో ఎల్‌పీజీ ధర పెరగడం ఇది రెండోసారి. పశ్చిమాసియాలో ఘర్షణల కారణంగా ఇంధన సరఫరాకు అంతరాయం కలిగి అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 7న సిలిండర్‌పై రూ. 60 పెంచింది. మళ్లీ జూన్ 7న గ్యాస్ సిలిండర్ రేటును పెంచుతూ కేంద్ర సర్కార్ నిర్ణయం తీసుకుంది. తాజా రేటు పెంపునకు ముందు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు విక్రయించే ప్రతి ఎల్‌పీజీ సిలిండర్‌పై సుమారు రూ. 703 నష్టాన్ని చవిచూస్తున్నట్లు అంచనా.

**గ్యాస్ రేటు పెంపును సమర్థించుకున్న కేంద్రం**

కాగా, వంట గ్యాస్ ధరల పెంపును సమర్థించుకుంటూ కేంద్రం కీలక ప్రకటన చేసింది. పశ్చిమాసియాలో అవాంతరాల తర్వాత ఎల్‌పీజీ ధర గణనీయంగా పెరిగినా ప్రపంచంలో అతి తక్కువ ధర మన దేశంలోనే ఉందని వెల్లడించింది. ఇళ్లకు వంటగ్యాస్ సిలిండర్ సరఫరాకు రూ. 1,600కుపైగా ఖర్చవుతోందని పేర్కొంది. సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్‌తో ముడిపడి ఇది మారుతుంటుందని వెల్లడించింది. హర్మూజ్ జలసంధి వద్ద ఏర్పడిన అంతరాయాల వల్ల గల్ఫ్ ప్రాంతం నుంచి సరఫరా తగ్గడంతో ఫిబ్రవరి నుంచి గ్యాస్ ఈ ప్రామాణిక ధర సుమారు 46 శాతం పెరిగిందని చెప్పింది. అయినప్పటికీ పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి పొరుగు దేశాల కంటే తక్కువ ధరకే భారత్‌లో వంట గ్యాస్ దొరుకుతోందని స్పష్టం చేసింది.

# ఇరాన్, ఇజ్రాయెల్ ఘర్షణపై భారత్ ఆందోళన



ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పశ్చిమాసియా ప్రాంతం మరోసారి అశాంతి దిశగా సాగుతోంది. పరస్పర దాడులు, క్షిపణి దాడులతో పరిస్థితి ఆందోళనకరంగా మారిన నేపథ్యంలో భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, శాంతి స్థాపన కోసం జరుగుతున్న దౌత్య చర్చలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్ని పక్షాలకు పిలుపునిచ్చింది. పశ్చిమాసియాలో తిరిగి దాడులు ప్రారంభం కావడం అంతర్జాతీయ సమాజానికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్న విషయమని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే 100 రోజులకు పైగా కొనసాగుతున్న ఈ ఘర్షణలు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయని తెలిపింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పాటు ఇంధన సరఫరాలపై కూడా ఈ యుద్ధ ప్రభావం తీవ్రంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది.

"పశ్చిమాసియాలో మళ్లీ దాడులు ప్రారంభం కావడం పట్ల భారత్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. ఈ పరిణామాలు ప్రపంచ దేశాలన్నింటికీ ఆందోళన కలిగిస్తున్నాయి. 100 రోజులకు పైగా కొనసాగుతున్న ఈ ఘర్షణల వల్ల మానవతా సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన సరఫరాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోంది" అని విదేశాంగ శాఖ పేర్కొంది. అన్ని పక్షాలు వెంటనే ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, పౌరులకు ఎలాంటి హాని జరగకుండా చర్యలు తీసుకోవాలని భారత్ సూచించింది. ప్రస్తుతం కొనసాగుతున్న దౌత్య చర్చలను త్వరగా ముగించి శాంతి, స్థిరత్వం పునరుద్ధరించే దిశగా ముందుకు సాగాలని కోరింది.

ఇటీవల జరిగిన పరిణామాల్లో ఇజ్రాయెల్ పశ్చిమ, మధ్య ఇరాన్ ప్రాంతాల్లో వైమానిక దాడులు నిర్వహించింది. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ ఉత్తర ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేపట్టినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఇదే అతిపెద్ద ఉద్రిక్తతగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత 24 గంటల్లో పలు నగరాలపై దాడులు, కీలక స్థావరాలపై వైమానిక దాడులు, భారీ స్థాయిలో క్షిపణుల ప్రయోగం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రాంతీయ భద్రతపై ఆందోళనలు మరింత పెరిగాయి.

ఇక ఎర్ర సముద్రం ప్రాంతంలో పరిస్థితులు కూడా ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌కు చెందిన నౌకల రాకపోకలను నిషేధిస్తున్నట్లు ప్రకటించినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన సముద్ర మార్గాల్లో ఇది కొత్త సవాళ్లను సృష్టించే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలు పరస్పర దాడులను నిలిపివేయాలని కోరినట్లు సమాచారం. రెండు దేశాలు సంయమనం పాటించి పరిస్థితిని మరింత ఉద్రిక్తం కాకుండా చూడాలని ఆయన సూచించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన ఈ ఘర్షణ ఇప్పటివరకు ముగిసే సూచనలు కనిపించకపోవడం ప్రపంచ దేశాలను కలవరపెడుతోంది. ముఖ్యంగా ఇంధన ఉత్పత్తి, సరఫరాలపై ప్రభావం పడటం వల్ల చమురు ధరలు పెరిగే అవకాశాలపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రాంతీయ భద్రత, వాణిజ్య మార్గాల రక్షణ, ప్రపంచ ఆర్థిక స్థిరత్వంపై కూడా ఈ యుద్ధం ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో శాంతియుత పరిష్కారమే ఏకైక మార్గమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. యుద్ధం కంటే దౌత్య చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ, అన్ని పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరింది. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరణ కోసం జరుగుతున్న చర్చలు విజయవంతం కావాలని ఆకాంక్షించింది.

## జూలైలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం



సుదీర్ఘకాలంగా చర్చల దశలో ఉన్న భారత్-అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుకుంది. వచ్చే జూలైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరుదేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరుదేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తిస్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జూలై మధ్య నాటికి ఇరుదేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలుచేసే స్థితికి చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారుల భేటీ తర్వాతే మళ్లీ ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు. అయినప్పటికీ వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరుదేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. అమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పిన టైమ్‌లైన్ ప్రకారం అన్నీ సజావుగా సాగితే జూలై మధ్యకల్లా ఇరుదేశాల మధ్య సరికొత్త ఆర్థిక అధ్యాయం మొదలవుతుంది.

## అంగీకారంతో కూడిన శారీరక సంబంధం చెడు ప్రవర్తనకు సంకేతం కాదు



మేజర్ల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కాని ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధాన్ని కలిగి ఉండడాన్ని చెడు ప్రవర్తనగా భావించకూడదని స్పష్టం చేసింది. ప్రేమ విషయంలో నమోదైన ఒక క్రిమినల్ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అలాగే కేసులో తెలంగాణ పోలీస్ నియామక మండలికి కీలక ఆదేశాలు జారీ చేసింది. నియామక ప్రక్రియలో పరిగణించి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. కేసు వివరాల ప్రకారం, పిటిషన్ దారుడు తన పొరుగింటి యువతితో కొన్నేళ్ల పాటు ప్రేమ సంబంధం కొనసాగించాడు. ఇద్దరి మధ్య ఉన్న ఆ సంబంధం తర్వాత వివాహ సంబంధంగా మారలేదు. దీంతో 2014లో వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశాడంటూ అతడిపై కేసు నమోదైంది. అయితే తర్వాత ఇరువురు పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చారు. 2015లో లోక్ అదాలత్‌లో ఆ వివాదం పరిష్కారమైంది. కేసును కొనసాగించేందుకు యువతి ఆసక్తి చూపలేదు. దీంతో వ్యవహారం అక్కడితో ముగిసింది. అయినప్పటికీ, ఆ కేసు నేపథ్యంలో అతడిపై నైతిక అపరాధం (మోరల్ టర్పిట్యూడ్) ముద్ర పడిందని భావించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు నియామకాన్ని రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అతడి వాదనను సమర్థిస్తూ నియామకాన్ని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఆ తీర్పును సవాలు చేస్తూ అధికారులు అప్పీల్‌కు వెళ్లగా, చివరకు సుప్రీంకోర్టు కూడా అభ్యర్థికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

**వివాహంతోనే ప్రేమ ముగియాలనే నియమం లేదు!**

ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రతి ప్రేమ సంబంధం వివాహంతోనే ముగియాలనే నియమం లేదని పేర్కొంది. కేవలం వివాహం జరగలేదనే కారణంతో ఒక వ్యక్తి మరొకరిని మోసం చేశాడని తేల్చేయడం సరికాదని స్పష్టం చేసింది. సంబంధం విఫలమైందంటే అది తప్పనిసరిగా మోసమే అని భావించలేమని పేర్కొంది. అదేవిధంగా, సంబంధంలో బెదిరింపులు లేదా ఒత్తిడి ఉన్నట్లు ఆధారాలు ఉంటే నియామక సంస్థలు అభ్యర్థి అర్హతపై సందేహాలు వ్యక్తం చేయవచ్చని ధర్మాసనం తెలిపింది. అయితే ప్రస్తుత కేసులో అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించలేదని పేర్కొంది. యువతితో బలవంతంగా రాజీ ఒప్పందం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

**చట్టపరమైన పరిమితుల్లోనే!**

క్రిమినల్ న్యాయ వ్యవస్థలో ఒక వ్యక్తిపై ఆరోపణలు నిరూపితమయ్యే వరకు అతడిని నిర్దోషిగానే పరిగణిస్తామని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఆరోపణలు ఉన్నాయనే కారణంతోనే అతడిని దోషిగా చూడలేమని తెలిపింది. ముఖ్యంగా మోసం జరిగిందా లేదా అనే విషయాన్ని సంబంధిత బాధితురాలు మాత్రమే వివరించగలదని పేర్కొంది. ఈ కేసులో యువతి స్వయంగా కేసును కొనసాగించేందుకు ఆసక్తి చూపకపోవడం, ఎలాంటి సాక్ష్యాలు సమర్పించకపోవడం, పైగా రాజీకి అంగీకరించడం వంటి అంశాలను ధర్మాసనం ప్రస్తావించింది. అలాంటి పరిస్థితుల్లో నియామక అధికారులు తమంతట తామే ఊహాగానాలు చేసి అభ్యర్థి వ్యక్తిత్వంపై చెడు అభిప్రాయం ఏర్పరచుకోవడం సమంజసం కాదని స్పష్టం చేసింది. సంబంధిత వ్యక్తుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన అంశాలను చట్టపరమైన పరిమితుల్లోనే పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137